www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శనివారం | 25-10-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 206 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం; తిథి: చవితి తె.3.49 తదుపరి పంచమి; నక్షత్రం: అనూరాధ ఉ.7.52 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: మ.2.08-3.56; దుర్ముహూర్తం: ఉ.6.14-7.46; అమృతఘడియలు: రా.12.54-2.42; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.14; సూర్యాస్తమయం: 5.43

డిజిటల్ సేవలు @ టెలికం సైబర్ సెక్యూరిటీ!

టెలికం సైబర్ సెక్యూరిటీ నిబంధనలను నోటిఫై చేసిన కేంద్ర ప్రభుత్వం 2

వాట్సాప్, జొమాటో, స్విగ్గీ, ఓలా, ఉబర్, ఫోన్ పే, పేటీఎం తదితర సంస్థలన్నీ సర్కారు ఆదేశాలకు అనుగుణంగా పనిచేయాల్సిందే

సైబర్ నేరాలను అరికట్టేందుకే కొత్త నిబంధనలు!



అగ్ని కీలల్లో వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు

అగ్నికి ఆహుతి

19 మంది సజీవ దహనం

కర్నూలు సమీపంలో ఘోర ప్రమాదం

హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్తున్న 'వేమూరి కావేరి' బస్సు

జాతీయ రహదారిపై బైక్‌ను ఢీకొట్టి 200 మీటర్లు అలాగే ఈడ్చుకెళ్లిన డ్రైవర్

బస్సు కింద ఇరుక్కుపోయిన పల్సర్ బైక్.. పెట్రోల్ ట్యాంకు మూత ఊడి మంటలు

క్షణాల్లో బస్సుకు వ్యాపించిన అగ్నికీలలు.. సెన్సర్లు పనిచేయక తెరుచుకోని డోర్లు

బయటికి వచ్చే దారి లేక ప్రయాణికుల ఆర్తనాదాలు.. బస్సులోనే మాడిమసి

డీఎన్ఏ పరీక్షల అనంతరమే మృతదేహాల అప్పగింత

27 మంది సురక్షితంగా బయటకు.. బస్సు ఢీకొనడంతో యువకుడి మృతి

దీపావళి సెలవులు సరదాగా గడిపి తిరిగి బయలుదేరిన వారు కొందరు... ఉద్యోగం కోసం ఇంటర్వ్యూలకు వెళ్తున్న వారు కొందరు... వ్యాపార, ఇతర అవసరాల కోసం ప్రయాణమైన వారు కొందరు... గమ్యస్థానం బెంగళూరు... స్లీపర్ బస్సులో ఆదమరిచి నిద్రిస్తున్నారు! అదే వారికి శాశ్వత నిద్ర అయ్యింది. బహుశా... 'బస్సు ఢీ... బైకర్ మృతి' అని మాత్రమే వినాల్సిన వార్త! కానీ... మొత్తంగా 20 నిండు ప్రాణాలు సజీవ దహనమయ్యాయి. వారిలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఉన్నారు. తెలుగు రాష్ట్రాలతోపాటు ఆరు రాష్ట్రాలకు చెందిన వారు బాధితులుగా మిగిలారు. కర్నూలు నగరానికి 22 కిలోమీటర్ల దూరంలో జరిగిన పెను విషాదమిది! ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు, ఇతర అధికార వర్గాలు అందించిన సమాచారం ప్రకారం..... ఇవీ ఆ వివరాలు!

ఆఖరి ప్రయాణం..

- మృతుల్లో ఆరు రాష్ట్రాలకు చెందిన వారు ఉన్నారు. తెలంగాణ వాసులు ఆరుగురు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు ఆరుగురు మరణించారు. తమిళనాడు 2, కర్ణాటక 2, బిహార్, ఒడిశా వాసులు ఒక్కొక్కరు చొప్పున మరణించారు. రిజర్వేషన్ లేకుండా ఆరాంఘర్‌లో ఎక్కిన వ్యక్తి ఎవరనేది గుర్తించాల్సి ఉంది.
- ప్రమాద సమయంలో బస్సులో 46 మంది ఉండగా... 27 మంది సురక్షితంగా బయటపడ్డారు.



ప్రమాదానికి ముందు రోజు స్నేహితులు గోళ్ల రమేశ్, నెలకుర్తి రమేశ్ తమ కుటుంబీకులతో కలిసి హుస్సేన్‌సాగర్‌లో బోటు షికారు.



పూర్తిగా తగలబడిన ట్రావెల్స్ బస్సు

(కర్నూలు - ఆంధ్రజ్యోతి)

అది... 'వేమూరి కావేరి' ట్రావెల్స్ బస్సు! డీడీ01 ఎన్9490 నంబర్... మల్టీ యాక్సిల్ స్కానియా ఏసీ స్లీపర్ బస్! హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళుతోంది! గురువారం రాత్రి 10.30 గంటలకు హైదరాబాద్‌లోని లక్డీకాపూల్‌లో బయలుదేరింది. 11:05 గంటలకు ఆరాంఘర్ చౌరస్తాకు చేరుకుంది. అక్కడ ముగ్గురు ప్రయాణికులను ఎక్కించుకొని ఎన్‌హెచ్-44పై బెంగళూరు దిశగా కదిలింది. రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులు 39 మంది... టికెట్ అక్కర్లేని చిన్న పిల్లలు నలుగురు... మధ్యలో ఎక్కిన మరో ప్రయాణికుడు... ఇద్దరు డ్రైవర్లు! బస్సులో మొత్తం 46 మంది! బెంగళూరులో వివిధ కంపెనీల్లో పని చేసే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ప్రైవేట్ కంపెనీల్లో పని చేసే ఉద్యోగులు, వివిధ వ్యాపారాలు చేసే వాళ్లు... పనులపైనా, దీపావళి పండుగ సెలవుల కోసం హైదరాబాద్‌కు వచ్చి.. తిరిగి బెంగళూరుకు

మిగతా 13వ పేజీలో...

12

ఈ ఆనందం ఇదే ఆఖరు

నెల్లూరు మిత్రుల కుటుంబాల్లో 'చిచ్చు'

ఓ కుటుంబం ఆహుతి.. మరొకరు క్షేమం

ప్రయాణం వాయిదానే ప్రాణం తీసింది

మెదక్ రూరల్ మండలం శివాయిపల్లి తల్లి, కూతుళ్ల మృత్యువాత

నాన్నా.. బస్సెక్కా.. అదే చివరిమాట

యాదాద్రి జిల్లా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అనూషరెడ్డి ఇంట్లో విషాదం

13

రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి

మృతుల కుటుంబాలకు కేంద్రం పరిహారం రూ.2 లక్షలు.. మరో రూ.5 లక్షలు ప్రకటించిన తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు

బస్సు ప్రమాదం బాధాకరం: సీఎం రేవంత్

పొరుగు 'మార్గం'లో ప్రైవేటు

ట్రావెల్స్ ప్రమాదాలకు ఎన్నో కారణాలు

ఈశాన్యంలో రిజిస్ట్రేషన్లు.. ఇక్కడ సర్వీస్‌లు

అక్కడ ఫీజు తక్కువగా ఉండటంతో మొగ్గు

ఆపరేటర్లకు వరంగా ఆలిండియా పర్మిట్

రవాణ శాఖ నియంత్రణ అంతంతే

బీఎస్-6 వాహనాల్లో సమస్యల చిక్కులు

కాసుల కక్కుర్తితో స్లీపర్లలో సీట్ల డిజైన్

12



పురస్కారం అందుకుంటున్న తుర్లపాటి రాజేశ్వరి

తుర్లపాటి రాజేశ్వరికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం ప్రదానం

10

కోల్‌కతా జాతీయ లైబ్రరీలో అందజేత

50 వేల నగదు, తామ్రపత్రంతో సన్మానం

పట్టణాల ప్రగతికి భారీ నిధులు

138 మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల అభివృద్ధికి రూ.2780 కోట్లు విడుదల

మార్చికల్లా పనుల పూర్తికి పురపాలకశాఖ ఆదేశం

చిన్న కాంట్రాక్టర్లకు రూ.100 కోట్లు విడుదల

సీఎంకు మంత్రి కోమటిరెడ్డి కృతజ్ఞతలు.. హ్యామ్ విధానంలో రూ.10,547 కోట్లతో రోడ్ల నిర్మాణం.. చిన్న కాంట్రాక్టర్లు సైతం పాల్గొనవచ్చని స్పష్టీకరణ



హైదరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కోర్ అర్బన్ సిటీ మినహా రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులకు సర్కారు భారీగా నిధులు విడుదల చేసింది. తెలంగాణ రైజింగ్ విజన్-2027లో భాగంగా గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని పట్టణాలను గ్రోత్ హబ్‌గా తీర్చి దిద్దాలని ఇప్పటికే నిర్ణయించిన సీఎం రేవంత్ రెడ్డి.. మెరుగైన పౌర సదుపాయాల కల్పన, ప్రజల నుంచి వస్తున్న డిమాండ్లకనుగుణంగా మున్సిపాలిటీల అభివృద్ధికి వెంటనే నిధులు విడుదల చేయాలని ఆదేశించారు. ఈ మేరకు 138 మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థల్లో 2,432 పనులు చేపట్టేందుకు రూ.2,780 కోట్ల నిధులను మంజూరు చేసింది. నగరాభివృద్ధికి బడ్జెట్‌లో కేటాయించిన నిధులతో పాటు పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి నిధి (యూఐడీఎఫ్) నుంచి ఈ నిధులు మంజూరయ్యాయి. కొత్త మున్సిపాలిటీలు, పాత మున్సిపాలిటీలకు రూ.15 కోట్ల చొప్పున.., అదనంగా గ్రామ పంచాయతీలు విలీనమైన

మిగతా 10వ పేజీలో...

నేడు ఢిల్లీకి సీఎం రేవంత్ 3

డీసీసీ అధ్యక్షుల ఎంపిక కసరత్తులో పాల్గొనేందుకే..



అరచేతిపై మహిళా డాక్టర్ రాసిన సూసైడ్ నోట్; నిందితుడు ఎస్సై గోపాల్ బాద్నే

అరచేతిపై సూసైడ్‌నోట్..

వైద్యురాలి ఆత్మహత్య

మహారాష్ట్రలో దారుణం.. ఓ ఎస్సై తన మీద పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడంటూ ప్రాణం తీసుకున్న ప్రభుత్వ డాక్టర్

మరో పోలీసు అధికారి మానసికంగా వేధించాడని వెల్లడి

పోస్టుమార్టం, ఫిట్‌నెస్‌లపై నకిలీ నివేదికల కోసం పోలీసు అధికారులు తీవ్రమైన ఒత్తిడి తెచ్చినట్లు ఆరోపణలు 2

గతంలోనే ఉన్నతాధికారులకు లేఖ రాసినా పట్టించుకోని వైనం

ఘటనపై తీవ్ర రాజకీయ దుమారం.. ఎస్సైపై వేటు

జూబ్లీహిల్స్ బరిలో 58 మంది

23 మంది నామినేషన్ల ఉపసంహరణ

బరిలో అభ్యర్థులు ఎక్కువగా ఉన్నందున 4 బ్యాలెట్ యూనిట్లు వినియోగించే చాన్స్

మొత్తం ఓటర్లు 4,01,365

గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే 16,100 మంది ఓటర్ల పెరుగుదల 10

తల మీద తుపాకీ పెడితే.. ఒప్పందాలు కుదుర్చుకోం 2

భారత్ తొందరపడి నిర్ణయాలు తీసుకోదు

వాణిజ్య ఒప్పందాలు దీర్ఘకాలిక దృక్పథంతో ఉండాలి.. కొత్త మార్కెట్లను అన్వేషిస్తున్నాం

జర్మనీలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

ఫిల్మ్ చాంబర్‌లో ఎన్నికల లొల్లి!



గడువు ముగిసినా ఎన్నికలు జరపని కార్యవర్గం.. నిరవధిక వాయిదాకు యత్నం

ఎన్నికలు జరపాలంటున్న మరోవర్గం

చాంబర్ స్థలంలో భారీ భవనానికి కసరత్తు

ఆర్థిక ప్రయోజనాల కోసమే వాయిదా!

ప్రస్తుత కార్యవర్గంపై ప్రత్యర్థి వర్గం ఆరోపణ

మంత్రుల దగ్గరకు చాంబర్ పంచాయితీ

(సినిమా డెస్క్)

తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్! తెలుగు సినిమారంగంలోని వివిధ విభాగాల మధ్య సమన్వయం కోసం, వాటి తరఫున ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపేందుకు ఏర్పడిన సంస్థ. తెలుగు సినిమా ప్రతిష్ఠ అంతర్జాతీయ స్థాయికి చేరుకున్న తరుణంలో చాంబర్‌లో జరుగుతున్న వ్యవహారాలు సభ్యులను ఇబ్బంది పెడుతున్నాయి. చాంబర్‌కు ఎన్నికలు జరగకుండా చూడటానికి ఒక వర్గం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. మరోవర్గం ఎన్నికలు జరిపి సంస్కరణలు చేపట్టాలని పట్టుదలగా ఉంది. రెండు వర్గాల పంచాయితీ ప్రభుత్వం వద్దకు చేరింది. ప్రస్తుత పాలక మండలి ఎన్నికలను

మిగతా 10వ పేజీలో...

అప్పుల్లో మనమే టాప్!

కుటుంబ రుణాల్లో అగ్రస్థానంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ

దేశంలోనే దక్షిణాదిలో రుణాలు అధికం

సామాజికవర్గాల ప్రకారం బీసీల్లో గరిష్ఠం.. ఎస్టీల్లో కనిష్ఠం.. కేంద్ర గణాంకాలశాఖ

దక్షిణాది ప్రజలకు రుణ చెల్లింపు సామర్థ్యం ఎక్కువ.. నిపుణుల అభిప్రాయం 2

వంగర గురుకుల పాఠశాల విద్యార్థిని ఆత్మహత్య

తల్లిదండ్రులకు విద్యార్థినులను కలిసే అవకాశం ఇవ్వని సిబ్బంది!

మనోధైర్యం కోల్పోయి ఘాతుకానికి పాల్పడిందన్న విద్యార్థిని తల్లిదండ్రులు 11

విచారణకు ఆదేశించిన పొన్నం

తల మీద తుపాకీ పెడితే..
ఒప్పందాలు కుదుర్చుకోం

» కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్



బెర్లిన్/న్యూఢిల్లీ, అక్టోబరు 24: అమెరికా, యూరోపియన్ యూనియన్ (ఈయూ) సహా పలు దేశాలు, ప్రాంతాలతో వాణిజ్య ఒప్పందాలపై భారత్ చురుగ్గా చర్చలు జరుపుతోందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. తొందరపాటుతో లేదా తలకు తుపాకీ పెట్టడంతో భారత్ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోబోదని ఆయన శుక్రవారం కరాఖండీగా చెప్పేశారు. "మేము ఈయూతో చురుగ్గా చర్చలు జరుపుతున్నాం. అమెరికాతోనూ మాట్లాడుతున్నాం. మేము తొందరపడి ఒప్పందాలు కుదుర్చుకోం. గడువులతో లేదా తలకు తుపాకీ పెట్టడంతో ఒప్పందాలు చేసుకోబోం" అని జర్మనీలో జరిగిన బెర్లిన్ గ్లోబల్ డైలాగ్ ఆయన పేర్కొన్నారు. ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులను పెంచే మార్గాల గురించి చర్చించడానికి నాయకులు, బెర్లిన్ వ్యాపారుల సమావేశంలో పాల్గొనేందుకు కేంద్ర మంత్రి బెర్లిన్‌కు వెళ్లారు. అధిక సుంకాలను ఎదుర్కోవడంలో భాగంగా భారత్ కొత్త మార్కెట్లపై దృష్టిసారిస్తోందని గోయల్ చెప్పారు. ఒక దేశం నుంచి ఒక నిర్దిష్ట ఉత్పత్తిని కొనుగోలు చేయాలనే నిర్ణయాన్ని మొత్తం ప్రపంచం తీసుకోవాలన్నారు. రష్యా నుంచి ముడిచమురు కొనుగోలు చేయడాన్ని ఆపాలని భారత్‌పై అమెరికా ఒత్తిడి చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పీయూష్ గోయల్ తాజాగా చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

అయోధ్య రామాలయ దర్శన వేళల్లో మార్పులు

అయోధ్య, అక్టోబరు 24: అయోధ్యలోని బాల రాముడి ఆలయంలో దర్శన సమయాల్లో అధికారులు స్వల్ప మార్పులు చేశారు. జన్మభూమి పథం గుండా ఇప్పటివరకు రాత్రి 9 గంటల వరకు భక్తులను దర్శనాలకు అనుమతిస్తున్నారు. ఆ సమయాన్ని అరగంట పాటు కుదించి ఇకపై 8:30 వరకే అనుమతించనున్నారు. శీతాకాలం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు రామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టీ అనిల్ మిశ్రా ప్రకటించారు. శయన హారతి సమయాన్ని కూడా సవరించి, రాత్రి 10 గంటలకు బదులుగా 9:30కు నిర్వహిస్తారు. అదేవిధంగా ఉదయం వేళ జరిగే కార్యక్రమాల్లోనూ స్వల్ప మార్పులు జరిగాయి. మంగళ హారతి 4 గంటలకు బదులుగా 4:30కు, శృంగార హారతి 6 గంటలకు బదులుగా 6:30కు నిర్వహిస్తారు. భక్తులకు సాధారణ దర్శనాలు యథావిధిగా ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమవుతాయి.

అమెరికాలో రెండు ఉద్యోగాలు చేస్తోన్న భారతీయుడి అరెస్టు

» 15 ఏళ్ల జైలుశిక్ష విధించే అవకాశం!

న్యూయార్క్, అక్టోబరు 24 : అమెరికాలో రెండు ఉద్యోగాలు(మూన్‌లైటింగ్) చేస్తోన్న ఓ భారతీయుడిని అక్కడి అధికారులు అరెస్టు చేశారు. మెహుల్ గోస్వామి(39) అనే ఆ వ్యక్తి న్యూయార్క్‌లో ఉంటూ.. న్యూయార్క్ స్టేట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సర్వీసెస్ కార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నాడు. అదే సమయంలో మాల్టా పట్టణంలోని గ్లోబల్ ఫౌండ్రీస్ అనే సెమికండక్టర్ కంపెనీలో 2022 మార్చి నుంచి కాంట్రాక్టర్‌గానూ చేస్తున్నాడు. దీనిపై ఒక ఈమెయిల్ ద్వారా సమాచారం అందడంతో అధికారులు విచారణ చేపట్టి అతడు రెండు ఉద్యోగాలు చేస్తున్నట్లు నిర్ధారించారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ విధులను నిజాయితీగా నిర్వహించాలని, కాని గోస్వామి దాన్ని ఉల్లంఘించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 15న గోస్వామిని అరెస్టు చేసి జడ్జి ముందు హాజరుపరిచారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై అతడు విడుదల అయ్యాడు. ఈ కేసు దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది. విచారణలో నేరం నిరూపణ అయితే అతడికి దాదాపు 15 ఏళ్ల జైలుశిక్షతోపాటు జరిమానా విధించే అవకాశం ఉందని అంచనా.

తీరప్రాంత గస్తీకి 'అజిత్', 'అపరాజిత్'

న్యూఢిల్లీ, అక్టోబరు 24: భారత తీరప్రాంత రక్షణ సామర్థ్యాన్ని మరింత పెంచే దిశగా మరో కీలక ముందడుగు పడింది. భారతీయ కోస్ట్ గార్డ్ (ఐసీజీ) కోసం గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్ (జీఎస్‌ఎల్) నిర్మించిన రెండు అడ్వాన్స్‌డ్ ఫాస్ట్ పెట్రోలింగ్ నౌకలు (ఎఫ్‌పీవీ) 'ఐసీజీఎస్ అజిత్', 'ఐసీజీఎస్ అపరాజిత్' శుక్రవారం ప్రారంభమయ్యాయి. తీరప్రాంత గస్తీ, మత్స్య సంపద సంరక్షణ, అక్రమ రవాణా నిరోధం, పైరసీ నిరోధంతో పాటు సెర్చ్, రెస్క్యూ ఆపరేషన్లు నిర్వహించే సత్తా కలిగిన ఈ రెండు ఎఫ్‌పీవీలను గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో ప్రారంభించినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఐసీజీ కోసం జీఎస్‌ఎల్ నిర్మించిన ఎనిమిది స్వదేశీ ఎఫ్‌పీవీల శ్రేణిలో ఇవి చివరి (ఏడు, ఎనిమిది) నౌకలని పేర్కొంది. వీటి చేరికతో తీరప్రాంత నిఘా, స్పందించే సామర్థ్యం పెరుగుతాయని వెల్లడించింది. 52 మీటర్ల పొడవు, 320 టన్నుల బరువు కలిగిన ఈ నౌకల్లో నియంత్రించదగిన పిచ్ ప్రొపెల్లెంట్లు అమర్చినట్లు తెలిపింది.


కార్బయిడ్ గన్ల అమ్మకాలపై మధ్యప్రదేశ్ నిషేధం

భోపాల్, అక్టోబరు 24: కార్బయిడ్ తుపాకుల విక్రయాలపై మధ్యప్రదేశ్ ప్రభుత్వం నిషేధం విధించింది. వీటిని ఉపయోగించడం వల్ల నేత్ర సంబంధిత గాయాలతో, ఆస్పత్రుల్లో చేరేవారి సంఖ్య పెరగడంతో ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. దీపావళి సంబరాల్లో భాగంగా ప్రమాదకరమైన కార్బయిడ్‌గన్ పేల్చడంతో ఆ రాష్ట్రంలో కేవలం మూడు రోజుల్లోనే దాదాపు 300మంది చిన్నారులు తీవ్ర మైన కంటి గాయాలతో ఆస్పత్రి పాలవగా, 10 మంది శాశ్వతంగా చూపును కోల్పోయారు. గ్యాస్ లైటర్, ప్లాస్టిక్ పైపులు, కాల్షియం కార్బయిడ్ ఉపయోగించి తయారుచేసే ఈ నాటు తుపాకులను పేల్చినప్పుడు ఒక్కోసారి రసాయన రేణువులు, నిప్పురవ్వలు ముఖంపై చిమ్మి, కంటి రెటీనాను పూర్తిగా నాశనం చేస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

జమ్మూ-కశ్మీర్‌లో రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీకి 1, నేషనల్ కాన్ఫరెన్స్‌కు 3 సీట్లు

శ్రీనగర్, అక్టోబరు 24: జమ్మూ-కశ్మీర్‌లో నిర్వహించిన రాజ్యసభ స్థానాల ఎన్నికల ఫలితాలు శుక్రవారం వెల్లడయ్యాయి. మొత్తం నాలుగు స్థానాలకు ఎన్నికలు జరగగా మూడింటిలో అధికారిక నేషనల్ కాన్ఫరెన్స్, ఒక స్థానంలో బీజేపీ విజయం సాధించాయి. నేషనల్ కాన్ఫరెన్స్‌కు చెందిన చౌదరి మహమ్మద్ రమ్‌జాన్, సాజద్ కిచ్లూ, జి.ఎస్.ఒబెరాయ్ అలియాస్ షమ్మీ ఒబెరాయ్ గెలుపొందారు. నాలుగో స్థానంలో బీజేపీకి చెందిన సత్ శర్మ విజయం సాధించారు. శర్మకు 32 ఓట్లు రాగా, ప్రత్యర్థి అయిన నేషనల్ కాన్ఫరెన్స్ యువ అధికార ప్రతినిధి ఇమ్రాన్ నబీ దర్‌కు 22 వచ్చాయి. ఈ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్, బీజేపీలు మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డాయని పీపుల్స్ కాన్ఫరెన్స్ చీఫ్ సాజద్ లోన్ ఆరోపించారు.

వీఐటీఈఈఈ-2026 కోసం దరఖాస్తుల ఆహ్వానం



చెన్నై, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఫ్లాగ్‌షిప్ ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌ల్లో ప్రవేశానికి వేలూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(వీఐటీ) దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. వీఐటీఈఈఈ-2026 పేరిట నిర్వహించనున్న పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు వేలూరు, చెన్నై, అమరావతి, భోపాల్‌లోని వీఐటీ ప్రాంగణాల్లో ప్రవేశాలు కల్పించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు www.viteee.vit.ac.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దేశంలోని 134 నగరాలు, 9 అంతర్జాతీయ పరీక్షా కేంద్రాల్లో వచ్చే ఏడాది ఏప్రిల్ 28 నుంచి మే 3వ తేదీ వరకు ఈ పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు తమకు దగ్గరగా ఉన్న ఏదో ఓ కేంద్రాన్ని ఎంచుకోవచ్చని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో, అద్భుతమైన ప్లేస్‌మెంట్ అవకాశాలతో ఇంజనీరింగ్ విద్యకు కేరాఫ్‌గా వీఐటీ నిలుస్తోందని వివరించారు. తమ కలల కెరీర్ వైపు అడుగులు వేయాలనుకునే విద్యార్థులకు ఇది సువర్ణ అవకాశమని పేర్కొన్నారు.


అప్పుల్లో మనమే టాప్!

కుటుంబ రుణాల్లో అగ్రస్థానంలో ఏపీ, తెలంగాణ.. దేశంలోనే దక్షిణాదిలో అత్యధికం

» కేంద్ర గణాంకాలశాఖ వెల్లడి

» దక్షిణాది ప్రజలకు రుణచెల్లింపు సామర్థ్యం అధికం

» అందుకనే రుణసంస్థలు అప్పులిస్తున్నాయ్.. నిపుణులు



న్యూఢిల్లీ/అమరావతి, అక్టోబరు 24: సామాజిక, ఆర్థిక అంశాల్లో ముందంజలో ఉండే దక్షిణాది రాష్ట్రాలకు చెందిన కుటుంబాలు అప్పులు తీసుకోవటంలోనూ దేశంలోని ఇతర రాష్ట్రాల కంటే ముందున్నాయి. ఇక మొత్తం దక్షిణాదిలో రెండు తెలుగు రాష్ట్రాలు అగ్రస్థానంలో ఉన్నాయి. ప్రతీ ఆరు నెలలకోమారు విడుదలయ్యే కేంద్ర గణాంకాలశాఖ జర్నల్ 'సర్వేక్షణ' ఈ వివరాలను వెల్లడించింది. దీని ప్రకారం.. దేశంలోని వయోజనుల్లో అప్పు తీసుకున్న వారి సంఖ్య సగటున 15 శాతం కాగా.. దక్షిణాది రాష్ట్రాలన్నింటా ఇది 20 శాతానికిపైనే ఉంది. అన్నింట్లోకి అగ్రస్థానంలో ఆంధ్రప్రదేశ్ నిలవటం గమనార్హం. ఆ రాష్ట్రంలో అప్పు తీసుకున్న వయోజనుల సంఖ్య సగటున 43.7 శాతం. ఆ తర్వాత స్థానంలో తెలంగాణ 37.2 శాతంతో ఉంది. తదుపరి స్థానాల్లో కేరళ (29.9%), తమిళనాడు (29.4%), పుదుచ్చేరి (28.3%), కర్ణాటక (23.2%) ఉన్నాయి. ఇతర రాష్ట్రాల విషయానికొస్తే.. ఛత్తీస్‌గఢ్ 6.5%, అస్సాం 7.1%, గుజరాత్ 7.2%, జార్ఖండ్ 7.5%, పశ్చిమ బెంగాల్ 8.5%, హరియాణా 8.9% మంది రుణగ్రహీతలను కలిగి ఉన్నాయి. ఢిల్లీలో అత్యల్పంగా కేవలం 3.4 శాతం మంది మాత్రమే రుణం తీసుకున్నట్లు తెలిపారు.

అగ్రస్థానంలో బీసీలు

దేశంలో అప్పులు తీసుకుంటున్న వ్యక్తులను, కుటుంబాలను సామాజికవర్గాల ప్రకారం పరిశీలిస్తే.. 16.6 శాతంతో బీసీలు అగ్రస్థానంలో నిలువగా.. 11 శాతంతో ఎస్టీలు అత్యంత దిగువన ఉన్నారు. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల పరంగా స్వల్ప తేడానే ఉంది (పట్టణాలు-14%, గ్రామీణ ప్రాంతాలు-15%). అలాగే మతాలవారీగానూ పెద్దగా తేడాల్లేవు. మహిళలకంటే పురుషులు, వివాహితులు, చిన్న కుటుంబాల వారు ఎక్కువగా అప్పులు తీసుకుంటున్నట్లు తేలింది. 2020-21లో నిర్వహించిన 78వ బహుళ ప్రయోజనకర సర్వేలో వెల్లడైన అంశాల ఆధారంగా ఈ వివరాలను నమోదు చేశారు. సర్వేలో భాగంగా 15 లేదా అంతకంటే ఎక్కువ వయసు ఉన్న వారిని ప్రశ్నించారు. సర్వే సమయానికి కనీసం రూ.500 లేదా అంతకంటే ఎక్కువ అప్పు ఉన్న వారి వివరాలు సేకరించారు. ఈ నివేదికపై ఆర్థిక నిపుణులు స్పందిస్తూ.. దక్షిణాది రాష్ట్రాల ప్రజల తలసరి ఆదాయం, ఆస్తులు ఎక్కువ కాబట్టి, రుణాలు తిరిగి చెల్లించే సామర్థ్యం ఉంటుందని, అందువల్లే రుణసంస్థలు వారికి అప్పులను గణనీయంగా ఇస్తున్నాయని పేర్కొన్నారు.

అరచేతిపై సూసైడ్‌నోట్..
వైద్యురాలి ఆత్మహత్య

» ఓ ఎస్సై తన మీద పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడంటూ ప్రాణం తీసుకున్న ప్రభుత్వ డాక్టర్

» మహారాష్ట్రలో దారుణం.. ఎస్సైపై వేటు

ముంబై, అక్టోబరు 24: ఆమె ఓ ప్రభుత్వ వైద్యురాలు! తనపై ఓ పోలీసు అధికారి గత ఐదునెలల్లో నాలుగుసార్లు దారుణ అత్యాచారానికి పాల్పడ్డాడని.. అతడి తీవ్ర శారీరక, మానసిక వేధింపులను తాళలేకే ప్రాణాలు తీసుకుంటున్నానంటూ అరచేతిపై సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్నారు. మహారాష్ట్రలో గురువారం రాత్రి జరిగిన ఈ ఘటన ఆ రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. తీవ్ర రాజకీయ దుమారానికి దారితీసింది. ఘటనపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతుండటంతో మహారాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టింది. ముఖ్యమంత్రి ఫడణవీస్ ఆదేశాల మేరకు వైద్యురాలు ఆరోపణలు గుప్పించిన ఎస్సైని సస్పెండ్ చేస్తున్నట్లు అక్కడి పోలీసు ఉన్నతాధికారులు ప్రకటించారు. మృతురాలు సతారా జిల్లాలో వైద్య అధికారిగా పనిచేస్తున్నారు. తనపై గోపాల్ బాద్నే అనే ఎస్సై నాలుగుసార్లు అత్యాచారానికి పాల్పడ్డాడని అరచేతిపై ఆమె రాసుకున్నారు. అసిస్టెంట్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ లాడ్‌పుత్రే కూడా తనను మానసికంగా తీవ్ర వేధింపులకు గురిచేశారని ఆమె ఆరోపించారు. ఈ పోలీసు అధికారుల వేధింపుల గురించి ఆమె గతంలోనే.. అంటే జూన్ 19న ఫల్టాన్ డీఎస్పీకి లేఖ రాశారు. లేఖలో ఆమె ఇవే ఆరోపణలు చేశారు. గోపాల్, లాడ్‌పుత్రే కారణంగా తాను తీవ్ర మానసిక ఒత్తిడిలో కూరుకుపోయానని.. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి, విచారణ చేసి, ఆ ఇద్దరు పోలీసు అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని లేఖలో ఆమె కోరారు. వైద్యురాలు రెండేళ్ల క్రితమే సతారా ఆస్పత్రిలో డ్యూటీలో చేరారు. పోస్టుమార్టం, ఫిట్‌నెస్‌లపై నకిలీ నివేదికల కోసం ఆమెపై పోలీసు అధికారులు తీవ్ర ఒత్తిడి చేశారని.. ఆ వేధింపులు భరించలేకే ఆమె ప్రాణాలు తీసుకున్నారని వైద్యురాలి బంధువు ఆరోపించారు. పోలీసు అధికారుల వేధింపులపై డీఎస్పీ, ఎస్పీకి ఆమె రెండు, మూడుసార్లు లేఖలో ఫిర్యాదు చేశారని.. అయినా ఎలాంటి చర్యలూ తీసుకోలేదని ఆయన విమర్శించారు. వైద్యురాలి చావుకు కారణమైన పోలీసు అధికారులను వెంటనే అరెస్టు చేసి.. మరణశిక్ష విధించాలని డిమాండ్ చేశారు. వైద్యురాలి ఆత్మహత్య ఘటన నేపథ్యంలో మహారాష్ట్ర సర్కారుపై ఆ రాష్ట్ర కాంగ్రెస్ నేత నాందేవ్ రావు ఎక్స్ వేదికగా తీవ్ర విమర్శలు గుప్పించారు. మహిళలను రక్షించాల్సిన పోలీసులే వారిని వేధిస్తే న్యాయం ఎలా జరుగుతుంది? అని ప్రశ్నించారు. తన పట్ల పోలీసు అధికారుల దుశ్చర్యలపై గతంలోనే బాధితురాలు లేఖలు రాసినప్పుడు ఎందుకు చర్యలు తీసుకోలేదు? అని నిలదీశారు. దారుణాలకు పాల్పడుతున్న పోలీసులకు మహారాష్ట్ర ప్రభుత్వమే కాపాడుతోందని తీవ్ర విమర్శలు చేశారు. వైద్యురాలి ఆత్మహత్య ఘటన దురదృష్టకరమని మహారాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వామి అయిన బీజేపీ పేర్కొంది. తన మీద జరుగుతున్న వేధింపులపై వైద్యురాలు గతంలోనే ఉన్నతాధికారులకు లేఖ రాసినట్లుగా తమ దృష్టికి వచ్చిందని, దీనిపై విచారణ జరుపుతామని బీజేపీ ఎమ్మెల్సీ, మహారాష్ట్ర మహిళా ప్రెసిడెంట్ చిత్రావాగ్ పేర్కొన్నారు. కాగా గతంలో వైద్యురాలు రాసిన లేఖపై విచారణ జరిపి, నివేదిక ఇవ్వాలంటూ మహారాష్ట్ర మహిళా కమిషన్, ఆ రాష్ట్ర పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది.

లోకం తీరు



ఉబర్, ఓలాకు పోటీగా
'భారత్ ట్యాక్సీ'

» సహకార విధానంలో తెస్తున్న కేంద్రం


» వచ్చే నెల నుంచి ఢిల్లీలో పైలట్ ప్రాజెక్టు

» డిసెంబరు నుంచి దేశవ్యాప్తంగా విస్తరణ

న్యూఢిల్లీ, అక్టోబరు 24: క్యాబ్ సర్వీసులు అందించే ఓలా, ఉబర్‌లకు పోటీగా 'భారత్ ట్యాక్సీ' వస్తోంది. క్యాబ్ నిర్వాహకుల నుంచి ఎలాంటి కమీషన్లు వసూలు చేయకుండా, సహకార పద్ధతిలో నిర్వహించే ఈ సర్వీసుతో.. అటు క్యాబ్ నిర్వాహకులకు, ఇటు ప్రయాణికులకు ప్రయోజనం కలగనుంది. ఓలా, ఉబర్ సంస్థలు క్యాబ్ నిర్వాహకులు, డ్రైవర్ల నుంచి అడ్డగోలుగా 25% వరకు కమీషన్లు వసూలు చేస్తున్నాయని.. ప్రయాణాల రద్దు, రద్దీ సమయాల పేరిట ప్రయాణికుల నుంచి అడ్డగోలు చార్జీలు వసూలు చేస్తున్నాయనే ఆరోపణలున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ప్రైవేటు క్యాబ్ సర్వీసులకు ప్రత్యామ్నాయాన్ని అందుబాటులోకి తేవడం.. క్యాబ్ నిర్వాహకులు, డ్రైవర్లకు ప్రయాణ చార్జీలు పూర్తిగా అందేలా చేయడం లక్ష్యంగా.. కేంద్ర సహకారశాఖ, జాతీయ ఈ-గవర్నెన్స్ విభాగం (ఎన్‌ఈజీడీ) 'భారత్ ట్యాక్సీ'ని రూపొందించింది. రూ.300 కోట్ల మూలధనంతో 'సహకార్ ట్యాక్సీ కో-ఆపరేటివ్ లిమిటెడ్' సంస్థను ఏర్పాటు చేసింది. ఇందులో క్యాబ్ నిర్వాహకుల నుంచి కేవలం రోజువారీ, నెలవారీ సభ్యత్వ రుసుమును మాత్రమే తీసుకుంటారు. నవంబర్ నుంచి ఢిల్లీలో పైలట్ ప్రాజెక్టుగా 650 క్యాబ్‌లతో 'భారత్ ట్యాక్సీ'ని ప్రారంభించనున్నారు. డిసెంబర్‌లో ముంబై, పుణె, భోపాల్, లక్నో, జైపూర్ సహా 20 నగరాలకు, వచ్చే ఏడాది మార్చి నాటికి ప్రధాన నగరాలన్నింటికీ భారత్ ట్యాక్సీని విస్తరిస్తారు. 2030 నాటికి లక్ష మంది క్యాబ్ డ్రైవర్లను భారత్ ట్యాక్సీకి అనుసంధానం చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.

ప్రచార వ్యూహకర్త పీయూష్ పాండే కన్నుమూత

» 'అబ్‌కీ బార్ మోదీ సర్కార్' నినాదం ఆయన సృష్టించిందే



ముంబై, అక్టోబరు 24: పదకొండేళ్ల క్రితం లోక్‌సభ ఎన్నికల సమయంలో బీజేపీ ప్రచారానికి 'అబ్‌కీ బార్ మోదీ సర్కార్' నినాదాన్ని రూపొందించిన ప్రచార వ్యూహకర్త పీయూష్ పాండే శుక్రవారం తెల్లవారుజామున ముంబైలో కన్నుమూశారు. ఆయన వయస్సు 70 ఏళ్లు. 1982లో ఒగిల్వీ ఇండియా ప్రకటనల సంస్థలో చేరిన ఆయన తన ప్రకటనల్లో పాశ్చాత్య ధోరణులను పక్కనబెట్టి భారతీయ భాషల్లోని భావోద్వేగాన్ని చేర్చడం ద్వారా కొత్త ఒరవడిని సృష్టించారు. అన్ని భాషల సంస్కృతులను మేళవిస్తూ దేశం మొత్తాన్ని ఉర్రూతలూగించిన 'మిలే సుర్ మేరా తుమారా' పాటను ఈయనే రాశారు. పల్స్ పోలియో ప్రచారానికి 'దో బూంద్ జిందగీ కీ', క్యాడ్‌బరీ డైరీ మిల్క్ చాక్లెట్ కోసం 'కుచ్ ఖాస్ హై', ఫెవికాల్ కోసం 'ఫెవికాల్ కా మజ్‌బూత్ జోడ్ హై, టూటేగా నహీ' పంచ్ లైన్లతో ఆయన రూపొందించిన ప్రకటనలు సూపర్ డూపర్ హిట్ అయ్యాయి. ఇంటింటా జనం గొంతులో పలికాయి. పీయూష్ పాండే పద్మశ్రీ గ్రహీత. రాజస్థాన్ తరఫున రంజీ క్రికెట్ ఆడారు. ఆయన సోదరి ఇలా అరుణ్ ప్రముఖ బాలీవుడ్ నటి. 2013లో మద్రాస్ కేఫ్ సినిమాలో నటించారు. పీయూష్ పాండే మృతికి ప్రధాని నరేంద్ర మోదీ, బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్ తదితరులు సంతాపం తెలిపారు. ఆయన సృజనాత్మక మేధోశక్తిని గుర్తు చేసుకున్నారు.

డిజిటల్ సేవలు @ టెలికం సైబర్ సెక్యూరిటీ!

ఆయా సంస్థలన్నీ నిబంధనలు పాటించాల్సిందే



» టెలికం సైబర్ సెక్యూరిటీ నిబంధనలు నోటిఫై చేసిన కేంద్రం

న్యూఢిల్లీ, అక్టోబరు 24: వాట్సాప్ నుంచి పేమెంట్ యాప్‌లు, ఆహారాన్ని సరఫరా చేసే యాప్‌ల వరకు.. మొబైల్ నంబర్ల ఆధారంగా డిజిటల్ సేవలందించే సంస్థలన్నింటినీ కేంద్ర ప్రభుత్వం 'టెలికం సైబర్ సెక్యూరిటీ నియంత్రణ'ల పరిధిలోకి తెచ్చింది. సైబర్ నేరాలను అరికట్టేందుకు గాను టెలికమ్యూనికేషన్స్ (టెలికం సైబర్ సెక్యూరిటీ) సవరణ నిబంధనలు 2025ను ఈ నెల 22న నోటిఫై చేసింది. ఈ నిబంధనలు తక్షణమే అమల్లోకి వస్తాయని తెలిపింది. ఈ నిబంధనల ప్రకారం.. ఒకేసారి వేర్వేరు డిజిటల్ సేవలు పొందే వినియోగదారుల ఖాతాలను నిలిపివేసే అధికారాలు సంబంధిత సంస్థలకు ఉంటాయి. అలాగే వాడిన ఫోన్ల అమ్మకం లేదా కొనుగోలు చేసేముందు ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే 'మొబైల్ నంబర్ వెరిఫికేషన్ (ఎంఎన్‌వీ)' వ్యవస్థలో డేటాబేస్ తనిఖీలు తప్పనిసరి చేసింది. దొంగిలించిన లేదా ఫోర్జరీ చేసిన మొబైల్ కనెక్షన్లు, ఫోన్ హ్యాండ్‌సెట్లతో చేస్తున్న సైబర్ నేరాలను అరికట్టడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టింది. తాజా నిబంధనల్లో 'టెలికమ్యూనికేషన్ ఐడెంటిఫయర్ యూజర్ ఎంటైటీస్ (టీఐయూఈ)' అనే కొత్త విభాగాన్ని సృష్టించారు. లైసెన్స్ టెలికం ఆపరేటర్లు మినహా ఫోన్ నంబర్ల ఆధారంగా వినియోగదారులను గుర్తించి, సేవలందించే వ్యాపార సంస్థలన్నీ దీని పరిధిలోకి వస్తాయి. జొమాటో, స్విగ్గీ, ఫోన్‌పే, పేటీఎం, ఓలా, ఉబర్ వంటి సంస్థలు టీఐయూఈ విభాగంలోకి వస్తాయి. మెసేజింగ్ సేవల విషయంలో ఎయిర్‌టెల్, జియోలు కూడా ఈ కోవకే చెందుతాయి. కొత్త నిబంధనల మేరకు ఈ టీఐయూఈలు తప్పనిసరిగా ప్రభుత్వ ఆదేశాలను పాటించాల్సి ఉంటుంది. ఫోన్ నంబర్లను సస్పెండ్ చేయడం, ఆయా సంస్థలు వాడే ఫోన్ నంబర్ల డేటాకు సంబంధించిన అభ్యర్థనలకు స్పందించడం, అధికారులు సూచించిన విధంగా వినియోగదారుల గుర్తింపును తనిఖీ చేయడం వంటివి చేయాల్సి ఉంటుంది. భద్రతా కారణాల రీత్యా ప్రభుత్వం ఒక ఫోన్ నంబరును నిలిపివేయవచ్చు. అలాగే ఆ నంబరు వినియోగాన్ని నిలిపివేయాలని టెలికం ఆపరేటర్లు, యాప్‌లను ఆదేశించవచ్చు. ప్రజాప్రయోజనాల రీత్యా ముందుగా ఎలాంటి నోటీసు ఇవ్వకుండానే సంబంధిత సేవలను నిలిపివేయవచ్చు. దేశంలో రోజురోజుకూ పెరిగిపోతున్న సైబర్ నేరాలను అడ్డుకునేందుకే కొత్త నిబంధనలను అమల్లోకి తెచ్చినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

పెన్షన్ పథకాల్లో మరో రెండు ఐచ్ఛికాలు

న్యూఢిల్లీ, అక్టోబరు 24: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం అమలు చేస్తున్న నేషనల్ పెన్షన్ స్కీం (ఎన్‌పీఎస్), యూనిఫైడ్ పెన్షన్ స్కీం(యూపీఎస్)లలో మరో రెండు పెట్టుబడుల ఐచ్ఛికాలను అమలు చేయనున్నట్టు శుక్రవారం కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటించింది. లైఫ్ సైకిల్ (ఎల్‌సీ), బ్యాలెన్స్‌డ్ లైఫ్ సైకిల్ (బీఎల్‌సీ) పేరుతో వీటిని అమలు చేయనున్నట్టు తెలిపింది. పదవీ విరమణ ప్రణాళికలను మరింత సరళతరం చేసి, పెట్టుబడులకు మరిన్ని అవకాశాలు కల్పించడమే దీని లక్ష్యమని పేర్కొంది. ఉద్యోగులు నచ్చిన స్కీంను ఎంచుకోవచ్చని తెలిపింది. షేర్లలో పెట్టుబడులు పెట్టడానికి అవకాశం కలిగించింది. లైఫ్ సైకిల్ ఆప్షన్‌లో ఎల్‌సీ-25 కింద గరిష్ఠంగా 25% వరకు ఈక్విటీలను కేటాయిస్తారు. 35 ఏళ్ల నుంచి 55 ఏళ్లు వచ్చే వరకు కొనసాగించవచ్చు. ఎల్‌సీ-50 కింద రిటైర్మెంట్ నిధిలో గరిష్ఠంగా 50% వరకు ఈక్విటీలు కేటాయిస్తారు. ఎల్‌సీ-50కి కొన్ని మార్పులు చేసి బ్యాలెన్స్‌డ్ లైఫ్ సైకిల్ (బీఎల్‌సీ) ఆప్షన్‌ను రూపొందించారు. దీనికింద 45 ఏళ్లు వచ్చిన తరువాతే పెట్టుబడులు పెట్టవచ్చు. పెట్టుబడులను నచ్చినంత కాలం కొనసాగించుకునే వెసులుబాటు ఉంది. ఎల్‌సీ 75 కింద గరిష్ఠంగా 75% ఈక్విటీలు ఇస్తారు. 35 నుంచి 55 ఏళ్లు వచ్చే వరకు వీటిని కొనసాగించవచ్చు. స్కీం-జీ కింద 100% సొమ్మును ప్రభుత్వ సెక్యూరిటీల్లో పెట్టవచ్చు. పీఎఫ్ఆర్‌డీఏ అమలు చేస్తున్న వివిధ రకాల పథకాల్లోనూ పెట్టుబడులు పెట్టే అవకాశం ఉంది.

పాక్‌కు అఫ్గాన్ జలాలు కట్!

» కునార్ నదిపై డ్యామ్ నిర్మాణానికి అఫ్గాన్ నిర్ణయం

న్యూఢిల్లీ, అక్టోబరు 24: దాయాది పాకిస్థాన్‌తో సింధూజలాల ఒప్పందాన్ని రద్దు చేసుకున్న భారత్ బాటలోనే అఫ్గానిస్థాన్ కూడా నడుస్తోంది. యుద్ధం నేపథ్యంలో సరిహద్దుల గుండా ప్రవేశించే కునార్ నదీ జలాలు పాక్ భూభాగంలోకి ప్రవేశించకుండా కట్టడి చేయాలని అఫ్గాన్ నిర్ణయం తీసుకుంది. దీని కోసం కునార్ నదిపై అతి త్వరలోనే డ్యామ్‌ను నిర్మిస్తామని తాలిబన్ సుప్రీం లీడరు మౌలావీ హిబాతుల్లా అఖుంద్‌జాదా ప్రకటించారు. డ్యామ్ నిర్మాణం విషయంలో అఫ్గాన్ పాలకులు పట్టుదలగా ఉన్నారని లండన్ కేంద్రంగా పనిచేస్తున్న ఆ దేశ జర్నలిస్టు సమీ యూసఫ్‌జయ్ తెలిపారు. విదేశీ నిర్మాణ సంస్థల కోసం వేచి చూడకుండా దేశీయ కంపెనీలకే కాంట్రాక్టు ఇచ్చి కునార్ నది వద్ద పనులు వెంటనే మొదలుపెట్టాలని జల వనరులు, ఇంధన మంత్రిత్వశాఖను సుప్రీం లీడరు ఆదేశించారని పేర్కొన్నారు. ఈశాన్య అఫ్గానిస్థాన్‌లోని హిందూకుష్ పర్వతాల్లో జన్మించిన కునార్ నది 480 కిలోమీటర్లు ప్రవహించి బ్రోఘిల్ పాస్ వద్ద పాక్ భూభాగంలోకి ప్రవేశిస్తుంది. చిత్రాల్‌గా పాక్‌లో పిలిచే ఈ నది ఖైబర్ పంఖ్తుంఖ్వా ప్రాంత సాగు, తాగునీటి అవసరాలు తీరుస్తోందని సమీ యూసఫ్‌జయ్ 'ఎక్స్'లో తెలిపారు. కాగా, యుద్ధం నేపథ్యంలో పాకిస్థాన్, అఫ్గానిస్థాన్‌ల మధ్య సరిహద్దులు మూసుకుపోయాయి. రెండు దేశాల్లోనూ నిత్యావసరాల ధరలు మండిపోతున్నాయి. పాక్‌లో ఎక్కువగా వినియోగించే టమాటా కేజీ రూ.187 పలుకుతోంది. సరుకులతో నిండిన దాదాపు 5000 కంటైనర్లు సరిహద్దుకు అటూఇటూ నిలిచిపోయాయి.

నితీశ్ నేతృత్వంలో ఎన్డీయే రికార్డులు బద్దలు కొడుతుంది

» ఎన్డీయే సీఎం అభ్యర్థిపై సందిగ్ధత తొలగించిన ప్రధాని


బిహార్ ఎన్నికల ప్రచారంలో మోదీతో నితీశ్

పట్నా, అక్టోబరు 24: బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం నితీశ్ నేతృత్వంలో ఎన్డీయే గత రికార్డులన్నింటినీ బద్దలు కొడుతుందని ప్రధాని మోదీ చెప్పారు. అభివృద్ధిలో బిహార్ దూసుకుపోతుందని, మరోసారి ఎన్డీయే ప్రభుత్వం ఘన విజయం సాధించబోతుందన్నారు. బిహార్‌లోని బెగుసరాయ్, సమస్తీపూర్ జిల్లాల్లో ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొన్న ఆయన ఎన్డీయే సీఎం అభ్యర్థిపై నెలకొన్న సందిగ్ధతను తొలగించారు. సభకు హాజరైన వారితో సెల్‌ఫోన్ లైట్ ఆన్ చేయించి... ఎన్డీయే పాలనలో కావాల్సినంత వెలుగుండగా విపక్ష మహాగఠ్‌బంధన్ లాంతరు(ఆర్జేడీ ఎన్నికల గుర్తు) అవసరమా అని మోదీ ప్రశ్నించారు. గత 11 ఏళ్లుగా యూపీఏ హయాం కంటే మూడింతల ఎక్కువ నిధులు బిహార్‌కు ఇచ్చినట్లు మోదీ చెప్పారు. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలు కీలకమని చెబుతూ పార్లమెంట్‌లో మహిళా బిల్లు పెట్టినప్పుడు ఆర్జేడీ కాంగ్రెస్ అడ్డుకున్నాయని చెప్పారు. అయితే, బిహార్‌లో ఎన్డీయే గెలిచినా నితీశ్‌ను సీఎం చేయరని మహాగఠ్‌బంధన్ సీఎం అభ్యర్థి తేజస్వీ యాదవ్ అన్నారు. నితీశ్‌ను మోదీ, షా హైజాక్ చేశారని ఆరోపించారు.

యువత సాధికారత కోసం కృషి చేస్తున్నాం

దేశంలోని యువత సాధికారత కోసం కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం కృషి చేస్తోందని మోదీ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలను త్రుటిలో కోల్పోయిన వారికి ప్రైవేటు రంగంలో అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. శుక్రవారం ఢిల్లీలో 17వ రోజ్‌గార్(ఉద్యోగ) మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన 51 వేల మందికి నియామక పత్రాలను అందించారు. ఈ మేళాను ఉద్దేశించి ప్రధాని సందేశమిచ్చారు. ఇప్పటి వరకు నిర్వహించిన రోజ్‌గార్ మేళాలలో 11 లక్షల మందికి నియామకపత్రాలు అందించామన్నారు. 'ప్రతిభ సేతు' పోర్టల్‌ను తీసుకువచ్చామన్న ఆయన.. అఖిల భారత ఉద్యోగ నియామకాల్లో త్రుటిలో అవకాశం కోల్పోయిన వారికి కొత్త అవకాశాలు సృష్టించడమే ఈ పోర్టల్ లక్ష్యమన్నారు.

చిన్న కాంట్రాక్టర్లకు 100కోట్లు విడుదల

సీఎంకు కృతజ్ఞతలు చెప్పిన మంత్రి కోమటిరెడ్డి

- 'హ్యామ్'లో 10,547కోట్లతో రోడ్ల నిర్మాణం
- చిన్న కాంట్రాక్టర్లు సైతం పాల్గొనవచ్చని స్పష్టీకరణ
- సీఎం, మంత్రికి బీఏఐ ధన్యవాదాలు



హైదరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రోడ్లు, భవనాల శాఖలో చిన్న చిన్న పనులు చేసిన కాంట్రాక్టర్లకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. చాలా కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న బకాయిల్లో రూ.100కోట్లను శుక్రవారం విడుదల చేసింది. ఈ మేరకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పందిస్తూ.. రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తూ, బిల్లుల చెల్లింపులో ఆర్‌అండ్‌బీ శాఖకు అండగా నిలుస్తున్న సీఎం రేవంత్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పారు. మరో రూ.50 కోట్ల బిల్లులను త్వరలో చెల్లిస్తామని కాంట్రాక్టర్లకు భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో రూ.10,547 కోట్లతో హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హ్యామ్)లో 5,566 కిలోమీటర్ల మేర రోడ్లను ఉన్నతీకరించబోతున్నట్టు పేర్కొన్నారు. హ్యామ్ పనుల్లో చిన్న కాంట్రాక్టర్లూ పాల్గొనవచ్చని వివరించారు. బిల్లుల చెల్లింపుల విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. వచ్చే రెండేళ్లలో తెలంగాణ రోడ్లు దేశానికే రోల్ మోడల్‌గా మారనున్నాయని, ఆర్ అండ్ బీ మంత్రిగా తాను మాటిస్తున్నానని చెప్పారు. కాగా, బిల్లులకు సంబంధించిన నిధుల విడుదలపై సీఎం రేవంత్, ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాతీయ ఉపాధ్యక్షుడు డీవీఎన్ రెడ్డి, తెలంగాణ విభాగం చైర్మన్ సురేందర్ ధన్యవాదాలు తెలిపారు. చిన్న చిన్న పనులు చేసి ఎంతో కాలంగా బిల్లుల కోసం ఎదురు చూస్తున్న చిన్న కాంట్రాక్టర్లకు ఉపశమనం లభించిందని పేర్కొన్నారు.

మంత్రితో ఏవియేషన్ జేఎండీ రోహిత్ భేటీ

రాష్ట్ర ఏవియేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియామకమైన రోహిత్‌రెడ్డి శుక్రవారం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రోహిత్‌కు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలో ఏవియేషన్ రంగం అభివృద్ధితో పాటు పలు అంశాలపై వారి మధ్య చర్చ జరిగింది.



ఆస్ట్రేలియాలోని విక్టోరియా పార్లమెంట్‌ను సందర్శించిన మంత్రి శ్రీధర్‌బాబు

రండి.. కలిసి అద్భుతాలు ఆవిష్కరిద్దాం

- ఆస్ట్రేలియా పర్యటనలో మంత్రి శ్రీధర్ బాబు
- ప్రఖ్యాత మోనాష్ వర్సిటీ ప్రతినిధులకు ఆహ్వానం

హైదరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు రండి.. కలిసి అద్భుతాలు ఆవిష్కరిద్దామని మెల్‌బోర్న్‌లోని ప్రఖ్యాత 'మోనాష్' యూనివర్సిటీ ప్రతినిధులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం వర్సిటీని సందర్శించారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీస్, గ్లోబల్ హెల్త్ ఇన్నోవేషన్, లైఫ్ సైన్సెస్, బయో టెక్నాలజీ, మెడికల్ డివైసెస్, సస్టైనబుల్ ఇంజనీరింగ్ క్రిటికల్ మినరల్స్ రీసెర్చ్ తదితర రంగాల్లో వినూత్న ఆవిష్కరణల కోసం తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ముందుకు రావాలని ఈ సందర్భంగా కోరారు. ఇక్కడి ప్రముఖ విద్యాసంస్థలను భాగస్వామ్యం చేస్తూ జాయింట్ రీసెర్చ్ ప్రోగ్రామ్స్, ప్రాజెక్టులు, ఫ్యాకల్టీ, స్టూడెంట్ ఎక్స్చేంజ్‌లు, కో-ఇన్నోవేషన్ ఇనిషియేటివ్స్‌ను చేపట్టాలన్నారు. అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా తెలంగాణను 'గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్'గా మార్చేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. భారత్ ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, ఏఐ ఇన్నోవేషన్ హబ్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ క్వాంటం కంప్యూటింగ్, తెలంగాణ డేటా ఎక్స్చేంజ్, టీ హబ్, టీ వర్క్స్ తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్రంలో వినూత్న ఆవిష్కరణలు, పరిశోధనలకు ఈ భాగస్వామ్యం మరింత ఊతమిస్తుందని మంత్రి శ్రీధర్ బాబు అభిప్రాయపడ్డారు. 'గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్'గా మారేందుకు అవసరమైన ఎకో సిస్టం కలిగిన తెలంగాణ లాంటి రాష్ట్రాలతో కలిసి పని చేసేందుకు ఆసక్తిగా ఉన్నట్లు వర్సిటీ అకడమిక్ అఫైర్స్ వైస్-ప్రోవోస్ట్ ప్రొఫెసర్ మ్యాథ్యూ గిలెస్పీ వెల్లడించారు. శాసనాల తయారీలో పౌరుల భాగస్వామ్యం పెరిగినప్పుడే పారదర్శకత, జవాబుదారీతనం కూడా పెరుగుతుందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం 'విక్టోరియా పార్లమెంట్'ను సందర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణలో చట్టసభ పనితీరు, పాలనా సంస్కరణల గురించి వివరించారు.

రెండు బైకులు ఢీ.. ఒకరి మృతి

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలంలో ఘటన

ఉట్నూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని వంతెన పైనుంచి కింద పడిపోవడంతో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలంలోని ఎండా గ్రామ సమీపంలో గురువారం రాత్రి జరిగింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని జైనూర్ మండలం గోందిపటార్ గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ కొండిబా (40) అనారోగ్యంతో బాధపడుతున్న తన తండ్రి వెంకటిని జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించడానికి తీసుకెళ్లాడు. అనంతరం ద్విచక్రవాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. అదే సమయంలో ఆదిలాబాద్‌లోని భుక్తాపూర్‌కు చెందిన కూరగాయల వ్యాపారి సోఫియాన్, అతడి స్నేహితుడు షేక్ అబ్రార్ ద్విచక్ర వాహనంపై ఆదిలాబాద్‌కు వెళుతున్నారు. ఎండా గ్రామ సమీపంలోని ఓ ఇరుకు వంతెన వద్ద రెండు బైకులు ఢీకొని ముగ్గురూ వంతెన పైనుంచి పడి తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు 108కి సమాచారం అందించి జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న కొండిబాను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. షేక్ సుఫియాన్, షేక్ అబ్రార్ పరిస్థితి కూడా విషమంగానే ఉంది. ఉట్నూర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

చెల్లెలు వరుసయ్యే బాలికపై లైంగిక దాడి

- నిందితుడికి 21 ఏళ్ల జైలు.. రూ.30వేల జరిమానా
- బాధితురాలికి రూ.10లక్షల పరిహారం
- నల్లగొండ పోక్సో న్యాయస్థానం తీర్పు

నల్లగొండ క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వరుసకు చెల్లెలు అయిన బాలికపై పదేపదే లైంగిక దాడికి పాల్పడి, ఆమెను గర్భవతిని చేసిన పాత నేరస్థుడికి 21ఏళ్ల జైలు, రూ.30వేల జరిమానా విధిస్తూ నల్లగొండ జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు అదనపు జడ్జి, నల్లగొండ పోక్సో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు న్యాయాధికారి రోజారమణి శుక్రవారం తీర్పు వెల్లడించారు. బాధిత బాలికకు జిల్లా న్యాయసేవా సంస్థ ద్వారా రూ. 10లక్షల పరిహారం ఇవ్వాలని ఆదేశించారు. జరిమానా కింద వసూలు చేసే సొమ్మును సైతం ఆమెకే అందించాలన్నారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్‌కుమార్ కథనం మేరకు నల్లగొండ జిల్లాకు చెందిన బాలిక చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయింది. కొన్నాళ్లపాటు బాబాయి సంరక్షణలో ఉంది. అక్కడ సరిగా చూసుకోవడం లేదని నల్లగొండలోని పెద్దమ్మను ఆశ్రయించింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె కుమారుడు, ఆటోడ్రైవర్ కొత్తపల్లి నవీన్ బాలికను భయపెట్టి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత పలుమార్లు వేధింపులకు పాల్పడడంతో తట్టుకోలేక బాలిక పక్క మండలంలోని మేనత్త ఇంటికి వెళ్లింది. ఆమె బాలిక గర్భవతి అని గుర్తించి ఇంట్లోంచి పంపించివేసింది. దీంతో బాధితురాలు నవీన్ స్నేహితుడైన ఓ ఆటో డ్రైవర్ కుటుంబం వద్ద ఆశ్రయం పొందింది. నిందితుడు వారిని సైతం బెదిరించడంతో బాలిక 2021 నవంబరు 9న సఖి కేంద్రానికి వెళ్లింది. కేంద్రం నిర్వాహకురాలు అదే రోజు నల్లగొండ వన్‌టౌన్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద, ఐపీసీలోని పలు ఇతర సెక్షన్ల కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేశారు. ఇతనిపై 2019 నుంచి రౌడీషీట్ కొనసాగుతుండగా, ఓ హత్య కేసులోనూ నిందితుడిగా ఉన్నాడని పోలీసులు పేర్కొన్నారు.

విద్యార్థిని పట్ల ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన

- పరారీలో నిందితుడు.. పోక్సో కేసు నమోదు
- ఉపాధ్యాయుడిపై నిర్మల్ డీఈఓ భోజన్న వేటు
- ఎంఈఓ మైసాజీపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు

బాసర, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా బాసర మండలంలోని ఓ పాఠశాలలో ఒక విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మహ్మద్ మూర్తుజా అలీపై పోక్సో కేసు నమోదైందని ముధోల్ సీఐ మల్లేశ్ తెలిపారు. మరోవైపు మూర్తుజా అలీని సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా డీఈఓ భోజన్న వెల్లడించారు. సదరు ఉపాధ్యాయుడు పాఠశాలలో ఒక విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన సంగతి గమనించిన స్థానిక యువకులు ఆయన్ను ప్రశ్నించారు. తదుపరి విద్యార్థిని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఆ పాఠశాలకెళ్లి విచారించారు. ఆ సమయంలో ఉపాధ్యాయుడు విధులకు హాజరు కాలేదని, పరారీలో ఉన్నాడని తెలిపారు. దీంతో ఆయనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగానూ, బాసర ఎంఈఓగానూ విధులు నిర్వహిస్తున్న మైసాజీ.. ఈ సంగతి తన దృష్టికి వచ్చినా పట్టించుకోలేదని విద్యార్థిని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుడ్ని కాపాడేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. ఎంఈవో మైసాజీపై ఫిర్యాదు వచ్చిన విషయాన్ని కూడా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు భోజన్న చెప్పారు. కాగా, ఈ ఘటనపై ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించగా ఎంఈవో మైసాజీ అందుబాటులోకి రాలేదు.

రైలులో విద్యార్థినిపై టీటీఈ వేధింపులు

- బాధితురాలి ఫిర్యాదుతో టీటీఈ సస్పెన్షన్
- భీమవరంలో కేసు.. ఆలస్యంగా వెలుగులోకి..

భీమవరం క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): 'నా పక్కన కూర్చో.. నీకు రిజర్వేషన్ బెర్త్ ఇస్తా.. చల్లగా ఏసీలో ఉండు.. నాకు సహకరిస్తే నేను నీకు సాయం చేస్తా..' అని రైల్వే ఉద్యోగి ఒకరు విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనలో బాధితురాలి ఫిర్యాదు మేరకు సదరు టీటీఈపై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం గవర్నమెంట్ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ సుబ్రహ్మణ్యం కథనం ప్రకారం.. భీమవరానికి చెందిన ఓ విద్యార్థిని ఈనెల 8న నరసాపురం నుంచి ధర్మవరం వెళ్లే ఎక్స్‌ప్రెస్ ఎక్కింది. ఆమెకు రిజర్వేషన్ లేకపోవడంతో రైల్వే టీటీఈ అభిజిత్ కుమార్(బిహార్‌కు చెందిన వ్యక్తి)ను బెర్త్ కావాలని కోరింది. ఇదే అదనుగా ఒంటరిగా ఉన్న ఆమె పట్ల అభిజిత్ అసభ్యకరంగా ప్రవర్తించడమే కాకుండా ఇష్టానుసారంగా వ్యవహరించాడు. నిస్సహాయ స్థితిలో మిన్నకుండిపోయిన ఆమె, ఆ తర్వాత తోటి ప్రయాణికుల సాయంతో విజయవాడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ ఫిర్యాదును భీమవరం గవర్నమెంట్ రైల్వే పోలీసులకు పంపించడంతో అభిజిత్ కుమార్‌పై ఇక్కడ కేసు నమోదు చేశారు. రైల్వే ఉన్నతాధికారులు వెంటనే అభిజిత్ కుమార్‌ను సస్పెండ్ చేసినట్లు రైల్వే ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

ఆలయాల్లో సామూహిక కార్తీక దీపోత్సవం

- భక్తులకు సామాగ్రి ఉచితం

హైదరాబాద్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా ఆలయాల్లో సామూహిక కార్తీక దీపోత్సవం నిర్వహించేందుకు దేవాదాయ శాఖ ఏర్పాట్లు చేసింది. ఆలయాల్లో భక్తులు దీపం వెలిగించేందుకు అవసరమైన సామాగ్రిని ఉచితంగా అందించే ఏర్పాట్లు చేసినట్లు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం 6 గంటల నుంచి సామూహిక కార్తీక దీపోత్సవం నిర్వహిస్తారు. మహిళా భక్తులకు పసుపు, కుంకుమ, తాంబూలం అందిస్తారు. నదీ పరివాహక ప్రాంతాల్లోని ఆలయాల వద్ద సాయంత్రం నదీ హారతి నిర్వహిస్తున్నారు. ముఖ్యమైన ఆలయాల వద్ద భక్తులు దీపాలు నీటిలో వదిలేందుకు వీలుగా తాత్కాలికంగా నీటి కుంటలు ఏర్పాటు చేస్తున్నారు.

నేడు ఢిల్లీకి సీఎం రేవంత్

డీసీసీ అధ్యక్షుల ఎంపిక కసరత్తులో పాల్గొనేందుకే.. నెలాఖరుకల్లా కొత్త డీసీసీ అధ్యక్షుల ప్రకటన!

- జూబ్లీహిల్స్‌లో సీఎం ఆకస్మిక పర్యటన
- పార్కు పనుల పరిశీలన.. కూలీలతో మాటామంతీ
- ముఖ్యమంత్రితో కమ్మ సంఘాల సమాఖ్య ప్రతినిధుల భేటీ



సీఎం రేవంత్‌ను సన్మానిస్తున్న మంత్రి తుమ్మల, కలగర శ్రీనివాసరావు, కమ్మ సమాఖ్య నేతలు

హైదరాబాద్/జూబ్లీహిల్స్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి శనివారం ఉదయం ఢిల్లీకి వెళ్తున్నారు. జిల్లా.. పట్టణ కాంగ్రెస్ కమిటీల అధ్యక్షుల నియామకానికి సంబంధించి ఏఐసీసీ కార్యాలయంలో జరిగే తుది కసరత్తులో ఆయన పాల్గొననున్నారు. ఈ సమావేశంలో సీఎంతో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి పాల్గొంటారు. జిల్లా, పట్టణ కాంగ్రెస్ కమిటీలకు అధ్యక్షుల ఎంపికకు సంబంధించి ఇటీవల జిల్లా పర్యటనలు చేసిన ఏఐసీసీ పరిశీలకులు.. వర్గాల వారీగా ఒక్కో కమిటీకి ఆరుగురితో ప్రతిపాదనలను సిద్ధం చేశారు. వాటిపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో భేటీ కానున్న సీఎం రేవంత్, భట్టి, మహేశ్ గౌడ్, మీనాక్షి, ఉత్తమ్.. తమ అభిప్రాయాలు వినిపించనున్నారు. ఈ భేటీలో 39 జిల్లాలతో పాటు పట్టణ కాంగ్రెస్ కమిటీల అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ ఒక కొలిక్కి రానుంది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ ఆమోద ముద్ర తర్వాత ఈ నెలాఖరుకు లేదా నవంబర్ మొదటి వారంలో ప్రకటిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. సీఎం రేవంత్ హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఆకస్మికంగా పర్యటించారు. శుక్రవారం సాయంత్రం జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 45లో నిర్మాణంలో ఉన్న జీహెచ్ఎంసీ పార్కు పనులను పరిశీలించారు. హైదరాబాద్‌లో పలు వివాహాలకు హాజరై వస్తున్న సందర్భంగా మార్గమధ్యలో నిర్మాణంలో ఉన్న పార్కు దగ్గర ఆగి పనులను తనిఖీ చేశారు. అక్కడి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

సీఎంను కలిసిన పంజాబ్ మంత్రులు..

సీఎం రేవంత్‌ను పంజాబ్ రాష్ట్ర మంత్రులు సంజీవ్ అరోరా, గుర్మీత్ సింగ్ ఖుడియన్‌లు జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పంజాబ్‌లో జరిగే 350వ 'గురు పురబ్' ఉత్సవానికి హాజరవ్వాలంటూ ఆహ్వానించారు. ఇటు తెలంగాణ రాష్ట్ర కమ్మ సంఘాల సమాఖ్య ప్రతినిధులు కూడా సీఎంను కలిశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కమ్మ సంఘాల సమాఖ్య గౌరవ సలహాదారులు కలగర శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌ను సన్మానించారు. కమ్మ సామాజికవర్గంలోని పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు రాష్ట్ర కమ్మ సమాఖ్య తరఫున తమ మద్దతు ప్రకటించారు. సినీ నటుడు నారా రోహిత్ సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 30న తన వివాహానికి హాజరవ్వాలని కోరుతూ ఆహ్వాన పత్రిక అందించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీ రఘువీర్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు రోహిన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్సు ప్రమాదం బాధాకరం: సీఎం రేవంత్

హైదరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు దగ్గర జరిగిన బస్సు ప్రమాదంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో 19 మంది సజీవ దహనమవడం అత్యంత బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ అధికారులతో మాట్లాడి అవసరమైన సహాయక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు కర్నూలు దగ్గర ప్రమాదానికి గురైన విషయం తెలియగానే.. సీఎం రేవంత్‌రెడ్డి డీజీపీ శివధర్‌రెడ్డి, సీఎస్ రామకృష్ణారావుతో మాట్లాడారు. తక్షణమే ప్రభుత్వం తరఫున అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సాయం అందించేందుకు జెన్‌కో సీఎండీ హరీశ్‌ను వెంటనే ప్రమాదస్థలికి వెళ్లాలని ఆదేశించారు. అలాగే గద్వాల జిల్లా కలెక్టర్, ఎస్పీలను కూడా ఘటనా స్థలానికి వెళ్లాలని చెప్పారు. వారు అక్కడే ఉండి, బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని సూచించారు. మృతుల గుర్తింపు, క్షతగాత్రులకు అవసరమైన వైద్యసాయం అందించాలని చెప్పారు. కాగా, బస్సు ప్రమాదం ఘటనలో సహాయక చర్యల కోసం తెలంగాణ ప్రభుత్వం హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసింది. సహాయం కోసం ఎం.శ్రీరామచంద్ర, అసిస్టెంట్ సెక్రటరీ 9912919545, చిట్టిబాబు, సెక్షన్ ఆఫీసర్ 9440854433 నంబర్లను సంప్రదించాలని సీఎం కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. కర్నూలు బస్సు ప్రమాదం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. ఏపీ రవాణాశాఖ మంత్రి, కర్నూలు జిల్లా కలెక్టరు, ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడినట్లు చెప్పారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో ఏపీ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల రవాణాశాఖ మంత్రులు, కమిషనర్లతో సమావేశం ఏర్పాటు చేస్తామని, నిబంధనలను అనుసరించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సర్కారు కాలేజీల్లో పాఠాలు ప్రైవేటులో ప్రయోగాలు

సమీప ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో వసతులు వాడుకోవచ్చు

- ప్రాక్టికల్ విద్యలో కొత్త సంస్కరణ.. టి-స్టెమ్
- నైపుణ్యాభివృద్ధి శిక్షణలో ముందడుగు
- నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్న ఇంటర్ బోర్డు



జీఎన్ఐటీ కాలేజీలో ప్రభుత్వ లెదర్ టెక్నాలజీ కాలేజీ విద్యార్థులు

హైదరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నాంపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఎంపీసీ, బైపీసీ చదువుతున్న 120 మంది విద్యార్థులు ప్రాక్టికల్స్ చేద్దామంటే సరైన ప్రయోగశాలలు లేవు. నైపుణ్యాలు పెంచేందుకు సరైన వసతులు, యంత్రాలు లేవు. అయితే ఈ కాలేజీకి కిలోమీటరు దూరంలోనే మాసబ్‌ట్యాంకు ప్రభుత్వ పాలిటెక్నిక్ ఉంది. ఇందులో ఇంటర్, పాలిటెక్నిక్ విద్యార్థులకు అవసరమయ్యే, సరిపడే అన్ని వసతులున్నాయి. ప్రాక్టికల్ శిక్షణ కోసం అత్యాధునిక యంత్రాలున్నాయి. దీంతో ఇప్పుడు నాంపల్లి ప్రభుత్వ కాలేజీ విద్యార్థులు మాసబ్‌ట్యాంక్ పాలిటెక్నిక్‌కు వెళ్లి అక్కడి వసతులు ఉపయోగించుకోవచ్చు.

● గచ్చిబౌలిలో ప్రభుత్వ లెదర్ టెక్నాలజీ కాలేజీ ఉంది. ఏటా 180 మంది ఇందులో ప్రవేశాలు తీసుకుంటారు. కోర్సులో భాగంగా నైపుణ్యాలు అందించేందుకు సరిపడా యంత్రాలు ఈ కాలేజీలో లేవు. అయితే కిలోమీటరు దూరంలోనే జి.నారాయణమ్మ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (జీఎన్ఐటీ) కాలేజీ ఉంది. ఇందులో 3డి ప్రింటింగ్, ఏఐ, ఎంఎల్ గ్రాఫిక్ సర్వర్ లాంటి అత్యాధునిక యంత్రాలతో కూడిన అధునాతన ల్యాబ్ ఉంది. ప్రభుత్వ లెదర్ టెక్నాలజీ విద్యార్థులు ఇక్కడి ల్యాబ్‌ను వినియోగించుకొని నైపుణ్యాలను పెంచుకోవచ్చు.

..ఇలా ప్రభుత్వ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులు సమీపంలోని ఇతర ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లోని వసతులను ఉపయోగించుకునే సరికొత్త విధానం రాష్ట్రంలో అందుబాటులోకి వచ్చింది. టి-స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్ ఫెసిలిటీస్ మ్యాప్)ను ఇంటర్ బోర్డు అమల్లోకి తెచ్చింది. సరైన వసతులు లేని కారణంగా విద్యార్థులు నైపుణ్యాలకు దూరం కాకూడదన్న లక్ష్యంతో ప్రభుత్వ ఆదేశాలతో సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) దీన్ని అభివృద్ధి చేసింది. ఇందుకోసం విద్యార్థులు ముందుగా www.tstem.cgg.gov.in వెబ్‌సైట్లో రిజిస్టర్ చేసుకోవాలి. పేరు, కాలేజీ, కోర్సు వివరాలు, ఫోన్‌నంబర్ నమోదు చేయాలి. వీరికి కావాల్సిన ప్రయోగశాలలున్న సమీప కాలేజీల వివరాలు అందిస్తారు. ఈ సేవలను రాష్ట్రంలోని 436 ప్రభుత్వ జూనియర్ కాలేజీల విద్యార్థులతోపాటు కేజీబీవీ, టీఎస్ఆర్జేసీ, ఇతర ప్రభుత్వ గురుకులాల విద్యార్థులూ వినియోగించుకోవచ్చు. దీన్ని ప్రయోగాత్మకంగా ఈనెల 23న 4 కాలేజీల్లో విజయవంతంగా చేపట్టారు. శనివారం నుంచి ఈ విధానం అమల్లోకి రానుంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని కాలేజీల విద్యార్థులకు కొత్త విధానం అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా తెలిపారు. నైపుణ్యాభివృద్ధిలో ఇదో కీలక ముందడుగు అని ఆమె పేర్కొన్నారు. ఇంటర్ విద్యకు అవసరమయ్యే ప్రయోగ శిక్షణ అందించడంతోపాటు సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్‌లో ఆసక్తి ఉన్న విద్యార్థులు సైతం సమీపంలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లోని వసతులను పూర్తిగా వినియోగించుకోవచ్చని ఇంటర్ విద్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. దీని కోసం ఇప్పటికే ప్రైవేటు కాలేజీలతో ఇంటర్ బోర్డు ఒప్పందాలు కుదుర్చుకుంది.

ఆ నలుగురు ఎమ్మెల్యేలపై ముగిసిన వాదనలు

హైదరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలు ప్రకాశ్ గౌడ్, కాలె యాదయ్య, మహిపాల్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిలపై అనర్హత వేటు కోసం దాఖలైన పిటిషన్లపై స్పీకర్ ప్రసాద్ కుమార్ విచారణను శుక్రవారం ముగించారు. తీర్పు రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించారు. తాను విదేశీ పర్యటనకు వెళ్లక ముందు వీరిపై దాఖలైన ఫిరాయింపు పిటిషన్లపై మూడు దఫాలు వాదనలు విన్న స్పీకర్..తాజాగా శుక్రవారం మరోదఫా విచారించారు. ఈ విచారణలో ఇరుపక్షాల న్యాయవాదులు తమ వాదనలు వినిపించగా, పిటిషనర్లు, ప్రతివాదులు విచారణకు హాజరు కాలేదు. ఇక అరికెపూడి గాంధీ, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, తెల్లం వెంకట్రావు, సంజయ్‌కుమార్‌లపై దాఖలైన పిటిషన్ల మీద స్పీకర్ ప్రసాద్ కుమార్ ఈ నెల 28న మీదా విచారణను ప్రారంభించే అవకాశముంది. కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించిన దానం నాగేందర్, కడియం శ్రీహరి సహా మొత్తం పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని స్పీకర్ వద్ద పిటిషన్లు దాఖలు చేసిన బీఆర్ఎస్.. దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ నెలాఖరుకల్లా విచారణ జరపాలని స్పీకర్‌ను దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశించారు. స్పీకర్ విచారణ కొనసాగుతున్నందు మరి కొంత గడువు ఇవ్వాలని కోరుతూ సుప్రీంకోర్టును అసెంబ్లీ కార్యదర్శి ఆశ్రయిస్తారని తెలుస్తోంది.

సమీకృత గురుకులాలపై సర్కారు ప్రత్యేక దృష్టి

- రూ.28వేల కోట్ల ప్రాజెక్టుల పర్యవేక్షణకు ఎస్ఈల నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన టీజీఈడబ్ల్యూఐడీసీ ఎండీ గణపతిరెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న యంగ్ ఇండియా సమీకృత గురుకులాలపై ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 78 సమీకృత గురుకులాల నిర్మాణానికి ఇప్పటికే రూ.15,600 కోట్లతో పరిపాలన అనుమతులు ఇచ్చింది. ఈ నిర్మాణాల పనులను సమర్థవంతంగా పర్యవేక్షించడం కోసం ప్రత్యేకంగా నలుగురు సూపరింటెండెంట్ ఇంజనీర్లను నియమిస్తూ తెలంగాణ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఈడబ్ల్యూఐడీసీ) మేనేజింగ్ డైరెక్టర్ ఐ.గణపతి రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ఈ నియామకాలలో భాగంగా, వరంగల్ సర్కిల్ (ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాలు) ఎస్ఈగా వి.బాలప్రసాద్, రంగారెడ్డి సర్కిల్ (రంగారెడ్డి, కడా, మహబూబ్‌నగర్ జిల్లాలు) ఎస్ఈగా కె.విజయభాస్కర్ రెడ్డి, నిజామాబాద్ సర్కిల్ (ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలు) ఎస్ఈగా ఎ.రవీందర్ నియమితులయ్యారు. ఇప్పటికే ఉన్న హైదరాబాద్ సర్కిల్ ఎస్ఈగా మహమ్మద్ షఫీమియా కొనసాగుతారు. వీరు తమ పరిధిలోని జిల్లాల్లో నియోజకవర్గాల వారీగా మంజూరైన గురుకులాల పనులను పర్యవేక్షిస్తారు. అలాగే కార్పొరేషన్ రూ.12,400 కోట్లతో నిర్మించనున్న 8 మెడికల్ కాలేజీలతో పాటు హైదరాబాద్‌లోని వీరనారిచాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం విస్తరణ పనులను కూడా ఎస్ఈలు పర్యవేక్షించనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మొత్తంమీద సమీకృత గురుకులాలు, మెడికల్ కాలేజీలు కలిపి దాదాపు రూ. 28 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులను టీజీఈడబ్ల్యూఐడీసీ పర్యవేక్షిస్తోంది. కాగా, వరంగల్ జిల్లా ఎస్ఈగా నియమాకమైన వి.బాలప్రసాద్ శుక్రవారం కార్పొరేషన్ ఎండీ గణపతిరెడ్డిని కలిసి, తనను ఎస్ఈగా నియమించడం పట్ల ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ప్రపంచ ఆశాజ్యోతి

ఐక్యరాజ్యసమితి 80వ వార్షికోత్సవం సందర్భంగా విదేశాంగమంత్రి జైశంకర్ న్యూఢిల్లీలో శుక్రవారం ఒక పోస్టల్ స్టాంప్ విడుదల చేస్తూ సమితిమీద ప్రశంసలూ, విమర్శలూ సమపాళ్ళలో మేళవించి ఓ ప్రసంగం చేశారు. సమితికి భారత్ అండదండలు దండిగా ఉంటాయని అంటూనే, దాని నిర్ణయాలు ప్రపంచ ప్రాధాన్యతలను ప్రతిబింబించడం లేదన్నారు. ప్రపంచం ప్రస్తుతం క్లిష్టపరిస్థితుల్లో ఉంటే ఐరాస తదనుగుణంగా వ్యవహరించలేకపోతున్నదని ఆవేదన చెందారు. ఐరాసలో సంస్కరణలు జరగాలనీ, అవి అర్థవంతంగా, యావత్ ప్రపంచ ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకొని జరగాలన్నారు. ప్రపంచం అనేక యుద్ధాలతో బాధపడుతున్న తరుణంలో శాంతి అన్నది మాటలకు మాత్రమే పరిమితమైపోయినప్పుడు అభద్రతల మధ్య అభివృద్ధి అసాధ్యమన్న ఆయన హెచ్చరిక సముచితమైనది.

రెండో ప్రపంచయుద్ధం తరువాత, మానవాళి అప్పటివరకూ చవిచూసిన విధ్వంసాలు, వినాశనాలకు ఇక స్వస్తిచెప్పి, భవిష్యత్తులో అటువంటి సంఘర్షణలను నిరోధించే లక్ష్యంతో ఈ అంతర్జాతీయ సంస్థ ఆవిర్భవించింది. దేశాలన్నీ పరస్పర సహకారంతో, సయోధ్యతో, సమన్వయంతో వ్యవహరించుకోవాలనీ, ఎంతటి తీవ్ర సమస్యనైనా చర్చలతో పరిష్కరించుకొని అంతిమంగా ప్రపంచం అనునిత్యం శాంతియుతంగా నడవాలన్నది సంకల్పం. సహకారం, సంఘీభావం పునాదిగా సమస్తమానవాళీ మనుగడ సాగించాలన్నది ఆశయం. ఏ నేపథ్యంలో ఈ సంస్థ పురుడుపోసుకున్నదో తెలుసు కనుక, అది మరింత క్రియాశీలకంగా పనిచేయాలని ఆశించడం, ఆవిర్భావలక్ష్యాలకు అనుగుణంగా వ్యవహరించలేకపోతున్నదనీ, కొన్ని దేశాల చేతిలో కీలుబొమ్మగా మారిందని విమర్శలు చేయడం సహజమే. అగ్రదేశాల ఉగ్రరాజకీయాలను ఆపలేకపోయినా, వాటి దురాలోచలనూ దురాక్రమణలనూ అడ్డుకోలేకపోయినా, అనేక చిన్నాచితకా ఘర్షణలను సమితి నిలువరించలేకపోలేదు. కొన్ని ఆఫ్రికన్ దేశాల్లో అంతర్యుద్ధాలను, సంఘర్షణలను పరిష్కరించడంలోనూ, ఉపశమింపచేయడంలోనూ దాని కృషి ప్రశంసనీయమైనది. అయినాకూడా, సిరియానుంచి సూడాన్ వరకూ అది చేతులెత్తేసిన సందర్భాలు అనేకం. వియత్నాం ఘోరకలినుంచి, ఇరాక్ బూటకపు యుద్ధం వరకూ అసత్యాలనుంచి ఆవిర్భవించిన అనేకానేక సంఘర్షణలు సమితి వైఫల్యాల చిట్టాలో ఉన్నాయి. నియంతలను పెంచిపోషించే అగ్రరాజ్యాల స్వార్థం కారణంగా ప్రపంచవ్యాప్తంగా అనేక సంఘర్షణలో లక్షలాదిమంది హతులైనారు, నిరాశ్రయులైనారు.

అరడజను అగ్రరాజ్యాల భద్రతకోసమే ఏర్పడినట్టుగా భద్రతామండలి వ్యవహారం సాగుతోంది. ఐదుదేశాల వీటోశక్తి ఏదీ తేలనివ్వకుండా, ఎటూ కదలనివ్వకుండా ప్రపంచాన్ని నిర్దేశిస్తోంది. వాటి అండచూసుకొనో, సమితి నిస్సహాయతను అడ్డంపెట్టుకొనో చాలా సభ్యదేశాలు అంతర్జాతీయ చట్టాలను బేఖాతరు చేస్తున్నాయి, సమితి నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయి. అంతర్జాతీయ నేరన్యాయస్థానం ఏళ్ళతరబడి మథించి వెలువరించిన తీర్పులు కొరగాకుండా పోతున్నాయి. తన ఆదేశాలు బేఖాతరుచేసినా ఆయా దేశాల పాలకులను ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో అది ఉంది.

అయితే, ఐక్యరాజ్యసమితి అనుబంధసంస్థలు తమకు నిర్దేశించిన బాధ్యతలను ఎంతోకొంతమేర నిర్వర్తించగలగడం మెచ్చుకోదగింది. కరోనాకాలంలో అన్ని దేశాల మధ్యా సహకారాన్ని సాధించి, వ్యాప్తి నిరోధంలోనూ, పేద, ధనిక తేడాలేకుండా వాక్సిన్ సకాలంలో అందరికీ అందించడంలోనూ ఆరోగ్యసంస్థ విఫలమైంది. అయితే, పోలియో వంటి ప్రమాదకర వ్యాధుల నియంత్రణలో, ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది బాలబాలికలకు అతిముఖ్యమైన టీకాలు అందడంలోనూ అది ప్రశంసనీయమైన పాత్ర నిర్వహిస్తోంది. నిర్వాసితులను ఆదుకుంటూ, అన్నార్తుల ఆకలిని తీరుస్తోంది. 'డిగ్ బేబీ డిగ్' తరహా ఎజెండాలతో, కార్పొరేట్లకు వంతపాడే ట్రంప్ తరహా పాలకులు పుట్టుకొస్తున్నందున 'కాప్' సదస్సులు ఎన్ని జరిపినా, పర్యావరణానికి మాత్రం అది కాపలాదారు కాలేకపోతోంది.

గత నెలలో జరిగిన 80వ సర్వసభ్యసమావేశానికి నూటయాభైకిపైగా దేశాల అధినేతలు హాజరైనారు. పాలస్తీనా గుర్తింపు నుంచి, ప్రస్తుతం భీకరంగా సాగుతున్న రెండు యుద్ధాల వరకూ చాలా అంశాలు చర్చకు వచ్చి, ఏకాభిప్రాయం సాధ్యపడుతుందని అంతా అనుకున్నారు. కానీ, ఎప్పటిలాగానే వారంతా ఎదుటివారి కారణంగానే ప్రపంచం పాడైపోతుందని దూషణలు చేశారు, విమర్శలు, ప్రతివిమర్శలతో సదస్సు ముగించారు. ప్రపంచం మరింత సంక్షోభంలోకి జారుతున్న తరుణంలో అగ్రదేశాల సహాయనిరాకరణ నుంచి నిధుల కొరతవరకూ సమితి పలు సమస్యలు ఎదుర్కొంటోంది. సంస్కరణలు జరగాలన్న జైశంకర్ వ్యాఖ్యల్లో భద్రతామండలిలో మనస్థానం మాట గుర్తుచేయడం కనిపిస్తోంది. ఐదుదేశాలదే ఇష్టారాజ్యం కాకూడదనీ, బలంగా ఎదుగుతున్న భారత్, బ్రెజిల్ వంటివి కూడా శాశ్వత సభ్యత్వాన్ని పొందగలిగినప్పుడు అది ఆవిర్భావ లక్ష్యాలకు అనుగుణంగా వ్యవహరించగలదని ఓ ఆశ, నమ్మకం.

బీసీ ఉద్యమానికి సమైక్య సారథి కావాలి

బీసీ చైతన్యం వెల్లివిరుస్తోంది. ప్రతి బీసీలో తమ వెనుకబాటుతనానికి కారణమేమిటన్న ఆలోచనల కదలిక వచ్చింది. బీసీ కులాలలో ఏ కులానికి ఆ కులం ఒక దగ్గరికొచ్చి నిలబడే కులస్పృహ బాగా పెరిగింది. సంబంధిత కులాలలో వచ్చిన కులస్పృహ బీసీ ఐక్యతగా మారాలి. కింది కులాలన్నీ కలిసి ఒకే ఒక్క బీసీ కులంగా గొంతెత్తాలి. బీసీ భావజాల ప్రచారం విస్తృతంగా జరగాలి. యువతరం దాన్ని స్వీకరించాలి. బీసీ ఉద్యమం శక్తిమంతం కాకుండా బీసీ రాజ్యాధికారం రాదు. ఆ దిశగా కింది నుంచి పై స్థాయి వరకు నిర్మాణాత్మక కృషి జరగాలి. వివిధ రాజకీయ పార్టీలలో ఉన్న బీసీలంతా ఒక్కతాటిపైకి రావాలి. బీసీల ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయం కోసం ఒక్కటిగా నిలవాలి. "బీసీల స్వప్నం సకల రంగాల్లో సమన్యాయం" అన్న ఏక నినాదంతో బీసీ ఉద్యమం కదలాలి.

రాజకీయ పార్టీల చర్చను బీసీ ఉద్యమంలోకి తీసుకువస్తే అది బీసీ ఉద్యమాన్ని నిర్మించలేదు. పైగా ఉద్యమంలో విభేదాల సృష్టికి దారితీస్తుంది. సరిగ్గా ఇప్పుడు అదే జరుగుతోంది. వివిధ పార్టీ జెండాల కింద ఉన్న బీసీ నాయకులు విడివిడిగానే మాట్లాడుతున్నారు. కానీ వాళ్లు ఒక్క వేదికమీదికి వచ్చి నిలవటం లేదు. వివిధ పార్టీలలో ఉన్న బీసీ నాయకులు స్పష్టతతో నిర్మాణాత్మక ఉద్యమంలోకి వచ్చి నిలవాలి. అయితే అందుకు భిన్నంగా ఎవరి అజెండా వాళ్లు చెప్పుకుంటూ పోతున్నారు.




బీసీల హక్కుల సాధన విషయంలో ఏఏ పార్టీలు ఏమేమి చేశాయో? అవి ఎలా వ్యవహరిస్తున్నాయో? ఇక ముందెలా వ్యవహరిస్తాయో బీసీ ఉద్యమ చరిత్రకు తెలుసు. ఇప్పుడు అన్ని పార్టీలు బీసీ నినాదాన్ని ఎత్తుకోవటం మంచిదే. కానీ ఇది బీసీ ఉద్యమ అంతిమ విజయం కోసం రాజకీయ పార్టీలు ముందుకు వస్తున్నాయా లేక తమ గెలుపోటముల రాజకీయ అస్తిత్వం కోసమా అన్నది ప్రస్తుత బీసీ ఉద్యమం జాగ్రత్తగా గమనించాలి. 42శాతం రిజర్వేషన్ల అంశంపై అధికారపక్షం, ప్రతిపక్షాలన్నీ బీసీ బంద్‌లో పాల్గొన్నాయి. అది మంచి పరిణామంగానే చెప్పాలి. కానీ అన్ని రాజకీయ పార్టీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్లు రాజ్యాంగ సవరణల ద్వారానే సాధ్యమవుతాయని తెలుసు. రాజ్యాంగ సవరణ కోసం అన్ని రాజకీయ పార్టీలు చివరిదాకా నిలవాలి. ఇందుకోసం రాజకీయ పార్టీలన్నీ కృతనిశ్చయంతో రాజ్యాంగ సవరణ జరిగేదాకా ఈ అంశాన్ని విడిచిపెట్టబోమని చెప్పి బీసీ ఉద్యమానికి అండగా నిలబడాలి. అది ఇప్పటివరకు ఏ మేరకు జరిగిందో బీసీ ఉద్యమమే పునశ్చరణ చేసుకోవాలి.

సగం జనాభాకు న్యాయం జరగాలన్న న్యాయబద్ధమైన ఉద్యమాన్ని గెలిపించి నిలిపే సరైన నాయకుడి కోసం బీసీ ఉద్యమం ఎదురుచూస్తోంది. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలాగా బీసీల పోరాటం జరగాలి. తమిళనాడులో రామస్వామి పెరియార్ పోరాటంలా జరగాలి. పూలే, అంబేడ్కర్‌ల ఆలోచనలు దట్టించిన మహోద్యమంగా ఎగియాలి. బీసీ ఉద్యమమే భవిష్యత్ కార్యక్రమాన్ని రూపొందించుకోవాలి. ఉద్యమ అగ్గి రగిల్చే నవతరం యువతరం రావాలి. బీసీలందరూ ఆమోదించగల ఏకగ్రీవ నాయకుడు కావాలి. దేనికీ తలవంచని ఎన్ని ఒడుదొడుకులనైనా ఎదుర్కోగల సత్తా ఉన్న బీసీ నాయకుడు కోసం ఉద్యమమే ఎదురుచూస్తోంది.

ఇది అగ్రవర్ణ వ్యతిరేక ఉద్యమం కాదని, కులవిద్వేషాలను రెచ్చగొట్టే ఉద్యమం కాదని బీసీ ఉద్యమం చాటిచెప్పాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలందర్నీ ఒక్కతాటిపై నడిపించే ఉద్యమ శక్తి కావాలి. నిర్మాణాత్మక ఉద్యమం వైపు నడిపే నాయకుని కోసం 85 శాతం సమాజం ఎదురుచూస్తోంది. ఇప్పటికే లెఫ్టిస్టులు లాల్‌నీల్ అన్నారు. అగ్రవర్ణాల్లో వున్న ప్రగతిశీలవాదులంతా బీసీ ఉద్యమ పక్షాన వచ్చి నిలుస్తారు. బీసీ ధర్నాలు బహుజన సింహగర్జనల సభలు కావాలి. మంత్రాలతో చింతకాయలు రాలవన్నట్టుగా ఉపన్యాసాలతో ఉద్యమాలు రావు. బీసీ వర్గాలకు నమ్మకం కలిగించే నాయకత్వం వస్తే దానిని ఆపటం ఎవరితరం కాదు. మన బతుకులు మారాలంటే రాజ్యాధికారమొక్కటే అంతిమమన్న సోయితో ఉద్యమం ఎదగాలి. 'బీసీల రాజ్యాధికారమంటే అది అందరి రాజ్యం' అన్న స్ఫూర్తిని కలిగించాలి.

■ జూలూరు గౌరీశంకర్

పర్యావరణ స్వచ్ఛత ధార్మిక కర్తవ్యం





■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

నింగిలో కాంతి పుంజాలు, ఆకాశాన్ని బద్దలు కొట్టే శబ్దరావాలు... దీపావళి నడి రేయి.. అయినా ఎడతెగని టపాసుల మోతలు... నిద్ర పట్టడం లేదు, విసుగు కమ్మేస్తోంది. సమీపంలో ఉన్న ఒక పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేశాను. 'అర్ధరాత్రి దాటిపోయింది. టపాకాయలు ఇంకా పేలుతూనే ఉన్నాయి. సుప్రీం కోర్టు నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చర్య తీసుకుంటారా?' ఆవలివైపు నుంచి అలసట ధ్వనిస్తున్న గొంతు వినిపించింది: 'మా ప్రయత్నం మేము చేస్తున్నాం, అయితే ప్రజలు మా మాట వినడం లేదు'. ఆ రాత్రి డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ పట్ల జాలి కలిగింది. పౌరులు లెక్క చేయనప్పుడు, రాత్రి పది తరువాత టపాసులు కాల్చకూడదన్న కోర్టు ఆదేశాన్ని వారు ఎలా అమలుపరచగలరు?

మరుసటి ఉదయం యథావిధిగా, చెంతనే ఉన్న ఒక ఉద్యానవనంలో వ్యాహ్యాళికి వెళ్లాను. చల్లనిగాలి, కాదు, విషతుల్య వాయువును శ్వాసిస్తూ నడుస్తున్నాను. శరదృతువు ఉదయం సూర్యకాంతి స్థానంలో దట్టమైన, నల్లని పొగమంచు! క్రితం రాత్రి కొంత మంది ఆనందోత్సాహాల అనివార్య పర్యవసానమది, ఎంతో మంది ఇతరులకు భరింపరాని యాతన, సందేహం లేదు. భారతదేశ రాజధాని, ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరాలలో ఒకటిగా ఉన్నది! ఇందుకు జవాబుదారీ ఎవరు? అక్టోబర్ నుంచి జనవరి మధ్యనాళ్ల దాకా న్యూఢిల్లీలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయి దాటడం కద్దు. అందునా దీపావళి పండుగ రోజుల్లో గాలి నాణ్యత మరింత అధ్వానమైపోతోంది. శ్వాసకోశ వ్యాధులు మరింత తీవ్రమవుతాయి. ఆ రోగాలు లేనివారు సైతం విషపూరిత గాలిని పీల్చి అనారోగ్యం కోరల్లో చిక్కుకోవడం పరిపాటి.

దీపావళి పండుగ సందర్భంలో టపాసులపై నిషేధాన్ని ఎత్తివేయాలని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఎందుకు నిర్ణయం తీసుకున్నది? 'విరుద్ధ ఆసక్తుల' మధ్య సమతుల్యతకు గౌరవనీయ న్యాయమూర్తులు చిత్తశుద్ధితో ప్రయత్నించారా? లేక బాణసంచాపై ఆంక్షలు 'హిందూ మనోభావాల'ను వ్యతిరేకించడమేనని వాదిస్తున్న వారిని అనునయించేందుకే సర్వోన్నత న్యాయస్థానం ఆ నిర్ణయం తీసుకున్నదా? తనపై గర్హనీయమైన బూటుదాడికి కారణమైన (విష్ణువు ప్రతిమపై) స్వీయ వ్యాఖ్యలకు సీజేఐ ఇప్పటికే హిందుత్వవాదుల నుంచి తీవ్ర విమర్శల నెదుర్కొంటున్నారు. తన శత్రువులతో శాంతి పడేందుకే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారా? 'గ్రీన్ క్రాకర్స్' (ఈ పదం ఒక విరోధాభాసాలంకారం)ను ఆమోదించడం సమర్థనీయమేనా? దీపావళి వేడుకలు, పర్యావరణ పరిరక్షణకు అదొక మధ్యేదారి అని భావించారా? న్యాయమూర్తుల ఉద్దేశం ఏమైనప్పటికీ మరింత బాణసంచాకు అనుమతినివ్వడం టపాసులను మరింత నిర్భయంగా కాల్చేందుకే పౌరులను పురిగొల్పింది. టపాకాయల తయారీదారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్న ఢిల్లీ ప్రభుత్వం తాము నిర్దేశించిన నిబంధనలను అమలుపరచగలదని సర్వోన్నత న్యాయమూర్తులు ఆశించారా?

ఢిల్లీ ప్రభుత్వం తన పక్షపాత వైఖరిని నిస్సిగ్గుగా బయటపెట్టుకున్నది. 27 ఏళ్ల 'వనవాసం' అనంతరం బీజేపీ ఈ ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీ కేంద్ర పాలిత ప్రాంతంలో అధికారంలోకి వచ్చింది. టపాకాయల ఆనందోత్సాహాలను ఢిల్లీ వాసులకు మళ్లీ ఇస్తామనేది బీజేపీ ఇచ్చిన హామీలలో ఒకటి. మురుగునీటి పారుదల సదుపాయాలను మెరుగుపరచడం, రోడ్లపై కొండలుగా పేరుకు పోతున్న చెత్తా చెదారాన్ని తొలగించడం మొదలైన తక్షణ కర్తవ్యాలను నిర్వహించడానికి బదులు 'దీపావళి' టపాసుల వేడుక సంప్రదాయాన్ని పునరుద్ధరించేందుకు అధికారంలో ఉన్నవారు దృఢంగా నిర్ణయించుకున్నారు. దీపావళి పండుగ రోజుల్లో టపాసులు పేల్చడం 'ఒక సాంస్కృతిక వేడుక' అని ముఖ్యమంత్రి రేఖా గుప్తా అభివర్ణించారు. మంచిదే. అయితే ప్రజల ఆరోగ్యానికి వాటిల్లే హాని విషయమేమిటి?

> **పరిశుభ్ర పర్యావరణం సమస్త పౌరుల ధర్మబద్ధమైన విధి. హమాలీల నుంచి అందమైన హర్మ్యాలలో నివసించే ఆస్తిపరుల దాకా ప్రతి భారతీయుడినీ వాయు కాలుష్యం బాధిస్తోంది. గాలి నాణ్యత అధ్వానంగా ఉండడమనే సమస్యకు సులభ పరిష్కారాలు లేవు. పంట వ్యర్థాల దగ్ధం, పారిశ్రామిక కాలుష్యం, టపాకాయల కాంతులు, శబ్దాలతో వాటిల్లే ప్రతి సంభావ్య పర్యావరణ ప్రమాదాన్ని సంబాళించేందుకై ఏడాది పొడుగునా అమలుపరిచే ఒక సమగ్ర కార్యాచరణ పథకాన్ని రూపొందించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉన్నది.**

బాణసంచాను నిషేధించడం ద్వారా ఆప్ ప్రభుత్వం హిందువులకు వ్యతిరేకంగా వ్యవహరించిందని బీజేపీ పదే పదే ఆరోపించింది. ఇదొక ప్రమాదకరమైన వాదన. అత్యంత ప్రధానమైన ప్రజారోగ్యం అంశాన్ని మతంతో ముడిపెట్టేందుకు ఉద్దేశించిన వాదన అది. మొరటు మెజారిటేరియన్ రాజకీయాలకు అదొక తార్కాణం. ఇటువంటి అహేతుక జనాకర్షక కథనాల కారణంగా ప్రతిపక్షాలు ఆత్మరక్షణలో పడిపోయాయి. నిర్మల పర్యావరణం కంటే మతపరమైన బుజ్జగింపే ఎక్కువ ఓట్లు తీసుకువస్తుంది మరి.

బాణాసంచా కాల్చడమనేది దీపావళి వేడుకల్లో అంతర్భాగమని చెప్పేందుకు చారిత్రక సాక్ష్యాధారాలు లేవు. మన పెద్దలు, పూర్వీకులు దీపావళిని వెలుగుల పండుగగా చూశారేగానీ చెవులు చిల్లులు పడే శబ్దహేలగా ఎవరూ పరిగణించలేదు. దీపకాంతుల దృశ్యం భవిష్యత్తుకు భరోసానిచ్చే ఆశాజ్యోతిగా భావించడం పరిపాటి. బాణసంచా తయారీ ఇటీవలి కాలంలోనే వందల కోట్ల వ్యాపారమైపోయింది. వినియోగదారు మతతత్వం ఆ వ్యాపారానికి తోడయింది. దీంతో మతపరమైన ప్రతి సందర్భమూ ఒక మహావేడుకగా పరిణమించింది. వ్యాపారానికి అతీతమైనది ఏదీ లేకుండా పోయింది. సరే, ఓటు బ్యాంకు రాజకీయాలు మతపరమైన భావోద్వేగాలను సంతృప్తి పరచడానికి ప్రాధాన్యమివ్వసాగాయి. బక్రీద్ పండుగ నాడు మేకలను వధించేందుకు ముస్లింలకు అనుమతినిస్తున్నప్పుడు, దీపావళి రోజుల్లో హిందువులకు తమ ఇష్టానుసారం బాణసంచాను కాల్చేందుకు అనుమతి ఎందుకు ఇవ్వకూడదు? ఇదొక అతార్కిక వాదన. తార్కికతపై భావోద్వేగాలు గెలిచినప్పుడు ఇటువంటి అర్థం పర్థం లేని వాదనలు వస్తాయి. ఇది, మనకు మనమే హాని చేసుకోవడమే.

సర్వోన్నతన్యాయస్థానం ఆదేశాలను అమలుపరిచేందుకు ప్రభుత్వం నిజంగా నిబద్ధమైతే ఆ విషయాన్ని పోలీసులకు స్పష్టంగా తెలియజేసి ఉండవల్సింది. కోర్టు ఉత్తర్వును కచ్చితంగా అమలుపరచాలని, నిబంధనలను ఉల్లంఘించిన వారిని లాంఛనప్రాయమైన జరిమానాలతో వదిలివేయకూడదని పోలీసులకు గట్టిగా చెప్పి ఉండవల్సింది. ఈ విషయమై పై స్థాయిలో రాజకీయ సంకల్పం కొరవడింది. అయినా నానా బాధ్యతల బరువుతో కుంగిపోతున్న కానిస్టేబుల్స్ ప్రతి మొహల్లాలోనూ తిరుగుతూ బాణసంచా పేలుళ్లను నిబంధనల మేరకు అదుపుచేయడం ఎలా సాధ్యం? అది ఆచరణ సాధ్యం కాని విషయం. 'హరిత టపాసు' ఏదో, నిషిద్ధ టపాసు ఏదో చెప్పగల అవగాహన బీట్ కానిస్టేబుల్‌కు ఉండాలని న్యాయమూర్తులు, నాయకులు భావిస్తున్నారా? చట్టోల్లంఘనకు పాల్పడిన వారిపై పోలీసులు చర్య తీసుకోవాలని వారు ఆశిస్తున్నారా? సామాన్య ప్రజలు స్వచ్ఛందంగా నిబంధనలను పాటించని పక్షంలో బాణసంచాపై నిషేధంకాని, నియంత్రణ కాని పనిచేయవనే సత్యాన్ని ఎలా విస్మరిస్తున్నారు?

అసలు ఏ చట్టాన్ని అయినా పాటించడమనేది మన దేశంలో ఒక పెద్ద సవాల్‌గా ఉన్నది. 2023లో దేశవ్యాప్తంగా వివిధ నియమాలను ఉల్లంఘించినందుకు దాదాపు 8 కోట్ల ట్రాఫిక్ చలాన్లు జారీ చేశారు. చాలా మంది తాము చేసిన తప్పును పదే పదే చేసినవారే కావడం గమనార్హం. సవరించిన మోటార్ వెహికల్స్ చట్టం కింద భారీ జరిమానాలు విధించినప్పటికీ అనేక మందిని చట్టానికి కట్టుబడి ఉండేలా చేయడంలో ఆ శిక్ష విఫలమయింది! ఆ జరిమానా మరింత పెద్ద మొత్తంలో విధించినప్పటికీ వారు నిబంధనలను కచ్చితంగా పాటిస్తారనేందుకు హామీ ఉన్నదా? కొద్ది రోజుల క్రితం మహారాష్ట్ర మంత్రి కాన్వాయ్ ఒకటి ట్రాఫిక్ రద్దీని తప్పించుకునేందుకు నిబంధనలను ఉల్లంఘించింది. ఏ ట్రాఫిక్ కానిస్టేబుల్ కూడా మంత్రిని శిక్షించడం కాదు కదా, కనీసం మందలించ లేదు.

చట్టాన్ని కచ్చితంగా పాటించేలా చేయడం ఎలా సాధ్యమవుతుంది? శిక్ష పడుతుందనే భయం ఉండాలి. దానితో పాటు చట్టాన్ని పాటించాలన్న అంతః ప్రేరణ ఉండాలి. స్వచ్ఛంద ప్రవర్తనే సత్ప్రవర్తన. టపాసులు కాల్చడంలో నిబంధనలు ఉల్లంఘించిన వారిలో ఒక డజన్ మందికి కఠిన శిక్ష విధించడంతో పాటు నగుబాటుకు గురిచేయండి. అప్పుడు అది తప్పక ఒక గట్టి నేర నిరోధక చర్యగా పరిణమిస్తుంది. పాఠశాలలు, కార్యాలయాలలో అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలి. ఈ ప్రజాహిత విషయంలో మీడియా సంస్థల బాధ్యతను ప్రత్యేకంగా చెప్పాలా? విచారకరమైన విషయమేమిటంటే బాణసంచాను కాల్చడమనేది తమ మత స్వేచ్ఛ హక్కును ఉపయోగించుకోవడమేనని లక్షలాది ప్రజలకు రాజకీయులు నూరిపోశారు. ఈ హక్కును నిరాకరించే అధికారం ఏ ప్రభుత్వానికీ లేదని కూడా ప్రజల మెదళ్లలోకి ఎక్కించారు. ప్రజాహిత స్ఫూర్తిగల పౌరులు బాణసంచాకు వ్యతిరేకంగా తమ గళం విప్పితే వారిని 'హిందూ వ్యతిరేక' కులీనులు అనే ముద్ర వేస్తున్నారు. అంతేనా? వారిపై 'జాతి–వ్యతిరేకులు' అనే నింద కూడా మోపుతున్నారు!

పర్యావరణ పరిరక్షణ హిందూధర్మ స్వతస్సిద్ధ సత్యం. ఈ పురాతన ధర్మం ప్రకృతిని భగవత్ సృష్టిగా గౌరవిస్తుంది; వృక్షాలను పూజిస్తుంది; నదుల పట్ల నిత్యం భక్తిప్రపత్తులు ప్రదర్శిస్తుంది. అదే సమయంలో పర్యావరణ సుస్థిరతకు నిరంతరం ప్రయత్నిస్తుంది. పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని డిమాండ్ చేయడం సంపన్నులు, పలుకుబడి కలవారు, అధికార ప్రాభవం ఉన్నవారు అభిలషిస్తున్న విషయంగా మాత్రమే చూడకూడదు. అది సమస్త పౌరుల ధర్మబద్ధమైన విధి. హమాలీల నుంచి అందమైన హర్మ్యాలలో నివసించే ఆస్తిపరుల దాకా ప్రతి భారతీయుడినీ వాయు కాలుష్యం బాధిస్తోంది. గాలి నాణ్యత అధ్వానంగా ఉండడమనే సమస్యకు సులభ పరిష్కారాలు లేవు. పంట వ్యర్థాల దగ్ధం, పారిశ్రామిక కాలుష్యం, టపాకాయల కాంతులు, శబ్దాలతో వాటిల్లే ప్రతి సంభావ్య పర్యావరణ ప్రమాదాన్ని సంబాళించేందుకై ఏడాది పొడుగునా అమలుపరిచే ఒక సమగ్ర కార్యాచరణ పథకాన్ని రూపొందించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉన్నది. ప్రజలకు ఆరోగ్యవంతమైన భవిష్యత్తును సమకూర్చేందుకు ఈ కర్తవ్య పాలన తప్పనిసరి.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

సంక్షోభ కాలంలో రాజ్యాంగ హక్కులపై సభ

గత ఏడాది ప్రారంభంలో ఆరునెలల ఆదివాసీ పసిబిడ్డ ప్రాణాలు తీయడంతో ఆపరేషన్ కగార్ మొదలైంది. "ఈ దేశంలో జీవించి ఉండాలి అనుకుంటే మావోయిస్టులు రాజకీయంగా లొంగిపోవాలి. అలా లొంగిపోయే వాళ్లకు రెడ్ కార్పెట్ వేస్తాం. లేదంటే వారు ప్రాణాలు కోల్పోవాల్సిందే" అంటూ దేశ హోంమంత్రి ప్రకటన చేశారు. మనది ప్రజాస్వామికమైన, లౌకిక సార్వభౌమాధికార దేశమని చెప్పుకుంటున్న చోట ఆయన ప్రకటన ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

మన రాజ్యాంగం ప్రకారం పౌరుడికి మాట్లాడే స్వేచ్ఛ, పోరాడే హక్కు, సభలు నిర్వహించుకునే హక్కు ఉన్నాయి. అలాగే తనకు నచ్చిన రాజకీయాలను విశ్వసించే హక్కు, విశ్వసించిన దానిని ఆచరించే హక్కు పౌరునికి ఉంది. కానీ దేశ ప్రజల రాజకీయ స్వేచ్ఛను కేంద్రం నియంత్రిస్తోంది. కేంద్ర ప్రభుత్వం చేసిన ఆపరేషన్ కగార్ ప్రకటన మావోయిస్టులు, నక్సలైట్లను ఉద్దేశించినది ఎంతమాత్రం కాదు. పోరాడే ప్రగతిశీల శక్తులు, ప్రజాస్వామికవాదులు, దళితవాదులు, స్త్రీ విముక్తివాదులు, జాతి విముక్తివాదులు, ఆదివాసీ స్వయంపాలన కోరుకునేవారు, సమాన హక్కుల రక్షణను కోరే మత మైనారిటీలు, 'మేమెంతో మాకంత' అని కోరే బహుజనవాదులు, ఫాసిస్టు ధోరణులను వ్యతిరేకించే ప్రజాస్వామికవాదులు... ఇలా అన్ని వర్గాల ప్రజలపై మానవ హననాన్ని కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తున్నది.

భారత రాజ్యాంగం అందించిన హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ దమననీతిని ఖండిద్దాం. ఆపరేషన్ కగార్‌లో భాగంగా జరిగిన హత్యలను సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. ఈ సంక్షోభ కాలంలో ప్రజాస్వామిక వాతావరణాన్ని నెలకొల్పడం కోసం ప్రజలు, మేధావులంతా కలిసి ఐక్యంగా పోరాడుదాం.

నేటి ఉదయం పది గంటలకు హైదరాబాద్, సుందరయ్య విజ్ఞాన కేంద్రం (బాగ్ లింగంపల్లి)లోని షోయబ్ హాల్లో సమావేశం నిర్వహిస్తున్నాం. 'సంక్షోభ కాలం –రాజ్యాంగ హక్కులు' అనే అంశంపై ప్రజా సంఘాల ఉమ్మడి వేదిక ఆధ్వర్యంలో జరిగే ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి అందరూ ఆహ్వానితులే.

– ప్రజా సంఘాల ఉమ్మడి వేదిక

అర్థంకాని ఈ సమాజాన్ని ఎలా మారుస్తారు?!

రాజ్యాంగం ప్రకారం మనది 'సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్రం'. అయితే రాజ్యాంగాల్లో ప్రకటించుకున్నట్టుగా ఏ సమాజమూ ఉండదు; ఏ ప్రభుత్వమూ పనిచేయదు. రాజ్యాంగ పరిధిలోనే భారతదేశం 'హిందూ మతరాజ్యం'గా మారిపోయిందని సుబ్రమణియన్ స్వామి వంటివాళ్ళు ఐదేళ్ళ క్రితమే ప్రకటించారు. ఒక ప్రజాస్వామిక రాజ్యాంగం అమల్లో వుండగా దేశంలో మతరాజ్యం ఏర్పడడం రాజకీయ ధార్మిక రంగాల్లో వైచిత్రి కావచ్చుగానీ, సామాజిక రంగంలో అది చాలా పెద్ద సంక్షోభాన్ని రేపుతుంది.

భారత సమాజాన్ని అంచనా వేయడంలో కమ్యూనిస్టు పార్టీల్లో కూడా విపరీతమైన వైరుధ్యం కనిపిస్తుంది. సమాజాన్ని అర్థం చేసుకున్న దాన్నిబట్టే ఆయా పార్టీల దీర్ఘకాలిక కార్యక్రమాల రూపకల్పన జరుగుతుంది. మనది అర్ధ భూస్వామ్య–అర్ధ వలస సమాజమని మార్క్సిస్టు–లెనినిస్టు పార్టీలన్నీ భావిస్తుంటాయి. ఇది 1935–40 మధ్య ప్రాంతంలో చైనా సమాజం గురించి మావో చేసిన విశ్లేషణ. దాన్నుండి ఆయన 'నూతన ప్రజాస్వామిక విప్లవం' అనే కార్యక్రమాన్ని రూపొందించాడు. చైనాలో సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయ బూర్జువా వర్గం కూడా కమ్యూనిస్టుల విప్లవంతో కలిసి వచ్చింది. ఇండియాలో అలాంటి పరిస్థితి లేకపోయినా, స్థల కాలాలు మారిపోయినా, మావోయిస్టులు సహా మార్క్సిస్టు–లెనినిస్టు పార్టీలన్నీ 'నూతన ప్రజాస్వామిక విప్లవం'ను పట్టుకుని వేలాడుతున్నాయి.

1990లలో మన దేశంలోనే కాక ప్రపంచవ్యాప్తంగా సామాజిక ఆర్థిక వ్యవస్థల పునాది మారిపోయింది. తూర్పు యూరప్‌లోని సోషలిస్టు ప్రభుత్వాలు పతనం కావడమే గాక సోషలిస్టు రష్యా సహితం విచ్ఛిన్నం అయిపోయింది. కమ్యూనిజానికి ఆమోదాంశం ఇరుకున పడిపోయింది. మరోవైపు, గాట్ కారణంగా ప్రపంచ వాణిజ్య సంస్థ ఏర్పడి సరళీకృత ఆర్థిక విధానాలు వచ్చాయి. డిజిటల్ టెక్నాలజీతో సంప్రదాయ ఉత్పత్తి విధానమే మారిపోయింది. వీటికితోడు మనదేశంలో మతతత్వ రాజకీయాలు విజృంభించాయి. కొత్త గణాంకాల ప్రకారం మనదేశ జీడీపీలో వ్యవసాయం, ఆక్వా, అటవీ సంపదల వాటా 16.3 శాతం. పారిశ్రామిక రంగం వాటా 29 శాతం. కొత్తగా ప్రవేశించిన సర్వీస్ సెక్టార్ వాటా 54.55 శాతం. అయినప్పటికీ ఇంకా ఎవరైనా వ్యవసాయిక విప్లవం, నూతన ప్రజాస్వామిక విప్లవం అంటూ ఉంటే మాత్రం వాళ్ళ మెదళ్ళను పురాతత్వశాలల్లో జాగ్రత్తగా భద్రపరచాలి! ఏ సమాజంలో అయినా ఉత్పత్తిశక్తులు, ఉత్పత్తి సంబంధాలతో కూడిన ఉత్పత్తి విధానం రాజకీయాలతో సహా ఇతర సామాజిక సాంస్కృతిక రంగాలన్నింటినీ ప్రభావితం చేస్తుంటుంది. ఈ సూత్రాన్ని 21వ శతాబ్దపు డిజిటల్ సమాజానికి అన్వయించే పని ఎవరూ చేయలేదు.

> **సమాజాన్ని వాస్తవికంగా అర్థంచేసుకోకుండా దాన్ని మార్చే కార్యక్రమాన్ని ఎవ్వరూ రూపొందించలేరు. విప్లవ కార్యక్రమాన్ని రూపొందించడమే సజావుగా సాగనప్పుడు దాన్ని విజయవంతం చేయడం అసాధ్యం అవుతుంది. ప్రస్తుతం మావోయిస్టు పార్టీ ఉనికి సంక్షోభంలో పడిపోవడం దీనికి సరికొత్త హెచ్చరిక.**



ఆధిపత్య సమూహాల దగ్గర రాజకీయ అధికారంతో సహా వనరులన్నీ సమృద్ధిగా ఉంటాయి. అంచేత వాళ్ళు కొత్త సమాజాన్ని విశ్లేషించుకోకపోయినా వాళ్ళకు వచ్చే ఇబ్బంది ఏమీ లేదు. కానీ, వర్తమాన సమాజం వల్ల ఇబ్బందులు, వివక్ష, అణచివేతలకు గురయ్యేవాళ్ళు దాన్ని మార్చాలనుకుంటే మాత్రం కొత్త పరిణామాలను నిశితంగా విశ్లేషించుకోక తప్పదు. సమాజాన్ని వాస్తవికంగా అర్థం చేసుకోకుండా దాన్ని మార్చే కార్యక్రమాన్ని ఎవ్వరూ రూపొందించలేరు. విప్లవ కార్యక్రమాన్ని రూపొందించడమే సజావుగా సాగనప్పుడు దాన్ని విజయవంతం చేయడం అసాధ్యం అవుతుంది. ప్రస్తుతం బస్తర్‌లో మావోయిస్టు పార్టీ ఉనికి సంక్షోభంలో పడిపోవడం దీనికి సరికొత్త హెచ్చరిక.

మరోవైపు, దేశాన్ని ఫాసిజమో, నాజీయిజమో పాలిస్తున్నదనే అభిప్రాయాన్ని కొందరు తరచూ వ్యక్తం చేస్తున్నారు. పాలకుల్లో ఆ లక్షణాలు కనిపిస్తున్నమాట నిజమేగానీ వందేళ్ళ నాటి ఇటలీ, జర్మనీ రాజకీయ సామాజికార్థిక పరిస్థితులూ ఇప్పటి మన సామాజిక వాస్తవమూ ఒకటి కానే కాదు. ఇప్పుడు మనం చూస్తున్నది కార్పొరేట్ మత తత్త్వ నియంతృత్వం. (Corporate Communal Dictatorship –CCD). కార్పొరేట్ పెట్టుబడిదారీ విధానం, హిందూత్వ ఆధిపత్యం, రాజ్య అణచివేతల క్రూర సమ్మిశ్రిత వ్యవస్థ ఇది. ఆర్థిక రంగంలో సహజ, కృత్రిమ వనరులు, శాస్త్రవిజ్ఞానం మొత్తం కార్పొరేట్ల ఆధీనంలోకి వెళ్ళిపోతుంటాయి. సాంస్కృతిక రంగంలో మెజారిటీ మతం ఇతర మతాలను అణచివేస్తుంటుంది. హిందూ సమూహాలను ఐక్యం చేయడానికి దానికున్న ఏకైక మార్గం ఇస్లాం, క్రైస్తవ మతాలను దేశ భద్రతకు ముప్పుగా ప్రచారం చేస్తుండడం. సామాన్య ప్రజలు తిరగబడకుండా రాజ్యం అణచివేస్తుంటుంది. ఈ మూడు రకాల అణచివేతల బాధితులు ఏకం కావాలని కొందరు సమంజసంగానే అంటుంటారు గానీ అది అంత సులువు కాదు.

"హిందూ సమాజం అంటూ ప్రత్యేకంగా ఏదీ ఉనికిలో ఉండదు. అది కేవలం కులాల సమాహారం. ప్రతి కులం తన ఉనికి గురించి తపనతో ఉంటుంది. దాని మనుగడే దాని ఉనికికి మూలం, అదే దాని ముగింపుకూ మూలం. కులాలు ఎన్నడూ ఒక సమాఖ్యగా కూడా ఏర్పడవు. కాబట్టి, హిందూ సమాజాన్ని కులాల సముదాయం అనడం కూడా సరికాదు. ఒకరితో మరొకరు పోరాడుతుండే సమూహాలు అవి. హిందూ–ముస్లిం అల్లర్లు జరిగినప్పుడు మాత్రమే హిందూ కులాల మధ్య అనుబంధం ఏర్పడుతుంది. అది కూడా తాత్కాలికం మాత్రమే. ఇతర సందర్భాల్లో ఒక కులం మరో కులంతో తనకో అనుబంధం ఉందని కనీసంగానైనా భావించదు," అన్న బిఆర్ అంబేడ్కర్ మాటలు నేటికీ వర్తిస్తాయి. అంబేడ్కర్ మాటల్ని తిరగేసి చూస్తే, ఎన్నికల్లో హిందూ ఓటు బ్యాంకును కొల్లగొట్టాలంటే నిరంతరం ముస్లిం భూతాన్ని చూపుతుండాలి అనే అర్థం వస్తుంది. దీనినే ఇస్లామోఫోబియా అంటున్నారు. అలా చేస్తే, హిందూ సమాజం మొత్తం కాకున్నా వాళ్ళలో 36–38 శాతం ఓట్లు వేసినా అప్రతిహత శక్తి అని చెప్పుకునే అవకాశం మన పార్లమెంటరీ ఎన్నికల వ్యవస్థలో ఉంది.

సమాజం నిలువు దొంతరలుగానేగాక, సమాంతరంగానూ సమూహాలు సమూహాలుగా విడిపోయి ఉంటుంది. నిలువు దొంతరల్ని విశ్లేషించినంత సులువుకాదు సమాంతర సమూహాల మధ్యనున్న వైరుధ్యాలను పరిష్కరించడం. నిలువు దొంతరలు కళ్ళకు కనిపిస్తుంటాయి. సమాంతర సమూహాలను విడగొట్టి చూడడం కష్టసాధ్యం. సమాజం మారాలనో, సమాజాన్ని మార్చాలనో చాలామంది అంటుంటారు. అలాంటివాళ్ళు అన్నింటికన్నా ముందు సమాజ వాస్తవికతను గుర్తించాలి. దానికి బాధితుల జాబితా సిద్ధం చేయాలి. సాధారణ బాధితులు మొదలు ప్రధాన బాధితుల వరకు ఒక గ్రేడింగ్‌ను కూర్చాలి. ఇప్పటి సమాజాన్ని ఎలాంటి సమాజంగా మార్చాలని ఆశిస్తున్నామో, ఎలాంటి సమాజాన్ని నిర్మించగలమో– నిర్ధారించుకోవాలి. అప్పుడు ఆ దిశగా ప్రయాణించడానికి ఒక రోడ్ మ్యాప్‌ను రూపొందించుకోవచ్చు. అయితే, ఇది చాలా సంక్లిష్ట ప్రక్రియ. తరచూ మన గతమే మనల్ని కట్టి పడేస్తుంది.

వర్తమాన భారత మేధోరంగాన్ని మూడు దృక్పథాలు నడుపుతున్నాయి. ఎంఎస్ గోల్వాల్కర్, కార్ల్ మార్క్స్, బిఆర్ అంబేడ్కర్. గోల్వాల్కర్ ఆలోచనా విధానానికి వ్యతిరేకంగా మార్క్స్, అంబేడ్కర్ ఆలోచనా స్రవంతుల్ని ఏకం చేయాలి అని చాలామంది అనవచ్చు. దీనినే లాల్ – నీల్ మైత్రి అంటున్నారు కొందరు. లోతుగా చీలిపోయిన సమాజంలో ఇది అంత సులువైన వ్యవహారం కాదు. ఇప్పటి ఇండియా కార్పొరేట్ మతతత్త్వ నియంతృత్వానికి ప్రధాన బాధితులు ముస్లింలు, ఆదివాసులు. ఉద్యమంలోనూ, ఆ తరువాత మనం కోరుకుంటున్న సమాజంలోనూ ఈ రెండు సమూహాల స్థానాన్ని నిర్ణయించకపోతే బండి ఒక్క అడుగు కూడా ముందుకు నడవదు. ఆలస్యం జరిగేకొద్దీ, కార్పొరేట్ పెట్టుబడిదారీ విధానం, హిందుత్వ ఆధిపత్యం, రాజ్య అణచివేత మూడూ మరింతగా పెరుగుతుంటాయి.

◆ డానీ
సమాజ విశ్లేషకులు



వినూత్న ఆవిష్కరణలు... ఆలోచింపచేసే ఎగ్జిబిట్లు.. సరికొత్త ఆలోచనలతో సందడి చేసే సాంకేతికోత్సవం ఉత్సాహంగా ప్రారంభమైంది. వరంగల్‌లోని నిట్ కళాశాల ఆడిటోరియంలో శుక్రవారం దేశంలోని వివిధ కళాశాలల విద్యార్థుల సమక్షంలో చెనాబ్ బ్రిడ్జి ఫేమ్ ప్రొఫెసర్ మాధవీలత జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తొలి రోజు ఈవెంట్లతో విద్యార్థులు అదరగొట్టారు. విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్లు వారి యువ మేధోమథనానికి అద్దం పట్టాయి. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో నూతన ఆవిష్కరణలకు స్వాగతం పలికాయి. మొత్తంగా విద్యార్థి క్లబ్బుల పక్షాన 23 ఈవెంట్లను, నిట్‌లోని వివిధ టెక్నికల్ సొసైటీల తరుపున 31 ఈవెంట్లను ప్రదర్శించారు. ముఖ్యంగా వాహన ప్రదర్శన, బాంబ్ అవే, నియాన్ క్రికెట్, గ్రీటింగ్ రోబో, వీఆర్ స్పేస్ టూర్, కార్ రేస్, లైడిక్టర్ ఈవెంట్‌లు ఆకట్టుకున్నాయి. వీటితో పాటు పలు వర్క్‌షాపులు, నిపుణుల ప్రసంగాలు, కొత్తగా ప్రవేశపెట్టిన ఈవెంట్లు విద్యార్థుల సాంకేతిక దృక్పథానికి అద్దం పట్టాయి. ఈవెంట్లను తిలకించేందుకు విద్యార్థులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. దీంతో నిట్ క్యాంపస్ కోలాహలంగా మారింది.

- ఆంధ్రజ్యోతి, హనుమకొండ

ఆవిష్కరణలే హద్దుగా..

నిట్‌లో ఘనంగా ప్రారంభమైన

టెక్నోజియాన్-25

- ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ మాధవీలత
- మొదటి రోజు ఆకట్టుకున్న ఈవెంట్లు
- పోటాపోటీగా పాల్గొన్న విద్యార్థులు
- సందడిగా మారిన నిట్ క్యాంపస్
- ఆవిష్కృతమైన సాంకేతిక మినీ భారతం

7



క్వాడ్ టార్క్ ఈవెంట్



టెక్నోజియాన్‌ను ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ మాధవీలత

హద్దులను చెరిపేసుకో..

అలాగే పరిమితులనూ తెలుసుకో..

- అపజయాలకు వెరవకు.. విజయాల కోసం శ్రమించు..
- నిర్భయంగా ఉండు.. నిగ్గదీసి అడుగు..
- గుర్తింపు కోసం వెంపర్లాడకు.. మన శ్రమే దాన్ని తీసుకొస్తుంది
- నిట్ నాకు జీవితాన్ని, జీవిత భాగస్వామిని ఇచ్చింది..
- చెనాబ్ బ్రిడ్జి ఫేమ్ ప్రొఫెసర్ మాధవీలత
- నిట్ టెక్నోజియాన్ ప్రారంభ కార్యక్రమంలో ప్రసంగం

7

వంగర గురుకులంలో విద్యార్థిని ఆత్మహత్య

- ప్రిన్సిపాల్, సిబ్బంది వేధింపులతోనేనని ఫిర్యాదు
- విచారణకు ఆదేశించిన మంత్రి పొన్నం
- ప్రాథమికంగా విచారణ చేపట్టిన డీఈవో
- పాఠశాల ఎదుట సీపీఐ నాయకుల ధర్నా



బోరున విలపిస్తున్న విద్యార్థులు



శ్రీవర్షిణి(ఫైల్)

భీమదేవరపల్లి, (ఎల్కతుర్తి) అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థిని శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర బాలిక గురుకుల పాఠశాలలో చోటు చేసుకుంది. ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, తల్లిదండ్రులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన వనం తిరుపతి-మమత దంపతులు వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. వీరికి ఏకైక కుమార్తె వనం శ్రీవర్షిణి(15) నాలుగేళ్ల కిందట వంగరలోని పీవీ నర్సింహరావు బాలికల గురుకుల పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశం పొందింది. కాగా, వారం (మిగతా 6లో..)

జాతీయ స్థాయిలో వరంగల్ అభివృద్ధి

- మామునూరు ఎయిర్‌పోర్టు పనులు వేగవంతం చేయాలి
- కేంద్రం నుంచి అదనపు నిధులకు కృషి చేస్తా..
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- నియోజకవర్గ సమస్యలపై వరంగల్ కలెక్టర్‌తో భేటీ



కలెక్టర్ సత్యశారదతో సమావేశమైన ఎంపీ కావ్య

హనుమకొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌ను అభివృద్ధిలో జాతీయ స్థాయిలో ముందుకు తీసుకువెళ్లడమే తనలక్ష్యం అని వరంగల్ ఎంపీ కడియం కావ్య స్పష్టం చేశారు. వరంగల్ జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగం, ప్రత్యేక ప్రాజెక్టుల పురోగతిపై వరంగల్ కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ సత్యశారదతో ఎంపీ కావ్య సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కేంద్రం నుంచి మంజూరైన పలు పథకాలు, ప్రజాప్రయోజన పనులపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఎంపీ డాక్టర్ కావ్య మాట్లాడుతూ.. వరంగల్ జిల్లా అభివృద్ధిలో వేగం మరింత పెంచడానికి కేంద్రప్రభుత్వ నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న కీలక ప్రాజెక్టుల పురోగతిపై ఎంపీ సమగ్రంగా చర్చించారు. మామునూరు ఎయిర్‌పోర్టు విస్తరణకు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. మెగా టెక్స్‌టైల్ పార్క్‌కు కేంద్ర ప్రభుత్వం కేటాయించిన పీఎం మిత్రనిధులు వినియోగం, ప్రాజెక్టు ముందడుగు విషయాలపై ఎంపీ వివరాలు కోరారు. గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి సంబంధించి భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలంటూ ఎంపీ ఆదేశించారు. కాకతీయుల చారిత్రక వారసత్వ సంపద రక్షణ అభివృద్ధితో పాటు జిల్లా పురావస్తు పరిశోధన, ప్రదర్శన శాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. వరంగల్ పర్యాటక రంగ విస్తరణ కోసం పలు ఆలయాలను ప్రసాద్ స్కీమ్ కింద అభివృద్ధి చేయడానికి కేంద్ర పర్యాటక శాఖతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. ప్రత్యేకంగా గురుకుల పాఠశాలల్లో చదువుతున్న ఆడపిల్లల ఆరోగ్యం, భద్రత అంశాలపై ఎంపీ దృష్టి సారించారు. విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించే కార్యక్రమాలు, కౌన్సెలింగ్ తరుచుగా నిర్వహించాలని సూచించారు. వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి అదనపు నిధులు కేటాయించేలా ప్రయత్నాలు చేస్తానని ఎంపీ కావ్య హామీ ఇచ్చారు. వరంగల్ అభివృద్ధి విషయంలో వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో తన గళాన్ని వినిపిస్తానని ఎంపీ స్పష్టం చేశారు. జిల్లా అభివృద్ధి దిశగా కృషి చేస్తానని పేర్కొన్నారు.

విద్య కాషాయీకరణ విధానాలను అడ్డుకోవాలి

- పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు నున్నా అప్పారావు
- కేయూ పీడీఎస్‌యూ జిల్లా మొదటి మహాసభ

7



సేవా కార్యక్రమాల్లోనూ ముందుంటాం..

- సీపీ సన్‌ప్రీత్ సింగ్ వెల్లడి
- పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



శిబిరంలో రక్తదానం చేస్తున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): శాంతి, భద్రతలను పరిరక్షించడమే కాదు.. సేవా కార్యక్రమాలు చేయడంలోనూ పోలీసులు ముందు వరుసలో ఉంటారని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు ఈ సందర్భంగా ముందుగా సీపీ రక్తదానం చేసి యువతలో స్ఫూర్తిని రగిలించారు. పోలీస్ అధికారులతో పాటు యువత, ఆటోడ్రైవర్స్ పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం సీపీ మాట్లాడుతూ.. రక్తదానంపై ఉన్న అపోహలను నమ్మకుండా ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. పోలీస్ సిబ్బంది వ్యక్తిగత ఆరోగ్యంపై దృష్టిపెట్టాలన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి పండ్లు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్, అదనపు డీసీపీలు రవి, సురేశ్ కుమార్, శ్రీనివాస్, ఏసీపీలు అనంతయ్య, సురేంద్ర, సత్యనారాయణ, నాగయ్య, జాన్ నర్సింహులు, జితేందర్‌రెడ్డి, ఆర్‌ఐలు, హనుమకొండ రెడ్‌క్రాస్‌బ్లడ్ బ్యాంకు ప్రతినిధులతో పాటు పోలీస్ యూనిట్ వైద్యులు పాల్గొన్నారు.

మహా జాతరకు నిరంతర విద్యుత్

- 259 ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా సరఫరా
- 911 పోల్స్‌తో 61.17 కిలోమీటర్లు కొత్త లైన్లు
- భక్తులకు అసౌకర్యం కలగకుండా మరమ్మతు పనులు
- మేడారంలో ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ల వెల్లడి



మేడారంలో విద్యుత్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న అధికారులు

తాడ్వాయి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మేడారం మహా జాతరకు నిరంతరం విద్యుత్ అందించేలా చర్యలు చేపడుతున్నామని ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లు మధుసూదన్, మోహన్‌రావులు వెల్లడించారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో చేపట్టిన విద్యుత్ మరమ్మతు పనులను శుక్రవారం వారు పరిశీలించారు. మహా జాతరకు ఏర్పాటు చేస్తున్న విద్యుత్ ఏర్పాట్ల వివరాలను చీఫ్ ఇంజనీర్ రాజు చౌహాన్, ఎస్ఈ మల్సూర్ నాయక్‌లను అడిగి తెలుసుకున్నారు. మేడారంలో కనురెప్ప పాటు విద్యుత్ అసౌర్యం కలుగవద్దని అధికారులకు, సిబ్బందికి సూచించారు. సమస్యలు ఉన్న ప్రాంతాలను గుర్తించి ముందుగానే పరిష్కరించుకోవాలన్నారు. ఆయా ప్రాంతాలను నోటీసులో ఉంచుకోవాలని చెప్పారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మేడారం మహాజాతరకు నిరంతరం విద్యుత్ అందించేలా మరమ్మతు పనులు చేపట్టినట్లు తెలిపారు. 259 ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. 911 పోల్స్‌తో 61.17 కిలోమీటర్లు నూతన విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. జాతరలో 350మంది సిబ్బంది విధులు నిర్వహిస్తారని తెలిపారు. ముఖ్యంగా ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. జాతర సమయంలో విద్యుత్ అంతరాయాలు (మిగతా 6లో..)



వేం నరేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

రిటైర్డ్ ఉద్యోగుల బెన్‌ఫిట్స్ చెల్లించండి

హనుమకొండ కలెక్టరేట్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఉద్యోగుల బెన్‌ఫిట్స్‌ను వెంటనే చెల్లించాలని రిటైర్డ్ ఎంప్లాయీస్ (బెన్ఫిట్స్) సాధన కమిటీ నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో సీఎం సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ కోదండరామ్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డిలను కలిసి వినతి పత్రాలు అందజేశారు. 2024 మార్చి నుంచి ఇప్పటివరకు ఉద్యోగ విరమణ పొందిన వారు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రయోజనాలు అందలేదన్నారు. ఇప్పటికైనా చెల్లించాలని వారు వినతి పత్రంలో కోరారు. వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీలను కలిసిన వారిలో రిటైర్డ్ ఎంప్లాయీస్ సాధన కమిటీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ల ధర్మేంద్ర, ప్రధాన కార్యదర్శి కడారి భోగేశ్వర్, అసోసియేట్ అధ్యక్షుడు ఎం.డి. మహబూబ్ అలీ, అశోక్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ప్రమాణ స్వీకారం చేసిన విశ్రాంత పోలీస్ అధికారుల కార్యవర్గం



ప్రమాణ స్వీకారం చేస్తున్న అధ్యక్షుడు, ఇతర సభ్యులు

వరంగల్ క్రైం, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గం శుక్రవారం హనుమకొండలోని సంఘం కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. గత అదివారం సంఘం కార్యాలయంలో కొత్త కార్యవర్గం కోసం ఎన్నికలు జరగగా, సుమారు 280పైగా సభ్యులు ఓటు హక్కు వినియోగించుకొని కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆర్.సంజీవ రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎల్.జయ్‌పాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పి.శ్యాంసుందర్ రావు, కోశాధికారిగా ఎం.డి. సర్వర్, జాయింట్ సెక్రటరీగా ఎం.లోకేందర్‌రెడ్డి ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎం.డి. మసూద్ హుస్సేన్, సెక్రటరీగా డి.సురేందర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా బి.రవిందర్, టి. విభూషన్‌రెడ్డిలు ప్రమాణ స్వీకారం చేసిన వారిలో ఉన్నారు.

పదో తరగతి పరీక్షల ఫీజు గడువు నవంబరు 13

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక, ఒకేషనల్ పరీక్షల ఫీజును నవంబరు 13వ తేదీలోపు చెల్లించాలని వరంగల్, హనుమకొండ జిల్లాల విద్యాశాఖ అధికారులు రంగయ్య నాయుడు, డి.వాసంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30వ తేదీ నుంచి నవంబరు 13 వరకు, రూ.50 అపరాధ రుసుముతో నవంబరు 29వరకు, రూ.200 ఆలస్య రుసుముతో డిసెంబరు 11 వరకు, రూ.500 ఆలస్య రుసుముతో డిసెంబరు 29వ తేదీ లోపు చెల్లించవచ్చని వారు పేర్కొన్నారు. అన్ని సబ్జెక్టులకు ఫీజు రూ.125గా నిర్ణయించడం జరిగిందని, గతంలో ఫెయిలు అయిన వారు మూడు సబ్జెక్టులకు గాను రూ.110, మూడు సబ్జెక్టులకు మించి రూ.125 ఫీజు చెల్లించాలి. ఒకేషనల్ పరీక్షలకు రూ.60 ఫీజు చెల్లించాలని వరంగల్, హనుమకొండ జిల్లాల విద్యాశాఖ అధికారులు రంగయ్య నాయుడు, డి.వాసంతి సూచించారు. పరీక్షలను 2026 మార్చి నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

రహదారుల సమాచార నమోదు యాప్ రూపకల్పన

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

ఐసీసీసీ కేంద్రంలో ఆకస్మిక తనిఖీ

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో రహదారుల సమాచార నమోదు కోసం ప్రత్యేకమైన యాప్ రూపకల్పన చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అధికారులకు సూచించారు. శుక్రవారం వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని ఐసీసీసీ కేంద్రాన్ని కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నగరంలోని వాహనాల కదలికలపై అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ల వద్ద కొనసాగుతున్న పనులు జీపీఎస్ ట్రాకింగ్‌లో పలు ప్రాంతాలను పరిశీలించారు. చెత్త తరలింపు వాహనాల పనితీరును పరిశీలించి ఐసీసీసీ నుంచి మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలోని అన్ని ప్రాంతాలకు వెంటనే రూట్ మ్యాప్‌ను ఇప్లిమెంటేషన్ చేసి ఇందుకోసం ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించాలన్నారు. వాహనాలకు సంబంధించిన పూర్తి సమాచారం కలిగి ఉండాలన్నారు. వాహనం ఎక్కడ నిలిచినా వెంటనే అలర్ట్ వచ్చే విధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఐటీ అధికారి రాజారెడ్డి, ఐసీసీసీ ఇంచార్జీ తేజస్విని, డిజిటల్ ఇంజనీర్ నవ్యతో పాటు అక్కడి సిబ్బంది పాల్గొన్నారు.



క్రిస్టియన్ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

క్రిస్టియన్ కాలనీ కమ్యూనిటీ హాల్ పరిశీలన

గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలోని 18వ డివిజన్ క్రిస్టియన్ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌ను జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ శుక్రవారం తనిఖీ చేశారు. ఇటీవల నగరంలోని కమ్యూనిటీ హాళ్లను స్వాధీనం చేసుకుంటున్న నేపథ్యంలో ఈ తనిఖీలు నిర్వహించినట్టు తెలిపారు. క్షేత్రసాకథయిలో సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ వెంట కార్పొరేటర్ వస్కుల బాబు, ఎస్ఈ సత్యనారాయణ, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, ఈఈ సంతోష్‌బాబు, ఆర్‌వో శ్రీనివాస్, ఆర్ఐ ప్రతిభతో పాటు పలువురు సిబ్బంది ఉన్నారు.

ఉపాధి కోసం ఎగ్‌కార్ట్స్ పంపిణీ

ఎన్ఈసీసీ వరంగల్ జోనల్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

వరంగల్‌సిటీ, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని, అందులో భాగంగానే ఎగ్‌కార్ట్‌లను పంపిణీ చేస్తున్నామని నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ (ఎన్ఈసీసీ) వరంగల్ జోనల్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. శుక్రవారం ఓసిటీలో సుమారు వంద ఎగ్‌కార్ట్‌లను రోడ్డు పక్కన తోపుడు బండ్లు పెట్టుకుని జీవనం సాగిస్తున్న నిరుపేదలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డువెంట వెళుతుంటే తోపుడుబండ్లపై టిఫిన్ సెంటర్లు, చాయ్ బండ్లు పెట్టుకుని ఉపాధి పొందుతున్న వారిని చూశాక మనసు చలించి ఈ విషయాన్ని 'నెక్' జాతీయ అధ్యక్షురాలు అనురాధ దేశాయ్ దృష్టికి తీసుకెళ్లానని, దీంతో ఆమె స్పందించి వంద ఎగ్‌కార్ట్‌లను అందించారని అన్నారు. దేశవ్యాప్తంగా ఎక్కడాలేని విధంగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలోనే ఇప్పటి వరకు 550 ఎగ్‌కార్ట్‌లను పంపిణీ చేశామన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మరో 500ల ఎగ్‌కార్ట్‌లను అందజేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మొత్తం సుమారు రూ.ఐదుకోట్ల విలువైన ఎగ్‌కార్ట్‌లను అందజేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఎగ్‌కార్ట్‌తో పాటు కుర్చీలు, స్టవ్, మూకుడు, వంట సామగ్రి ఒక్కొక్కటి యాభైవేల విలువ చేసే సెట్‌లను ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. రోడ్‌సైడ్ చిన్న వ్యాపారం పెట్టుకుందామనుకున్నవారికి ఈ బండి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్రబెల్లి వినీత్, వెంకట్‌గౌడ్, కర్నె రవిందర్, బోరిగె నాగరాజు, అజయ్‌గౌడ్, నైనేష్, ఆదిత్య, వినయ్ నెక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఎగ్‌కార్ట్‌లను పంపిణీ చేస్తున్న ఎన్ఈసీసీ వరంగల్ జోనల్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

వైద్య విద్య పీజీలో సంజనకు ఆల్ ఇండియా ర్యాంకు



వరంగల్ మెడికల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నీట్ 2025 పీజీ ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్షలు వరంగల్‌కు చెందిన డాక్టర్ సూరం సంజన జాతీయస్థాయిలో 130వ ర్యాంకు సాధించింది. రాష్ట్రస్థాయి జాబితా ప్రక టిస్తే ఐదో ర్యాంకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిమ్స్‌లో జన రల్ మెడిసిన్‌లో పీజీ విద్యను పూర్తి చేసి, గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగంలో సూపర్ స్పెషాలిటీ చదువుకోవాలని ఉందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యురాలిగా కొనసాగుతూ పేదలకు వైద్యం అందించడమే తన లక్ష్యంగా పేర్కొంది. డాక్టర్ సంజన తల్లి వరంగల్ దేశాయిపేటలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుండగా, తండ్రి భాస్కర్ వ్యాపార రంగంలో కొనసాగుతున్నారు.

మహా జాతరకు నిరంతర విద్యుత్

(5వ పేజీ తరువాయి)

కలుగకుండా ఉండేందుకు పస్రా, కమలాపూర్ 132/33 కేవీసబ్‌స్టేషన్ నుంచి మూడు 33 కేవీ లైన్ల ద్వారా విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. పస్రా, కమలాపూర్ సబ్‌స్టేషన్ నుంచి తాడ్వాయి మీదుగా మేడారంలో ఉన్న సమ్మక్క, సారలమ్మ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా అవుతుందని తెలిపారు. అదేవిధంగా పస్రా నుంచి కొత్తూరు సబ్‌స్టేషన్‌కు, నార్లాపూర్ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. సమస్యలు ఉత్పన్నం కాకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ఈ క్రమంలోనే మేడారం పరిసరాల్లో విద్యుత్ మరమ్మతు ఏర్పాట్లను తిరిగి పరిశీలించామన్నారు. అంతేకాకుండా అధికారులకు పలు సూచనలు చేసినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక డీఈ నాగేశ్వరావు, కన్‌స్ట్రక్షన్ డీఈ సదానందం, ఏఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మన్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

వంగర గురుకులంలో విద్యార్థిని ఆత్మహత్య

(5వ పేజీ తరువాయి)

కిందట అనారోగ్య సమస్యలతో శ్రీవర్షిణి తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. తిరిగి గురువారం గురుకుల పాఠశాలకు వచ్చింది. శుక్రవారం ఉదయం తోటి విద్యార్థినులతో కలిసి టిఫిన్ చేసింది. అనంతరం తరగతి గదిలో హాజరు తీసుకుంటుండగా శ్రీవర్షిణి పలుకలేదు. దీంతో విద్యార్థినులు డార్మెటరీ వద్దకు వెళ్లారు. అప్పటికే డార్మెటరీ తలుపు లోపలివైపు గడియ పెట్టి ఉంది. హాస్టల్ సిబ్బంది బలవంతంగా తలుపులను తెరిచారు. అప్పటికే శ్రీవర్షిణి చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో విద్యార్థినులు బోరున విలపించారు. విషయం తెలుసుకున్న శ్రీవర్షిణి తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని కన్నీరుమున్నీగా విలపించారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఆఫ్రిన్, సిబ్బంది వేధింపులు భరించలేకనే తమ కూతురు ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులకు ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్ తెలిపారు.

విచారణకు మంత్రి పొన్నం ఆదేశాలు

వంగర గురుకుల పాఠశాలలో పదోతరగతి విద్యార్థిని శ్రీవర్షిణి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకున్న రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ విచారణకు ఆదేశించారు. హనుమకొండ జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి మృతికి గల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి ఆదేశాల మేరకు జిల్లా విద్యాధికారి వాసంతి, తహసీల్దార్ రాజేష్, ఎంపీడీవో వీరేశం, ఎంఈవో సునీత తదితరులు గురుకుల పాఠశాలకు వచ్చి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా డీఈవో వాసంతి తోటి విద్యార్థినులు, పాఠశాల సిబ్బంది, అధ్యాపక బృందాన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే సాయంత్రం గురుకుల పాఠశాల ఏజీవో తార సింగ్ నాయక్ విచారణ జరిపారు. విచారణ నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని డీఈవో వాసంతి విలేకరులకు తెలిపారు. శుక్రవారం ప్రాథమిక విచారణ మాత్రమే జరిపామని త్వరలోనే పూర్తిస్థాయి విచారణ చేస్తామన్నారు.

సీపీఐ నాయకుల ధర్నా

శ్రీవర్షిణి ఆత్మహత్యకు ప్రిన్సిపాల్ ఆఫ్రిన్, ఏటీపీ వీణారాణి కారణమని, వారిని సస్పెండ్ చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. పాఠశాల ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. డీఈవో వాసంతితో వాగ్వాదానికి దిగారు. విద్యార్థిని మృతికి కారణమైన ప్రిన్సిపాల్‌ను పక్కకు పెట్టుకుని ఎలా విచారణ జరుపుతారని ప్రశ్నించారు. ప్రిన్సిపాల్, ఏటీపీని సస్పెండ్ చేసి విచారణ జరుపాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆదరి శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యురాలు మంచాల రమాదేవి, మండల కార్యదర్శి ఆదరి రమేష్ తదితరులు పాల్గొన్నారు. సంఘటన స్థలాన్ని ఎల్కతుర్తి సీఐ పులి రమేష్ ఆధ్వర్యంలో వంగర, ముల్కనూర్, ఎల్కతుర్తి ఎస్సైలు దివ్య, రాజు, అకినేపల్లి ప్రవీణ్‌కుమార్ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అలాగే చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

గత ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యం

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గత పాలకుల పాలనలో అభివృద్ధి శూన్యమని, 15ఏళ్లలో జరిగిన నష్టాన్ని పూరించడానికి ప్రభుత్వం వెంటపడి నిధులు తీసుకువస్తున్నానని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ పరిధిలో రోడ్ల వైడనింగ్, అభివృద్ధికి గాను రూ331.80 కోట్లు మంజూరు చేయడంపై సీఎం చిత్రపటానికి కలిసి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని 5566.15 కిలోమీటర్ల ఆర్ అండ్ బీ హ్యామ్ రోడ్ల అభివృద్ధికి రూ 10,547. 38 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. అందులో మొదటి విడతలోనే స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం పరిధిలో 8 రోడ్లు, 91.55 కిలోమీటర్ల అభివృద్ధికి గాను రూ 171.82 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల పరిధిలోని 23 పంచాయతీరాజ్ హ్యామ్ రోడ్లు మొత్తం 141.11 కిలోమీటర్లకు రూ 140 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ట్రైబల్ వెల్ఫేర్ నుంచి నియోజకవర్గంలోని 13 రోడ్లకు రూ 20 కోట్ల నిధులు మంజూరయ్యాయని వెల్లడించారు.

ఇన్ని నిధులు తీసుకువస్తున్న కొందరు పనిలేని పసలేని పనికిరాని వాళ్లు విమర్శలు చేస్తున్నారని, వాళ్ల విమర్శలు పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. కల్వకుంట్ల కుటుంబం తెలంగాణను నాశనం చేసిందని, ముందు వాళ్ల కుటుంబాన్ని చక్కదిద్దుకున్న తరువాత మా పైన విమర్శలు చేయాలని హితవుపలికారు. మంత్రి కొండా సురేఖ సమస్య సమసి పోయిందని, మాట్లాడడానికి ఏమీ లేదన్నారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్ పర్సన్ జూలకుంట్ల లావణ్యా-శిరీష్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థల చైర్మన్ మారుజోడు రాంబాబు, చిలుపూర్ ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, మార్కెట్ వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, పార్టీ మండలాధ్యక్షుడు శిరీష్‌రెడ్డి, నాయకులు రాపోలు మధుసూదన్ రెడ్డి, జగదీష్‌చందర్ రెడ్డి, నాగరబోయిన శ్రీరాములు, అంబటి కిషన్‌రాజు, మంద రాజు, రాజేష్‌నాయక్, తెల్లాకుల రామక్రిష్ణ, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీహరి

తెలంగాణ గొప్ప సృజనకారులకు నిలయం

తెలంగాణ భాష, సాంస్కృతిక విభాగం డైరెక్టర్ నరసింహారెడ్డి

కేయూలో కాళోజీ ఎండోమెంట్ లెక్చర్

కేయూక్యాంపస్ అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గొప్ప సృజనకారులకు నిలయమని తెలంగాణ రాష్ట్ర భాష, సాంస్కృతిక విభాగం డైరెక్టర్ ఎ.నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం కేయూ సెనెట్ హాల్‌లో కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన కాళోజీ నారాయణరావు 9వ ఎండోమెంట్ లెక్చర్ జరిగింది. ఈ సందర్భంగా నరసింహారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై 'సాయుధ పోరాటం-తొలిమలిదశ ఉద్యమాలు కవిత్వం' అనే అంశంపై మాట్లాడారు. వరంగల్ తెలంగాణకు కేంద్రబిందువున్నారు. కాళోజీ స్వేచ్ఛ, ఇచ్ఛలకు ప్రతీక అని చెప్పారు. సంఘర్షణలో నుంచి సృజన సాహిత్యం వస్తుందన్నారు. తెలంగాణలో సాహిత్యం, కళలు అభివృద్ధి చెందాయన్నారు. 2014 తెలంగాణ మలిదశ ఉద్యమంలో కవిత్వం పాత్ర కీలకమన్నారు. సాయుధ పోరాట సమయంలోనూ గొప్ప సాహిత్యం వచ్చిందన్నారు.



మాట్లాడుతున్న డైరెక్టర్ నరసింహారెడ్డి పక్కన వీసీ ప్రతాప్‌రెడ్డి,రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రంలు

వీసీ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువులతోపాటు సాహిత్య అంశాలపై దృష్టి సారించాలని అన్నారు. డాక్టర్ అంపశయ్య నవీన్ మాట్లాడుతూ.. కాళోజీ అందరికి దిక్సూచిగా నిలిచారని అన్నారు. పొట్లపల్లి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం కాళోజీ అని కీర్తించారు. వీఆర్ విద్యార్థి కాళోజీ ఫౌండేషన్ కార్యక్రమాలను వివరించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం స్మారక ఉపన్యాస కర్తను సభకు పరిచయంచేసి కాళోజీ సాహిత్యాన్ని అధ్యయనం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి సంయోజకుడిగా పీఆర్‌ఓ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ వ్యవహరించగా అధ్యాపకులు, స్కాలర్స్, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు. సభ ప్రారంభంలో కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మునిసిపల్ సిబ్బందికి కుచ్చుటోపీ

రూ.1 కోటి పుచ్చుకుని ఐపీ పెట్టిన ఘనుడు

ప్రస్తుతం జీడబ్ల్యూఎంసీలో ప్రైవేట్ జవాన్‌గా విధులు

లబోదిబోమంటున్న బాధితులు.. ఉన్నతాధికారులకు మొర

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 24 (ఆంధ్ర జ్యోతి): రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద మునిసిపల్ కార్మికులు పైసా పైసా కూడగట్టుకుని ఓ వ్యక్తికి డబ్బులు ఇస్తే చివరికి వారికే టోకరా కొట్టాడు. ఇంటికి వచ్చి డబ్బుల కోసం నిలదీయడంతో ఐపీ పెట్టాడు. తన వద్దకు ఎవ్వరు వచ్చినా పోలీసు కేసు పెడతానని బెదిరింపులకు పాల్పడడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. రూ.1కోటి మోసపోయినట్టు మునిసిపల్ అధికారులకు తెలియడంతో అవాక్కయ్యారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..

గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఓ డివిజన్‌లో శానిటరీ విభాగంలో ప్రైవేట్ జవాన్‌గా పనిచేస్తున్న వ్యక్తి.. అదే డివిజన్‌లో పనిచేసే సిబ్బంది, కార్మికులు, పక్క డివిజన్‌లో పని చేసే తోటి జవాన్‌లతో చాలాకాలంగా నమ్మకంగా ఉన్నాడు. అతడికి గతంలో చిట్‌ఫండ్‌లో పనిచేసిన అనుభవం ఉండడంతో తోటి శానిటరీ సిబ్బందిని నమ్మించారు. తాను పెద్దపెద్ద చిట్టీలు వేస్తున్నానని, మీ వద్ద ఉన్న డబ్బులు ఇస్తే నెల తిరగకుండానే మిత్తీతో పాటు పెద్ద మొత్తంలో తిరిగి ఇస్తానని నమ్మించాడు.

దీంతో సుమారు వందకు పైగా శానిటేషన్ అధికారులు, సిబ్బంది, తోటి వైట్‌కాలర్ జవాన్లు, పీహెచ్ వర్కర్లు (శానిటరీ కార్మికులు) ఆ జవాన్‌కు రూ.2కోట్లకు పైగా అప్పగించారు. జీడబ్ల్యూఎంసీ పరిధిలో పనిచేస్తున్న సిబ్బందితో పాటు చుట్టుపక్క ప్రజలు, దగ్గరి స్నేహితుల వద్ద సదరు జవాన్ రూ.2కోట్లకు పైగా తీసుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. హనుమకొండ సమ్మయ్యనగర్‌కు చెందిన ఓ జవాన్ వద్ద రూ.32లక్షలు, లష్కర్ సింగారానికి చెందిన ఓ జవాన్ వద్ద రూ.15లక్షలు, శానిటరీ కార్మికురాలి వద్ద రూ.10 లక్షలు, వరంగల్‌కు చెందిన ఇద్దరు కార్మికుల వద్ద తలా ఐదు లక్షలు.. ఇలా అందినకాడికి దండుకున్నాడు. ఆపై తెలివిగా ఒకరికి తెలియకుండా మరొకరి వద్ద డబ్బులు తీసుకుని వ్యక్తిగత అవసరాలకు వాడుకున్నాడు. గట్టిగా అడిగిన వారిని బెదిరింపులకు పాల్పడుతున్నారు. బాధితులు ఇంటికి రావడం.. కుటుంబ సభ్యులపై ఒత్తిడి తేవడంతో 32 మందికి ఐపీ నోటీసులు జారీ చేసినట్టు తెలిపారు. నోటీసులు అందుకున్న బాధితులు ఎవ్వరికి చెప్పుకోవాలో తెలియక బల్దియా ప్రధాన కార్యాలయానికి వెళ్లి శానిటేషన్ ఉన్నతాధికారుల వద్ద మొరపెట్టుకున్నట్టు తెలిసింది.

ఐపీ పెట్టి మరీ విధులకు హాజరు..

సదరు ప్రైవేట్ జవాన్‌గా విధులకు సైతం హాజరవుతున్నట్టు తెలుస్తోంది. ఉదయం, సాయంత్రం హాజరు తీసుకుని యథేచ్ఛగా తిరుగుతుండడాన్ని బాధితులు జీర్ణించుకోలేకపోతున్నారు. విషయం తెలిసిన శానిటేషన్ ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటామని చెప్పి పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. నోటీసులు అందుకున్న బాధితులు పోలీసు కమిషనర్, మునిసిపల్ కమిషనర్‌లతో పాటు హ్యూమన్‌రైట్స్‌ను ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. దీనిపై శానిటేషన్ ఉన్నతాధికారులను వివరణ కోరగా.. విషయం తమ వద్దకు వచ్చిందని, బాధితులు ఫిర్యాదు చేస్తే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	6905	5300
మక్కలు	1925	1521
కందులు	6122	3022
పెసళ్లు	4122	3022
పల్లికాయ (సూక)	4000	3500
పల్లికాయ (పచ్చిది)	4600	3420
పసుపు (కాడి)	10958	8699
పసుపు (గోల)	10157	8906
తేజ మిర్చి	12000	9500
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	-	-
వండర్‌హాట్ ఏసీ	16100	12000
యూఎస్341ఏసీ	15500	9000
దీపిక	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం



వాహన ప్రదర్శన

నిట్ విద్యార్థులు స్వయంగా డిజైన్ చేసి తయారు చేసిన రెండు వాహనాలు- క్వాడ్ బైక్, ఎఫ్-1 విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వీటిని ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ మాధవీలత స్వయంగా సందర్శించారు. వాటి గురించి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. ఈ వాహనాలు అన్ని అడ్డంకులను అధిగమించి వేగంగా దూసుకుపోతాయి.

సాంకేతికోత్సవం షురూ

- మొదటి రోజు ఆకట్టుకున్న ఈవెంట్లు
- పోటాపోటీగా పాల్గొన్న విద్యార్థులు
- సందడిగా మారిన నిట్ క్యాంపస్
- వినూత్న ఆవిష్కరణలు.. ఆలోచింప చేసే ఎగ్జిబిట్లు
- నిట్ క్యాంపస్‌లో ఆవిష్కృతమైన సాంకేతిక మినీ భారతం

హనుమకొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నిట్‌లో టెక్నోజియాన్-2025 అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. క్యాంపస్‌లోని అంబేద్కర్ లర్నింగ్ సెంటర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ప్రపంచలోనే అత్యంత ఎత్తైన చినాబ్ వంతెన నిర్మాణంలో కీలకపాత్ర పోషించిన బెంగుళూరు ఐఐఎస్‌సీ ప్రొఫెసర్ మాధవీలత ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించగా స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ కె.కిరణ్ కుమార్, స్టూడెంట్ అక్టివిటీ సెంటర్ (ఎస్ఏసీ) ప్రెసిడెంట్ ప్రొఫెసర్ హరిప్రసాద్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ (టెక్నికల్) ప్రొఫెసర్ యు.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నవ ఆవిష్కరణల వేదిక

టెక్నోజియాన్-2025 నూతన సాంకేతిక ఆవిష్కరణలకు వేదికగా నిలిచింది. ఇందులో విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్లు, నిర్వహిస్తున్న వారి యువ మేథోమథనానికి అద్దం పడుతున్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో నూతన ఆవిష్కరణకు స్వాగతం పలుకుతున్నాయి. మొదటి రోజు విద్యార్థి కబ్బుల పక్షాన 23 ఈవెంట్లను, నిట్‌లోని వివిధ టెక్నికల్ సొసైటీల తరుపున 31 ఈవెంట్లను ప్రదర్శించారు. వీటితో పాటు పలు వర్క్‌షాపులు, నిపుణుల ప్రసంగాలు, కొత్తగా ప్రవేశపెట్టిన ఈవెంట్లు విద్యార్థుల సాంకేతిక దృక్పథానికి అద్దం పట్టాయి. ఈవెంట్లను తిలకించేందుకు విద్యార్థులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. నిట్ క్యాంపస్ కోలాహలంగా మారింది. ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం విద్యార్థులంతా ఈవెంట్ల నిర్వహణలో బిజీ అయిపోయారు.

నేటి ఈవెంట్లు

ట్రెకో హంట్, రాకెట్, మర్డర్ మిస్టరీ, డీఆడిట్, ఆప్టీమిస్ట్రీ, నోబగ్స్, లైట్ పెయింటింగ్, మోషన్ కాప్చర్, స్కైస్కాట్, మెక్ కిట్, బ్లేంజ్, ఆఫ్ ట్రాక్ ఆర్సీ, ప్రాజెక్టు ఎక్స్‌పో, మొబైల్ జో, షార్క్, లాంచ్ ప్యాడ్, ఎర్త్, డస్కటిల్ డౌన్, ట్రాక్ ట్రివియా, ఎస్‌డీసీ గేమ్స్, స్వాప్ స్టాప్, బాంబ్స్ అవే, మోడల్ మేనియా, నియాన్ క్రికెట్, స్టాక్ ఫిషర్, గెస్చర్ డ్రిఫ్ట్, ప్రాజెక్ట్ షోకేస్, మెటల్యూజన్.

నియాన్ క్రికెట్



చీకటి గదిలో నియాన్ బ్యాట్లు, బంతులు, స్టంప్‌తో నిర్వహించే నిర్వహించే ఆసక్తికరమైన క్రికెట్ ఈవెంట్ ఇది. గత టెక్నోజియాన్‌లోనూ దీనిని నిర్వహించారు. నియాన్ క్రికెట్ ఆడటానికి విద్యార్థులు ఎక్కువ ఆసక్తి చూపారు.



వీఆర్ స్పేస్ టూర్

టెక్నోజియాన్‌లో మరో హైలైట్ ఈవెంట్ వీఆ ర్ స్పేస్ టూర్. కళ్లజోడులాగా ఉండే ఒక పరికరాన్ని ధరించి అందులో నుంచి త్రీడీ పింటర్ సహాయంతో అంతరిక్షంలోని అద్భు తాలను వీక్షించవచ్చు. అంతేకాకుండా దీని ని ధరించి ఆర్చరీ, ఇతరత్రా గేమ్స్‌ను కూ డా ఆడవచ్చు.

ఇతర ఈవెంట్లు

వీటితోపాటు జాతీయ స్థాయిలో నిర్వహించిన గేమింగ్, కోడింగ్ మారథాన్ అయిన ది బ్లేజ్ ఈవెంట్ పాల్గొనేవారి ప్రోగ్రామింగ్, సమస్య పరిష్కార నైపుణ్యాలను పరీక్షించింది. షార్క్ ట్యాంక్ 2.0 అనే ఈవెంట్ కొత్త ఆవిష్కర్తలు, ఎంట్రప్రెన్యూవర్లు తమ వినూత్న ఆలోచనలను నిపుణుల సమక్షంలో ప్రదర్శించిన పోటీ. రాకెట్ డిజైన్ అండ్ లాంచ్ (లాంచ్ ప్యాడ్) ఈవెంట్ ద్వారా విద్యార్థులు రూపొందించిన మోడల్ రాకెట్లను విజయవంతంగా ప్రయోగించి, వైమానిక గుణకాలు, ప్రొపల్షన్ సూత్రాలను ప్రదర్శించింది. స్వాప్ స్టాఫ్ అనే ఈవెంట్ సృజనాత్మకత, ఫుడ్ సైన్స్ కలయికతో ఐస్ క్రీమ్ తాయారీ పోటీ విద్యార్థుల్లో ఉత్సాహాన్ని రేపింది. మెటల్యూషన్, భూకంప నిరోధక భవన రూపల్పన, కౌన్ బనేగా సివిల్ ఇంజనీర్, జెశ్చర్ డ్రిఫ్ట్ కార్ రేస్, కోడ్ రెడ్, మ్యూటాడార్ట్ మెకానికల్ కిట్ అసెంబ్లీ తదితర ఈవెంట్లు టెక్నోజియాన్‌లో హైలైట్‌గా నిలిచాయి.

ఈ సారి టెక్నోజియాన్‌లో బాంబ్ అవే ఎగ్జిబిట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో నిట్ విద్యార్థులు కేవలం రెండు రోజుల వ్యవధిలో దీనిని రూపొందించారు. రిమోట్‌తో ఎగిరే ఈ విమానం నుంచి నిర్దేశిత లక్షిత ప్రదేశంలో గురి తప్పకుండా బాంబులు వేయగలుగుతుంది. క్యాంపస్‌లో దీనిని ప్రయోగాత్మకంగా ప్రదర్శించి చూపారు. విద్యార్థులను ఇది విశేషంగా ఆకట్టుకున్నది.



బాంబ్ అవే..

కార్ రేస్ ఈవెంట్

ఈ ఈవెంట్‌లో విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో పాల్గొంటున్నారు. ఒక రూట్‌ను ఏర్పాటు చేసి వీటి మధ్యలో నుంచి రోబోరేస్ కార్లను రిమోట్ కంట్రోల్ సహాయంతో నడపాలి. రూట్‌లో నిర్ణీత మార్గంలో ప్రయాణించి గమ్యాన్ని చేరుకోవాలి. మధ్యలో ఎత్తుపల్లాలను చాకచక్యంగా అధిగమించాలి.



గ్రీటింగ్ రోబో

టెక్నోజియాన్‌లో విశేషంగా ఆకట్టుకుంటు న్న మరో ఎగ్జిబిట్ గ్రీటింగ్ రోబో. ఎవరైనా దీని దగ్గరికి వెళితే హాయ్.. అంటూ పలకరిస్తుంది. చేతిలో ట్రేతో ముందుకు, వెనకకు కదులుతూ ఉంటుంది. దీనిని సాధారణంగా ఆయా వేడుకల్లో అతిథు లను స్వాగతించేందుకు ఉపయోగించేలా రుద్రాక్షి అనే మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థిని రూపొందించారు.



లైడిటెక్టర్

లైడిటెక్టర్ ఈవెంట్ కూడా టెక్నోజియాన్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ ఈవెంట్‌లో పాల్గొనడానికి విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఆసక్తి చూపారు. చర్మప్రతి స్పందన (స్వేదం) ఆధారంగా సమాధానాల నిజాయితీని కొలిచే వినూత్న సాంకేతిక ఆవిష్కరణ.



హద్దులను చెరిపేసుకో..

- అపజయాలకు వెరవకు.. విజయం కోసం శ్రమించు..
- గుర్తింపు కోసం వెంపర్లాడకు.. మన శ్రమే గుర్తింపునిస్తుంది..
- చినాబ్ బ్రిడ్జి ఫేమ్ ప్రొఫెసర్ మాధవీలత
- నిట్ టెక్నోజియాన్ కార్యక్రమంలో ప్రసంగం



టెక్నోజియాన్ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ మాధవీలత

హనుమకొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మన జీవితం.. మన వ్యక్తిత్వం విశాలం కావాలంటే మన చుట్టూ ఉన్న హద్దులను చెరిపేసుకోవాలని, అదే సమయంలో మన పరిమితులేమిటో కూడా గుర్తెరగాలని ప్రపంచంలో కెల్లా అత్యంత ఎత్తైన వంతెన నిర్మాణంలో క్రియాశీల భూమిక పోషించిన బెంగళూరు ఐఐఎస్‌సీ ప్రొఫెసర్ జి. మాధవీలత పిలుపునిచ్చారు. శుక్రవారం వరంగల్ నిట్‌లో టెక్నోజియాన్-2025 ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి సాంకేతికోత్సవాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ప్రొఫెసర్ మాధవీలత మాట్లాడుతూ.. జీవితంలో ఉన్నంతంగా రాణించాలని అందరూ అనుకుంటారని, కానీ తమ చుట్టూ ఉన్న అడ్డంకులను చూసి కుంగిపోతారని అన్నారు. నిర్ణీత లక్ష్యసాధన దిశగా ముందడుగు వేయాలంటే ముందు ఆ అడ్డంకులను ఛేదించుకొని తమను తాము విస్తరించుకోవాలని అన్నారు. అదే సమయంలో మన పరిమితులు ఏమిటో తెలుసుకోవాలన్నారు. అపజయాలకు ఎవరూ వెరవద్దన్నారు. జీవితంలో ప్రతీఒక్కరు ఎప్పుడో ఏదో ఒక సందర్భంలో ఫెయిల్ అవుతుంటారని, అంత మాత్రాన భయపడి పోయి వెనకడుగు వేస్తే ఏదీ సాధించలేమన్నారు. అపజయం వెంట విజయం ఎప్పుడూ ఉంటుందని, మనం చేయాల్సిందల్లా దాని వెంట పరుగు తీయడమేనన్నారు. గుర్తింపు కోసం వెంటపర్లాడరాదన్నారు. ఐడెంటిటీ క్రైసిస్ వల్ల జీవితంలో మనం అనుకున్నది సాధించలేమన్నారు. ఎవరూ మిమ్మల్ని గుర్తించకపోయినా చేయాల్సిన పనిచేసుకుంటూ పోతే గుర్తింపు తప్పనిసరిగా లభిస్తుందన్నారు. ఇందుకు తానే ప్రత్యక్ష ఉదాహరణగా పేర్కొన్నారు. వరంగల్ ఆర్ఈసీలో (ప్రస్తుతం నిట్) చదువుకున్న తాను.. గుర్తింపు కోసం ఏనాడు పాకులాడలేదన్నారు. చెనాబ్ వంతెన నిర్మాణం పూర్తయిన తర్వాత అందులో తన పాత్రేమిటో తెలిసిన తర్వాత అందరూ తనను ప్రత్యేకంగా గుర్తించడం మొదలు పెట్టారన్నారు. తాను ఎంటెక్ చదివిన వరంగల్ నిట్‌ను సైతం ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నారని అన్నారు. తాము ఎక్కడ చదువుకున్నా, ఎక్కడ ఉద్యోగం చేసినా నిజాయితీగా మన ధర్మాన్ని నెరవేర్చినప్పుడు గుర్తింపు దానంతట అదే వస్తుందన్నారు. వరంగల్ నిట్‌లో చదువుకున్నప్పటికీ పూర్వవిద్యార్థిగా ఇప్పటివరకు పేరు నమోదు చేసుకోలేదని, చెనాబ్ వంతెన నిర్మాణం తర్వాత కళాశాల యాజమాన్యం పలు మార్లు అలుమ్నీగా రిజిస్టర్ కావలసిందిగా కోరిందన్నారు. అలుమ్ని అవార్డును కూడా ప్రదానం చేయనున్నట్టు ప్రకటించిందన్నారు. వరంగల్ నిట్ ఒక అద్భుతమైన విద్యా కేంద్రంగా మాధవీలత అభివర్ణించారు. తాను ఎంటెక్ విద్యార్థిగా ఉన్నప్పుడు తన పురోగతికి సహకరించిన ఆనాటి అధ్యాపకులందరినీ పేరు పేరునా గుర్తుకు తెచ్చుకున్నారు. నాడు వారు అందించిన జ్ఞానం, జీవితం పట్ల కల్పించిన దృక్పథం తన ఉన్నతికి ఎంతో దోహదం చేసిందన్నారు. వరంగల్ నిట్ తనకు జీవితంతో పాటు జీవిత భాగస్వామిని కూడా ఇచ్చిందని ధన్యవాదాలు తెలిపారు. తన భర్త ఇదే కళాశాలలో ఎంటెక్ (మెకానికల్) చేశాడని, ప్రస్తుతం గూగుల్‌లో కీలక పదవిలో ఉన్నారన్నారు.

వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి మాట్లాడుతూ.. టెక్నోజియాన్ విద్యారుల నవ ఆవిష్కరణల సమాహారం అన్నారు. సృజనాత్మకతకు వేదికగా అభివర్ణించారు. ఆలోచనలు పరస్పర పంచుకోవడం ద్వారా శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎన్నో అద్భుతాలను సాధించవచ్చునన్నారు. అందుకు టెక్నోజియాన్ వంటివి ఎంతో దోహదపడుతాయన్నారు. సాంకేతిక ప్రధాన కార్యదర్శి డాక్టర్ యు.వెంకన్న టెక్నోజియాన్ ఉద్దేశ్యాన్ని వివరించారు. సృజనాత్మకత, సహకారం, సాంకేతిక ప్రతిభను పెంపొందించడం, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, ఉమెన్ ఇన్‌టెక్ ఫోరం, జాతీయస్థాయి బ్లేజ్ గేమింగ్ అండ్ కోడింగ్ మారథాన్ వంటి ఈవెంట్లు విద్యార్థులు మేధాశక్తికి మరింత పదును పెడతాయన్నారు. స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ డాక్టర్ కె.కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. 2006లో ప్రారంభమైన టెక్నోజియాన్.. ప్రస్తుతం దేశంలోని అతిపెద్ద సాంకేతికోత్సవాల్లో ఒకటిగా ఎదిగిందన్నారు. ఈ ఏడు సుమారు 7వేల మంది విద్యార్థులు, వివిధ విద్యాసంస్థల నుంచి మరో వెయ్యి పాల్గొంటున్న ఈ టెక్నోజియాన్ జాతీయ స్థాయిలో తన ప్రభావాన్ని మరింతగా ప్రతిబింబిస్తోందన్నారు. ఫ్యాకల్టీ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ పి.రాధాక్రిష్ణ టెక్నోజియాన్ బృందం చూపిన నిబద్ధతను ప్రశంసించారు. తొలుత టెక్నోజియాన్-2025 అధికారిక వీడియోను, గత ఎడిషన్ల ముఖ్య ఘట్టాలను ప్రదర్శించారు.



టెక్నోజియాన్ ప్రారంభ కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

చినాబ్ వంతెన ఓ అద్భుతం

అనంతరం ప్రపంచంలోనే ఎత్తైన చినాబ్ రైల్వే వంతెనపై ప్రొఫెసర్ జి.మాధవీలత వైజ్ఞానిక ప్రసంగం చేశారు. ఈ వంతెన నిర్మాణంలో తన 17 ఏళ్ల అనుభవాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. చినాబ్ వంతెన, రూపకల్పన, నిర్మాణం గురించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. 359 మీటర్ల ఎత్తులో చెనాబ్ నదిపైన నిర్మించడంతో జమ్ముకశ్మీర్ ప్రాంతం ఆర్థికంగా, సామాజికంగా ఎంతో అభివృద్ధిని సాధించిందన్నారు వంతెన నిర్మాణంలో ఎదురైన సవాళ్లను వివరించారు. చెనాబ్ నిర్మాణం సందర్భంగా ఇంజనీరింగ్ దృఢత్వం, సృజనాత్మకత, సంక్లిష్టసమస్యల పరిష్కారం, సమన్వయం ప్రాముఖ్యతను వివరించారు. రూపకల్పనలో కచ్చితత్వం, స్థలస్థాయి నిర్ణయాలు, బృంధ సమన్వయం- ఈమూడు అంశాల కలయికతోనే ఈ మహా ప్రాజెక్టు విజయవంతమైందని ప్రొఫెసర్ మాధవీలత పేర్కొన్నారు.

విద్య కాషాయీకరణ విధానాలను అడ్డుకోవాలి



మహాసభలో మాట్లాడుతున్న అప్పారావు

- పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు నున్నా అప్పారావు
- కేయూలో పీడీఎస్‌యూ జిల్లా మొదటి మహాసభ

కేయూక్యాంపస్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): దేశంలో బీజేపీ విద్య కాషాయీకరణ విధానాలను అడ్డుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు నున్నా అప్పారావు పిలుపునిచ్చారు. శుక్రవారం కేయూ ఫార్మసీ కళాశాల సెమినార్ హాల్‌లో పీడీఎస్‌యూ జిల్లా మొదటి మహాసభ జరిగింది. ఈ సందర్భంగా నున్నా అప్పారావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజల్లో ఐక్యతను దెబ్బతీస్తూ దుర్మార్గపు రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. ప్రపంచం శాస్త్ర, సాంకేతిక రంగంల్లో ముందుంటే మన దేశం కులమత విద్వేషాలతో రగులుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో నిరుద్యోగ సమస్య పెరుగుతోందన్నారు. ఏటేటా లక్ష ఉద్యోగాల హామీ నేరవేరడం లేదని ధ్వజమెత్తారు. మత, కుల రాజకీయాలను అడ్డుకుని తిప్పికొట్టాలని అన్నారు.

పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యారంగ అభివృద్ధి ఎజెండాతో రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్.. సమస్యల పరిష్కారంలో విఫలమైందని విమర్శించారు. స్కాలర్‌షిష్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించకుండా విద్యార్థులతో చెలగాటం ఆడుతోందన్నారు. ప్రైవేట్ సంస్థలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ వర్సిటీలను నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. వర్సిటీల్లో ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యవర్గాన్ని ఎంపిక చేసి ప్రకటించారు. అధ్యక్షుడిగా వంశీకృష్ణ, ఉపాధ్యక్షుడిగా ఆదర్శ్, ప్రధాన కార్యదర్శిగా రాచకొండ రంజిత్, సహాయ కార్యదర్శులుగా భిక్షిత్‌రెడ్డి, డ్యానియల్, కోశాధికారిగా ముషారఫ్, సభ్యులుగా ఆదిత్య, ఈశ్వర్, సాయి, యుగేందర్, పృథ్వీలను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్రనేత సుత్రాపు అనిల్, కీర్తి, సాయి, మానస, ఆదిత్య, రఘురాం, రఘువరన్, శివసాయి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అందే వరకు పోరాటం



టీఆర్పీ ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజినీకుమార్ యాదవ్ తదితరులు

- టీఆర్పీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రజినీకుమార్ యాదవ్

హనుమకొండ టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు అన్ని రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు అందే వరకు పోరాటం చేస్తామని టీఆర్‌పీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజినీకుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం హనుమకొండలో శారద ఫంక్షన్ హాల్‌లో టీఆర్‌పీ జిల్లా నియోజక వర్గ కన్వీనర్లు, కో కన్వీనర్లు నియామకంపై టీఆర్‌పీ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రజినీకుమార్ యాదవ్ మాట్లాడారు.

రాబోయే వంద రోజుల్లో బహుజనుల ఢంకా తెలంగాణ అంతటా మోగిపోతుందని అన్నారు. బహుజన రాజ్యమే టీఆర్‌పీ సంకల్పమని అన్నారు. మేమెంతో మాకంత.. నినాదంతోనే టీఆర్‌పీ పార్టీ ఏర్పడిందన్నారు. తీన్మార్ మల్లన్న నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు.

రాష్ట్ర కార్యదర్శి పల్లెబోయిన అశోక్ ముదిరాజ్ మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో టీఆర్‌పీ జెండా గద్దె నిర్మించి జెండా ఎగురవేసి బహుజన ఉద్యమాన్ని గ్రామస్థాయికి తీసుకెళ్తామని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జనగామ, భూపాలపల్లి, ములుగు జిల్లాల నియోజకవర్గ కన్వీనర్లు నియామకం కోసం ముఖ్య నాయకులతో చర్చ జరిగినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌతం రవి పటేల్, ఇనుకాల ప్రణయ్, సామల చంద్రశేఖర్, పిట్టల వెంకటేశ్, జినుకు శ్రీనివాస్, సామల శ్రీలత, బత్తిని వెంకటేశ్ గౌడ్, మాదం నరేష్ యాదవ్, గండి వెంకటేశ్వర్ గౌడ్, పూజారి సత్యనారాయణ, గుగ్గిరాజు సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

ఊకల్ గుడిలో నాగుల చవితికి ఏర్పాట్లు

గీసుగొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గీసుగొండ మండలంలోని ఊకల్‌లో గల ప్రసిద్ధ నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో శనివారం అత్యంత వైభవంగా నిర్వహించే నాగుల చవితి వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇక్కడ ఏటా నాగుల చవితి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఎంతో మహిమాన్వితత్వం ఇక్కడి నాగేంద్రుడిని దర్శించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. పుట్టలో పాలు పోసి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. అంతేకాకుండా స్వామి దీక్షలు చేపట్టిన స్వాములు నాగబంధ కావడులతో ఊరేగింపుగా తరలివచ్చి మాల విరమణలు చేస్తారు. దీంతో ఆలయం భక్తుల సందడిగా మారుతుంది. కాగా, భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లను చేసినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు సముద్రాల సుదర్శనాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ రాజేశ్వర్‌రావులు తెలిపారు.



బంతి పూల అలంకరణలో నాగేంద్రుడు (ఫైల్)

పత్తికి విపత్తు



నారాయణతండాలో ఎర్రబడిన పత్తి పంట

- పెట్టుబడులు రాక రైతులు దిగాలు
- వరుసగా కురిసిన వర్షాలతో దెబ్బతిన్న పంటలు
- ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులు మొగ్గు

దుగ్గొండి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వానకాలంలో వరసగా వర్షాలు కురియగా రైతులు సాగు చేసిన పత్తి పంటతో తీవ్రంగా నష్టపోయారు. తెగుళ్ల దాడి, భారీ వర్షాలు వారిని కోలుకోకుండా చేశాయి. వానలు వరసగా కురియగా పత్తి పంట ఎర్రబడి పెరుగుదల లోపించి, పంట దిగుబడి తగ్గింది. ఎకరం సాగు చేస్తే 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని ఆశపడిన రైతులకు 4 క్వింటాళ్ల దిగుబడి రాని పరస్థితి ఏర్పడింది.

డివిజన్‌లో 58,612 ఎకరాల పత్తి పంట సాగు

నర్సంపేట డివిజన్‌లో 58,612 ఎకరాలలో పత్తి పంటను రైతులు సాగు చేశారు. చెన్నారావుపేట మండలంలో 10,618, ఖానాపురంలో 8,113, దుగ్గొండిలో 12,639, నల్లబెల్లిలో 11,457 ఎకరాలు, నెక్కొండలో 13,137 ఎకరాలు,నర్సంపేటలో 8,138 ఎకరాలు పత్తి పంటను రైతులు సాగు చేశారు. డివిజన్‌లో సాగు చేసిన పంటకు 4,68,898 క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని ఆశించినా, అందులో సగం దిగుబడి రాని పరస్థితి ఉంది. రైతులు గత్యంతరం లేక పత్తి పంటను తొలగించి దాని స్థానంలో ఇతర పంటల సాగుకు రైతులు మొగ్గుచూపుతున్నారు.

వరసగా వానలు, తెగుళ్ల దాడి

జూలై నెలలో సాగు చేసిన నెల రోజుల తర్వాత నుంచి వరసగా వానలు కురియగా, ఆగస్టు, అక్టోబరు నెలలలో వరసగా భారీ వర్షాలు పడడంతో పంట ఎదుగుదల లేకపోవడంతో పాటు పంట ఎర్రబడి పోవడం, వివిధ రకాల తెగుళ్లు సోకడంతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మొదటి పంట ఏరగానే పత్తి పంట ఎర్రబడిపోయింది. గతంలో పత్తి పంటను నాలుగు ధపాలుగా ఏరేవారు. ఇపుడు ఒక్కసారి ఏరుతూనే పంట ఎర్రబడిపోతుంది. దీంతో రైతులు సాగు చేసిన పత్తి పంటను తొలగించి ప్రత్యామ్నాయ పంటల సాగుకు ఇష్టపడుతున్నారు.. పత్తి పంట సాగు చేసిన భూమిలో మొక్కజొన్న, వేరుశనగ సాగు చేయడానికి రైతులు ముందుకు వస్తున్నారు.

పంటకు గిట్టుబాటు ధర లేక..

పండిన కొద్దిపాటి పత్తిపంటకు సరైన ధరలేక పోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. పత్తి పంటకు క్వింటాల్‌కు రూ:14 వేలు గతంలో ధర పలికింది. తర్వాత రూ:10 వేలు ధర పలికింది. సీసీఐ ధర రూ:8110 నిర్ణయించగా నేడు మార్కెట్లో రూ:7000 వరకు ఉంది. నాణ్యత పేరుతో రూ: 6600 మాత్రమే ధర పలుకుతుంది. సాగు చేసిన పంటకు పెట్టుబడి సైతం రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్త పరుస్తున్నారు.

అధిక వర్షాలతో పంట దిగుబడి తగ్గింది

పాలడుగుల చంద్రమౌళి, రైతు, తిమ్మంపేట



గత ఏడాది తెగుళ్లు, అధిక వర్షాలతో పంటలు, పత్తి పంట దెబ్బతిని నష్ట పోగా ఈ ఏడాది కూడా భారీ వర్షాలతో పత్తి పంట నష్టపోయాం ఆగస్టు, అక్టోబరు నెలలలో వరసగా వానలు పడడంతో సాగు చేసిన 4 ఎకరాలలో పత్తి పంట దెబ్బతింది. కొద్ది పాటి పంట రాగ దానిని మొదటి సారి ఏరగానే పంట ఎర్రబడింది. ఎకరానికి రూ:20 నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టగా, ఎకరానికి 2 క్వింటాళ్ల దిగుబడి రాని పరిస్థితి ఏర్పడింది. రెండు నెలల ముందుగానే పత్తి పంటను తొలగించి ప్రత్యామ్నాయ పంట సాగుకు సిద్ధమవుతున్నాం.

వరుసగా కురిసిన వర్షాలతో పత్తి పంటకు నష్టం

నరహరి కృష్ణారెడ్డి, రైతు తిమ్మంపేట



ప్రకృతి వైపరీత్యాల కారణంగా వరసగా కురిసిన వర్షాలతో మూడు ఎకరాలు సాగు చేయగా పత్తి పంట దెబ్బతిని దిగుబడి రాలేదు. పంట ఎదుగుదల లేక పోవడంతో పాటు పంట ఎర్రబడింది. పండిన పంటను కూలీలను పెట్టి ఎర్రగా విచ్చిన దిగుబడి పెట్టుబడులు రాక , కూలీల కూలీ రేటు రాని పరస్థితి ఉంది. సుమారుగా రూ:60 వేలు పెట్టుబడి పెట్టగా రూ:20 వేలు కూడ రాని పరస్థితి ఉంది. ఎకరం పంటకు 3 క్వింటాళ్లు రాని దుస్థితి ఏర్పడింది. రైతుకు మిగిలింది అప్పు మాత్రమే. పండించిన పంటకు గుట్టుబాటు ధర కల్పించాలి.

రేపు ఉచిత ధ్యాన శిక్షణ శిబిరం

వడ్డేపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ మూమెంట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత ధ్యాన శిక్షణ శిబిరం, అన్నప్రసాద కార్యక్రమాన్ని వరంగల్ ములుగురోడ్‌లోని వాయుపుత్ర పిరమిడ్ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు రవీందర్, గందె కృష్ణ తెలిపారు. ఈ అవకాశాన్ని త్రినగరిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో వాయుపుత్ర పిరమిడ్ సెంటర్ ప్రతినిధులు రామ్మూర్తి, మియాపురం లత, భూక్య పద్మ తదితరులు పాల్గొన్నారు. వివరాలకు సెల్ నంబర్ : 98491 19653 లో సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా నేడు పలు ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. గోపాల్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని జవహర్ కాలనీ, ఎస్‌వీఎస్ హోమ్స్, కొండా మురళి గెస్ట్ హౌస్, ఉషోదయ కాలనీ ఏరియాలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, కడిపికొండ సబ్‌స్టేషన్ పరిధిలోని అమ్మవారిపేట, భట్టుపల్లి, కొత్తపల్లి, సూర్య కుటీర్, ఆర్‌జీకే, బోడగుట్ట, కడిపికొండ, అయోధ్యపూర్ ఏరియాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ తెలిపారు.

అభివృద్ధి నిరంతర ప్రక్రియ

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- రూ.4 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం

వడ్డేపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని, ప్రజలు భాగస్వాములు కావాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండ 57, 59 డివిజన్లలో రూ. 4 కోట్ల అభివృద్ధి పనులకు వరంగల్ మేయర్ గుండు సుధారాణితో కలిసి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో రాజకీయాలకు అతీతంగా అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. సంక్షేమ పథకాలు కేవలం కాంగ్రెస్ ప్రభుత్వానికే సాధ్యమని పేర్కొన్నారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. వరంగల్ నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నో పథకాలను రూపొందించి అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 57, 59 డివిజన్ల కార్పొ రేటర్లు నల్ల స్వరూపరాణి - సుధాకర్‌రెడ్డి, గుజ్జుల వసంత-మహేందర్‌రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ-సంపత్ యాదవ్, ఫిషర్‌మెన్ కాంగ్రెస్ స్టేట్ డైరెక్టర్ మండల సమ్మయ్య, 59 డివిజన్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేతిడి దీపక్‌రెడ్డి, 57, 59 డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బంక సతీష్ యాదవ్, పూరేళ్ల రవికిరణ్, డివిజన్ మహిళా అధ్యక్షురాలు తేళ్ల సుగుణ కిశోర్, అశోక కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మందల కృష్ణారెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు జనగాం శ్రీనివాస్‌గౌడ్, తాళ్లపెల్లి రవీందర్ (జేకే), జి. ప్రకాష్‌రావు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న రాజేందర్‌రెడ్డి, సుధారాణి తదితరులు



రిజిస్ట్రార్ రామచంద్రానికి వినతి పత్రం ఇస్తున్న స్టూడెంట్స్

ఫార్మసీలో డిటెన్షన్ విధానాన్ని ఎత్తివేయాలి

కేయూక్యాంపస్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కేయూ పరిధిలో ఫార్మసీ విద్యార్థులకు డిటెన్షన్ విధానాన్ని ఎత్తివేయాలని పీడీఎస్‌యూ, కేయూ ఫార్మసీ విద్యార్థులు డిమాండ్‌చేశారు.ఈ మేరకు శుక్రవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంను తన చాంబర్‌లో కలిసి ఫార్మసీ విద్యార్థులకు డిటెన్షన్ ఎత్తివేయాలని కోరుతూ వినతి పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షకార్యదర్శులు వంశీకృష్ణ, రాచకొండ రంజిత్‌లు మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా వర్సిటీలో ఫార్మసీ విద్యార్థులకు డిటెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టడంతో ఒక్క సబ్జెక్టు ఫెయిలైనా మళ్లీ అదే క్లాస్ చదవాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. వర్సిటీ పరిధిలోని చాలా కళాశాలల్లో ఫార్మసీ అధ్యాపకులు లేరని, ల్యాబ్‌లతో పాటు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని ఆరోపించారు. విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా ఫార్మసీ విద్యార్థులకు డిటెన్షన్ ఎత్తివేయాలని లేకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కీర్తి, సాయి, మానస, ఆదిత్య, రఘురాం, శివ, సాయి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 21 మందికి జరిమానా

వరంగల్ క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ 22 మందిని శుక్రవారం కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి ఎ.వేణుగోపాల్ గుండ్లసింగారానికి చెందిన గుగులోతు రాజుకు రెండురోజుల జైలు శిక్ష విధించగా, మిగతా 21 మంది వాహనదారులకు రూ.21,400 జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.సీతారెడ్డి తెలిపారు. అదే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ 9 మందిని కోర్టులో హాజరుపరచగా రూ.6,000 జరిమానా విధించారన్నారు.

కేయూలో ఎంఈడీ విద్యార్థుల ఆందోళన



కేయూ పరిపాలన భవనం వద్ద ఆందోళన చేస్తున్న ఎంఈడీ విద్యార్థులు

కేయూ క్యాంపస్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కేయూ క్యాంపస్ కళాశాల ఎంఈడీ విద్యార్థులు శుక్రవారం కేయూ పరిపాలన భవనం ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. తమకు హాస్టల్ వసతి కల్పించాలని నినాదాలు చేశారు. కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంను కలిసి తమ సమస్యలను విన్నవించారు. తమకు హాస్టల్స్ వసతి కల్పించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ నిరసనలో ఎంఈడీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విశ్వ బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేయాలి

వడ్డేపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విశ్వ బ్రాహ్మణుల సంక్షేమం కోసం ప్రత్యేక పథకాలు అమలు చేసి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని తెలంగాణ జయశంకర్ సేవా సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి ఓదెల సత్యనారాయణ కోరారు. శుక్రవారం విజయవాడ గొల్లపుడిలోని బీసీ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ అభివృద్ధి సంస్థ చైర్ పర్సన్ కమ్మరి పార్వతమ్మను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.



కమ్మరి పార్వతమ్మకు పూల మొక్కను ఇస్తున్న సత్యనారాయణ

కాంగ్రెస్ అధ్యక్ష పీఠం పద్మకే ఇవ్వాలి

ఖిలావరంగల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో అనేక సంవత్సరాలుగా సేవలందిస్తున్న కార్పొ రేటర్ పోశాల పద్మకు వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి ఇవ్వాలని గౌడ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గట్టు రమేష్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం 18వ, డివిజన్ లేబర్‌కాలనీలో ఆయన మాట్లాడారు. గౌడ సామాజిక వర్గానికి చెందిన పోశాల పద్మ 25 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారని, గతంలో రెండుసార్లు కార్పొరేటర్‌గా ఓడిపోయినా చలించకుండా మూడోసారి గెలిచారన్నారు. ప్రస్తుతం 41వ, డివిజన్ కార్పొరేటర్‌గా పనిచేస్తున్నారన్నారు. వరంగల్ జిల్లాలో గౌడ సామాజిక వర్గం ఎక్కువ ఉన్నందున రాజకీయాల్లో 25 సంవత్సరాల అనుభవం ఉన్న పోశాల పద్మకు డీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వడం సముచితమన్నారు. గౌడ సంఘం నాయకులు కక్కెర్ల శ్రీనివాస్, కొయ్యడ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గట్టు రమేష్ గౌడ్

కాకతీయ యూనివర్సిటీలో క్రీడా పోటీలు

కేయూక్యాంపస్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కేయూ ఇంటర్ వర్సిటీ పురుషుల క్రీడాపోటీలు శుక్రవారం కేయూ క్రీడామైదానంలో ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. పోటీలను కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభి మాట్లాడారు. క్రీడల అభివృద్ధికి తోడుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మనోహర్, సెక్రటరీ వెంకయ్య, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ పలు ప్రతిపాదనలు వీసీ ముందుంచారు. దీనికి సానుకూలంగా వీసీ స్పందించినట్లు బాధ్యులు తెలిపారు.



క్రీడా పోటీల్లో మాట్లాడుతున్న కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూలో ఆధునీకరణ పనుల ప్రారంభం

కాకతీయ యూనివర్సిటీలో శుక్రవారం నూతనంగా ఏర్పాటు చేసిన కిచెన్, సెమినార్ హాల్‌లను కేయూ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. రూ.40 లక్షల వ్యయంతో న్యూపీజీ హాస్టల్‌లో కొత్త కిచెన్ రూం, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో రూ.13లక్షల వ్యయంతో సెమినార్ హాల్ ఆధునీకరణ పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, డైరెక్టర్ డాక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, విభాగాధిపతి డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు, పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్, బి.సురేశ్ లాల్, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దడువాయి నూతన కమిటీ

ప్రమాణ స్వీకారం

వరంగల్ వ్యవసాయం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ దడువాయి యూనియన్‌కు ఇటీవల ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు శుక్రవారం ఎన్నికల అధికారి నిమ్మాని నాంపెల్లి ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం చేశారు. వారిలో యూనియన్ అధ్యక్షుడు మార్త శ్యాం సుందర్, ఉపాధ్యక్షులు పార్సి కృష్ణ, ప్రధాన కార్యదర్శి అప్పని కృష్ణ, సహాయ కార్యదర్శి ఆకుతోట సంతోష్, కోశాధికారి సోల రవి ఉన్నారు. ఈ కార్యక్రమంలో తొగరు రవీందర్, తూర్పాటి రమేష్, శ్రీరాముల సదానందం, అనుమాండ్ల రాజు, జక్కుల సంపత్, మంగిశెట్టి కృష్ణమూర్తి, దుబాసి రాజు, శనిగరం వినోద్ పాల్గొన్నారు.

కంది సాగు విస్తీర్ణం పెంచాలి

సహ పరిశోధన సంచాలకుడు ఆర్. ఉమారెడ్డి

వరంగల్ వ్యవసాయం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో కంది సాగును గణనీయంగా పెంచాల్సిన అవసరముందని ప్రాంతీయ పరిశోధన స్థానం వరంగల్ సహ పరిశోధన సంచాలకుడు ఆర్.ఉమారెడ్డి అన్నారు. వివిధ మండలాల నుంచి వచ్చిన రైతులకు కంది పంటలో సాగు గురించి వరంగల్ వ్యవసాయ పరిశోధన స్థానంలో శుక్రవారం ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉమారెడ్డి హాజరై మాట్లాడుతూ.. యాజమాన్య పద్ధతులు పాటించడం, లింగాకర్ష బుట్టలు అమర్చుకోవడం వల్ల చీడ పురుగులను నివారించవచ్చన్నారు. అనంతరం అపరాల విభాగం అధిపతి ఎ.వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. కంది పంట మొగ్గ దశ నుంచి పూత దశలో మేలైన సస్య సంరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ మధు, గోనియా నాయక్, జి.పద్మజ, ఎస్. ఓం ప్రకాష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇ. నర్సింహారెడ్డి

బకాయిలను వెంటనే చెల్లించాలి

వడ్డేపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఉద్యోగుల రిటైర్మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఇ.నర్సింహారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ సర్క్యూట్ గెస్ట్ హౌస్ రోడ్డులోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం హనుమకొండ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 మార్చి నుంచి సెప్టెంబరు వరకు ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం 18 నెలల కాలం గడిచినప్పటికీ పెన్షన్ తప్ప ఎలాంటి ప్రయోజనాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపి రిటైర్డ్ ఉద్యోగులకు రావల్సిన బెనిఫిట్స్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఎస్‌జీపీఏటీ ఆధ్వర్యంలో ఈ నెల 27న అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహించే ధర్నాలో పెన్షనర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర నేత జి. వీరస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి సమ్మారెడ్డి, సంస్థ ప్రతినిధులు ఆగయ్య, శ్యాంసుందర్‌రెడ్డి, కందుకూరి దేవదాసు, ఎల్. ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, బిల్ల సుబ్బారావు, తిరుపతి రెడ్డి, రత్నాకర్, సూర్యప్రకాష్, సుగుణాకర్‌రెడ్డి, సత్యనారాయణ, రవీందర్, రాజన్న, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్జీనియా జీఎంయూ వర్సిటీతో కేయూ ఎంఓయూ చర్చలు

కేయూ క్యాంపస్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వర్జీనియా ఫెయిర్‌ఫాక్స్ జార్జ్ మాసన్ విశ్వవిద్యాలయం (జీఎంయూ), వరంగల్ కాకతీయ యూనివర్సిటీల మధ్య విద్యార్థి, అధ్యాపక పరిశోధన మార్పిడి కార్యక్రమాల కోసం అవగాహన ఒప్పందం (ఎంఓయూ)కు విస్తృత చర్చలు జరిగాయి. ఈ మేరకు శుక్రవారం కేయూ పరిపాలన భవనంలో వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డితో జీఎంయూ బృందం బాధ్యులు డాక్టర్ కమ్మీ సంఫేరా, రాబర్ట్ పెటిట్‌ల బృందం ప్రత్యేక భేటీ అయ్యారు. జీఎంయూ, కేయూల మధ్య పరస్పర సహకారానికి పునాది వేయడానికి ప్రారంభదశలో విద్యా పాఠ్యాంశాలను పంచుకునేందుకు అంగీకరించాయి. సమావేశంలో సానుకూల వాతావరణంలో జరిగింది. కాగా, సమావేశానికి వాషింగ్టన్ డీసీ, యూఎస్ ఇండియా సాలిడారిటీ మిషన్ వ్యవస్థాపక చైర్మన్ పులి రవి చొరవ చూపారు. ఎంవోయూ చర్చల్లో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం, వర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, ప్రొఫెసర్ ఎం.సదానందం, డాక్టర్ బి.రమ, డాక్టర్ బి.రమేశ్, డాక్టర్ రమణ, భిక్షాలున్నారు.

అప్రమత్తత ద్వారానే నేరాల నియంత్రణ

వరంగల్ షీటీమ్ ఇన్‌స్పెక్టర్ కె. సుజాత

వరంగల్ క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అప్రమత్తంగా ఉండటం ద్వారానే మహిళలపై జరుగుతున్న నేరాలను నియంత్రించవచ్చని వరంగల్ షీటీం ఇన్‌స్పెక్టర్ కె.సుజాత అన్నారు. వరంగల్‌లోని ధ్రువ జూనియర్ కళాశాలలో షీటీం ఆధ్వర్యంలో మహిళల భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సుజాత మాట్లాడుతూ.. మహిళలపై జరిగే అఘాయిత్యాలు, అత్యాచారాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. అమ్మాయిలు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్, టెలిగ్రామ్ లాంటి సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలు, వివరాలు పంచుకోవడంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. తెలియని ప్రాంతాలకు ప్రయాణాలు చేస్తే టీ-సేఫ్ యాప్‌ను ఉపయోగించాలన్నారు. సదరు యాప్‌పై ముందుగానే అవగహన కలిగి ఉండాలన్నారు. మహిళలు తాము పనిచేసే ప్రాంతాల్లో అసభ్యకరంగా ప్రవర్తించే వ్యక్తుల పట్ల, ఆకతాయిల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే వెంటనే షీటీంను సంప్రదించాలన్నారు. సైబర్ నేరాల జరిగినప్పుడు టోల్‌ఫ్రీ నెంబర్ 1930 కు ఫిర్యాదు చేయాలన్నారు ఈవ్ టీజింగ్ జరిగినప్పుడు సీపీ వాట్సాప్ నెంబర్ 8712685257, సీఐ 8712685142 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ధ్రువ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆకుల శ్రీనివాస్, ఆకుల సతీష్, షీటీం హెడ్ కానిస్టేబుల్ యాదగిరి, కానిస్టేబుల్ రాంరెడ్డి, మహిళా కానిస్టేబుల్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సీఐ సుజాత

ఈనెల 30న ఉన్నత విద్యా సంస్థల బంద్



సమావేశంలో మాట్లాడుతున్న స్టాలిన్, మంద శ్రీకాంత్ తదితరులు

కేయూ క్యాంపస్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈనెల 30న డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ కళాశాలలో బంద్ నిర్వహిస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షకార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్‌లు పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండ రాంనగర్‌లోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా స్టాలిన్, శ్రీకాంత్‌లు మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.8150కోట్ల మేరకు విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు బకాయిలున్నాయని, వాటిని వెంటనే చెల్లించాలని డిమాండ్‌తో బంద్‌పాటిస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయకార్యదర్శి భీరెడ్డి జస్వంత్, జిల్లా కమిటీ సభ్యులు చెన్నూరి సాయి కుమార్, పవన్ కుమార్, సూరజ్, రాహుల్, రణదీప్, అరుణ్‌కుమార్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకురాలిపై ప్రిన్సిపాల్ దౌర్జన్యం

వీసీ, రిజిస్ట్రార్లకు ఫిర్యాదు

కేయూ క్యాంపస్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సుబేదారిలోని కేయూ అనుబంధ మహిళ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్య తనపై దౌర్జన్యం చేసి దాడికి పాల్పడ్డారని మహిళ కళాశాల కాంట్రాక్టు అధ్యాపకురాలు డాక్టర్ జి.మధుశ్రీ ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలకు ఘటనపై ఫిర్యాదు చేశారు. ఆమె తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుబేదారిలోని యూనివర్సిటీ మహిళ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో 19 ఏళ్లుగా పనిచేస్తున్నానని, ప్రిన్సిపాల్ సౌజన్య రెండేళ్లుగా వేధింపులకు పాల్పడుతోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అదే విషయాలను గతంలో రిజిస్ట్రార్‌తో పాటు బీసీ అధ్యాపకుల సంఘం, కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షులకు విన్నవించినట్లు తెలిపారు.

ఇదిలాఉండగా శుక్రవారం తాను స్టాఫ్‌రూమ్‌లో ఉండగా ప్రిన్సిపాల్ సౌజన్య కళాశాల ల్యాబ్ ఇన్‌చార్జిగా అర్డర్ తీసుకోవాలని కోరగా చేయలేనని తెలిపినట్లు వివరించారు. దీంతో తనపై కళాశాల ఫ్యాకల్టీతో పాటు, బోధనేతర సిబ్బంది ఎదుట దౌర్జన్యానికి పాల్పడి దాడి చేశారని ఆరోపించారు. తనకు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా తాను ల్యాబ్ ఇన్‌చార్జి అర్డర్ కాపీని మధుశ్రీకి ఇవ్వగా తీసుకోలేదని, అంతేకాని తాను దౌర్జన్యం, దాడి చేయలేదని ప్రిన్సిపాల్ సౌజన్య స్పష్టం చేశారు.



ఫిర్యాదు పత్రాన్ని చూపుతున్న అధ్యాపకురాలు మధుశ్రీ

భూముల అమ్మకాలను 'కుడా' విరమించుకోవాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

హనుమకొండ టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నగర అభివృద్ధి పేరుతో కుడా భూముల అమ్మకాలను విరమించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి. ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్ సమీపంలో రెండు ఎకరాల 34 గుంటల ప్రభుత్వ భూమిని కుడా అధికారులు నవంబరు 3న బహిరంగ వేలం వేయడాన్ని నిరసిస్తూ సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సందర్శించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాలను రక్షించాల్సిన ప్రభుత్వమే అమ్మకాలు చేయడం సరి కాదన్నారు. ప్రభుత్వ భూముల రక్షణకు సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన, పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కుడాకు ఆదాయం కావాలంటే ప్రభుత్వ భూములను అభివృద్ధి చేసి లీజ్‌కు ఇవ్వడం, మల్టీపెక్సీలు కట్టించి అద్దెకు ఇవ్వడం ద్వారా ఆదాయ మార్గాలను పెంచుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్రానికి రెండో రాజధానిగా ఉన్న వరంగల్ మహానగరం అభివృద్ధి చేయాలంటే అనేక మార్గాలు ఉన్నాయని, భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే విలువైన ప్రభుత్వ భూములను అమ్మడం ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనమన్నారు.

భద్రకాళి గుడి అభివృద్ధి కోసం రూ.85కోట్ల అంచనా వ్యయంతో కుడా భూములను అమ్మకానికి పెట్టడం పలు అనుమానాలకు తావిస్తోందని అన్నారు. ప్రభుత్వం పునరాలోచించాలని, లేకుంటే ప్రజాగ్రహానికి గురి కాకతప్పదని ప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ నాయకులు గొడుగు వెంకట్, వాంకుడోత్ వీరన్న, తిరుపతి, మంద సంపత్, డి.భాను నాయక్, ఎం. రమాదేవి, కదిరి సుదర్శన్, మల్లన్న, జనగాం శ్రీను, మారుతి తదితరులు పాల్గొన్నారు.



కుడా భూమి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

ఎంబీబీఎస్ విద్యార్థినికి సన్మానం


హనుమకొండ చౌరస్తా, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ గుడిబండల్‌కు చెందిన కాటబోయిన సాయి మణిదీపిక ఎంబీబీఎస్‌లో సీటు సాధించగా, ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం రాజు ముదిరాజ్, రాష్ట్ర కార్యదర్శి నీరటి రాజు ముదిరాజ్, జిల్లా ఉపాధ్యక్షులు గోనెల విజేందర్ ముదిరాజ్, సభ్యులు శివరాజు ముదిరాజ్, మహేష్ ముదిరాజ్, సాగర్ ముదిరాజ్, సాయి మణి దీపిక తల్లిదండ్రులు కాటబోయిన శివరంజని-శివ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



సాయి మణి దీపికను శాలువాతో సన్మానిస్తున్న మెపా సభ్యులు

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
శనివారం • 25 అక్టోబరు 2025

భోజన కుతూహలం



సొర చేసే మేలెంతో!

తెలుగు రాష్ట్రాల్లో ప్రాంతాల వారికి సొరకాయల రూపు మారిపోతూ ఉంటుంది. ఒక ప్రాంతంలో గుండ్రటి సొరకాయలు లభిస్తే, మరొక ప్రాంతంలో పొడవైన సొరకాయలు లభిస్తాయి. పొడవుగా ఉండే సొరకాయను 'తుంబీ' అంటారు. గుండ్రంగా కుండలా ఉండే వాటిని 'కుంభీతుంబి' అంటారు. నేలబారున పాకి పెరిగిన వాటిని 'భూతుంబీ' అంటారు. వీటి గుణాలన్నింటినీ 'భోజన కుతూహలం' గ్రంథం వివరించింది.

- తలనొప్పి, ఛాతిలో మంటలాంటి అనేక వ్యాధులకు సొరకాయ మంచి మందు. సలాడ్ తినే అలవాటు ఉన్నవారు... కొన్ని సొరకాయ ముక్కలను కూడా క్రమం తప్పకుండా తింటే ఈ వ్యాధులు తగ్గిపోతాయి.
- కామెర్ల వ్యాధి వచ్చిన వారికి సొరకాయ ముక్కలను ఉడికించి పెడితే తీవ్రత తగ్గుతుంది.
- జీర్ణసమస్యలతో బాధపడేవారికి సొరకాయ చారు మంచి ఔషధం. సొరకాయ పువ్వులు కూడా జీర్ణశక్తిని పెంచుతాయి. సొర పువ్వులను నేతిలో వేయించి, పచ్చడి చేసి తింటే మంచి ఫలితాలు వస్తాయి.
- అలసటగా ఉన్న సమయంలో సొరకాయ పాయసం శక్తినిచ్చే ఔషధంలా పనిచేస్తుంది.
- పేగుల్లో ఉన్న మంచి బ్యాక్టీరియాను పెంచటానికి పెరుగు ఉపకరిస్తుంది. పెరుగుతో పాటుగా సొరకాయ ముక్కలను కూడా కలుపుకొని తింటే చాలా ప్రయోజనం ఉంటుంది.
- సొరకాయకు శరీరానికి చలువ చేసే శక్తి ఉంది.

• గంగరాజు అరుణాదేవి

వంటిల్లు

కార్తికమాసం వచ్చేసింది. మనలో చాలామంది సోమవారాలు, ఏకాదశి రోజుల్లో ఉపవాసం ఉండి పూజలు చేస్తుంటారు. ఆ రోజుల్లో సగ్గుబియ్యంతో తయారుచేసిన ఉప్మా, పాయసంలాంటి వాటిని మితంగా తీసుకుంటూ ఉంటారు. ఇవి కాకుండా సగ్గుబియ్యంతో సులువుగా తయారుచేసుకోగలిగే విభిన్న వంటకాలు మీ కోసం...



ఉపవాసవేళ సగ్గుబియ్యంతో..

"సగ్గుబియ్యంతో తయారుచేసిన పదార్థాలు తీసుకోవడం వల్ల శరీరంలో పేరుకున్న అదనపు కొవ్వులు కరిగిపోతాయి. శరీరం బరువు నియంత్రణలో ఉంటుంది. కడుపులో ఆమ్లత్వం తగ్గుతుంది. మెదడు చురుకుగా పనిచేస్తుంది. గుండె జబ్బులు దరి చేరవు. రక్తపోటు తగ్గుతుంది. శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది. ముడతలు తొలగిపోయి చర్మం బిగుతుగా మారుతుంది."

సగ్గుబియ్యం బర్ఫీ



కావాల్సిన పదార్థాలు

- సగ్గుబియ్యం- ఒక కప్పు, ఫుల్ క్రీమ్ మిల్క్- అర లీటరు, చక్కెర- ఒక కప్పు, నెయ్యి- అయిదు చెంచాలు, యాలకులు- రెండు, బాదం- అయిదు, పిస్తా పలుకులు- కొన్ని, జీడిపప్పు- కొద్దిగా

తయారీ విధానం

- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి, అందులో సగ్గుబియ్యం వేసి చిన్న మంట మీద దోరగా వేయించాలి. తరువాత పళ్లెంలోకి తీసి చల్లార్చాలి. ఆపైన మిక్సీలో వేసి మెత్తగా గ్రైండ్ చేసి జల్లించాలి. స్టవ్ మీద పాన్ పెట్టి, దానిలో నెయ్యి వేసి కరిగించాలి. అందులో సగ్గుబియ్యం పిండి వేసి బాగా కలుపుతూ అయిదు నిమిషాలపాటు వేయించి గిన్నెలోకి తీసుకోవాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి పాలు పోసి చిక్కగా మారేవరకు చిన్న మంట మీద మరిగించాలి. అయిదు నిమిషాల తరువాత చక్కెర వేసి కలపాలి. పంచదార కరిగిన తరువాత నెయ్యిలో వేయించిన సగ్గుబియ్యం పిండి వేసి కలపాలి. ఈ మిశ్రమం బాగా దగ్గరకు వచ్చేవరకూ కలుపుతూ ఉండాలి. చివరగా యాలకుల పొడి వేసి కలిపి స్టవ్ మీద నుంచి దించాలి. నెయ్యి రాసిన పళ్లెంలో ఈ మిశ్రమాన్ని వేసి సమంగా పరచాలి. దానిపైన పిస్తా, బాదం, జీడిపప్పు పలుకులు చల్లాలి. గంట తరువాత ముక్కలుగా కోసి పళ్లెంలోకి తీయాలి.


సగ్గుబియ్యం పరాటా

కావాల్సిన పదార్థాలు

- సగ్గుబియ్యం- ఒక కప్పు, ఆలుగడ్డలు- పెద్దవి మూడు, అల్లం తురుము- అర చెంచా, పచ్చి మిర్చి- రెండు, మిరియాల పొడి- అర చెంచా, జీలకర్ర- ఒక చెంచా, ఉప్పు- ఒక చెంచా, కొత్తిమీర తరుగు- కొద్దిగా, కుట్టు పిండి లేదా సింగాడ పిండి లేదా రాజ్‌గిర పిండి- అర కప్పు, నెయ్యి- తగినంత

తయారీ విధానం

- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి, అందులో సగ్గుబియ్యం పోసి చిన్న మంట మీద దోరగా వేయించాలి. తరువాత ఒక పళ్లెంలోకి తీసి చల్లార్చాలి. ఆపైన మిక్సీలో వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ సగ్గుబియ్యం పిండిని జల్లించి గిన్నెలోకి తీసుకోవాలి. ఆలుగడ్డలను ఉడికించి తొక్క తీసి, తురిమి పెట్టుకోవాలి.
- వెడల్పాటి గిన్నెలో సగ్గుబియ్యం పిండి, అల్లం తురుము, పచ్చి మిర్చి ముక్కలు, మిరియాల పొడి, జీలకర్ర, ఉప్పు, కొత్తిమీర తరుగు వేసి బాగా కలపాలి.



తరువాత ఆలుగడ్డ తురుము వేసి కలపాలి. ఆపైన కొద్దికొద్దిగా నీళ్లు చిలకరించుకుంటూ ముద్దలా చేయాలి. దీదామీద మూతపెట్టి పావుగంట సేపు నానబెట్టాలి. తరువాత చేత్తో కొద్ది కొద్దిగా పిండిని తీసుకుంటూ గుండ్రని ముద్దల్లా చేయాలి. చపాతీ పీట మీద ఒక్కో ముద్ద పెట్టి... కుట్టు లేదా సింగాడ లేదా రాజ్‌గిర పిండి చల్లుతూ చపాతీల్లా ఒత్తాలి. స్టవ్ మీద పాన్ పెట్టి ఒక్కో చపాతీ వేస్తూ రెండు వైపులా ఎర్రగా వేయించాలి. చివరగా చెంచాతో నెయ్యి రాసి పళ్లెంలోకి తీయాలి. ఈ పరాటాలను కొత్తిమీర చట్నీతో తినవచ్చు.

సగ్గుబియ్యం నగ్గెట్స్

కావాల్సిన పదార్థాలు

- సగ్గుబియ్యం- అర కప్పు, ఉడికించిన ఆలుగడ్డలు- రెండు, వేయించిన పల్లీల పొడి- పావు కప్పు, అల్లం పచ్చిమిర్చి పేస్టు- ఒక చెంచా, జీలకర్ర పొడి- ఒక చెంచా, నిమ్మరసం- ఒక చెంచా, ఉప్పు- తగినంత, కొత్తిమీర తరుగు- కొద్దిగా, నూనె- డీప్ ఫ్రైకి తగినంత

తయారీ విధానం

- సగ్గుబియ్యాన్ని వేయించి, పొడిచేసి పెట్టుకోవాలి. ఆలుగడ్డలను సన్నగా తురుముకోవాలి. వెడల్పాటి గిన్నెలో సగ్గుబియ్యం పొడి, పల్లీల పొడి, జీలకర్ర పొడి, ఉప్పు, అల్లం పచ్చిమిర్చి పేస్టు, కొత్తిమీర తరుగు వేసి బాగా కలపాలి. తరువాత ఆలుగడ్డ తురుము, నిమ్మరసం వేసి కలిపి ముద్దలా చేయాలి. ఈ మిశ్రమాన్ని చేత్తో కొద్దికొద్దిగా తీసుకుంటూ నగ్గెట్స్ మాదిరిగా తయారుచేయాలి. స్టవ్ మీద మూకుడు పెట్టి, సగానికిపైగా నూనె పోసి వేడిచేయాలి. అందులో నగ్గెట్స్ వేసి చిన్న మంట మీద ఎర్రగా వేయించి పళ్లెంలోకి తీయాలి. గ్రీన్ చట్నీతో తింటే ఈ నగ్గెట్స్ రుచిగా ఉంటాయి.



మేకప్

సెలెబ్ మేకప్ ట్రెండ్స్

అందరూ వేసుకునే మేకప్ ఇంచుమించు ఒకేలా ఉన్నా... ప్రముఖులు మాత్రం మేకప్‌లో భిన్నంగా కనిపిస్తూ ఉంటారు. అందుకు వాళ్లు అనుసరించే విభిన్నమైన మేకప్ ట్రెండ్స్ ప్రధాన కారణం. ఆ వినూత్నమైన ట్రెండ్స్‌ను అనుసరించి మనం కూడా వారిలాగే వెలిగిపోదామా...

సాఫ్ట్ గ్లామ్, మినిమలిస్ట్, మోనోక్రోమ్, బోల్డ్ అనే నాలుగు రకాల మేకప్ ట్రెండ్స్‌ను ప్రస్తుత భారతీయ ప్రముఖులు పాటిస్తున్నారు. అద్దంలా మెరిసే గ్లాస్ స్కిన్, సహజసిద్ధ కనుబొమలు, మెటాలిక్ ఐషాడోలు, న్యూడ్ లిప్స్ కూడా నేటి మేకప్ ట్రెండ్స్‌లో భాగాలుగా చెలామణీ అవుతున్నాయి.

సాఫ్ట్ గ్లామ్: ముఖంలో ఎక్కడా తీర్చిదిద్దినట్టు కనిపించకుండా న్యూడ్, డ్యూయి ఎలిమెంట్స్‌ను కలిపేసే మేకప్ ట్రెండ్ ఇది. కాటుక కళ్లు, మందపాటి కనుబొమలు, లేత రంగు పెదవులు ఈ ట్రెండ్ ప్రత్యేకతలు

మినిమలిస్ట్: తాజాదనం ఉట్టిపడే సింపుల్ మేకప్‌కు పెద్ద పీట వేస్తూనే బ్లష్, ముదురు రంగు లిప్‌స్టిక్‌లను జోడించడం ఈ మేకప్ ట్రెండ్ ప్రత్యేకత



మోనోక్రోమ్: కళ్లు, పెదవులు, చెక్కిళ్ల మీద ఒకే రంగును ఉపయోగించడం ఈ మేకప్ ప్రత్యేకత

బోల్డ్: ప్రత్యేకమైన సందర్భాల్లో ఎంచుకునే మేకప్ ట్రెండ్ ఇది. కొట్టొచ్చినట్టు కనిపించే స్మోకీ ఐస్, మెటాలిక్ షిమ్మర్ అద్దుకున్న కనురెప్పలు, మందపాటి ఐలైనర్‌లను ఈ మేకప్‌లో ఉపయోగిస్తారు. పెదవుల పైకి దృష్టి మళ్లకుండా ఉండడం కోసం న్యూడ్ లిప్స్‌ను ఎంచుకుంటారు.

కీలకమైన ఆకర్షణలు ఇవే!

చర్మం: అద్దంలా మెరుపులీనే గ్లాస్ స్కిన్ అందర్నీ ఆకట్టుకుంటుంది

కనుబొమలు: ఒత్తుగా, పట్టుకుచ్చులా కనిపించే కనుబొమలు మరింత సహజసిద్ధ లుక్‌ను తెచ్చిపెడతాయి

కళ్లు: గ్రే లేదా లైలాక్ మెటాలిక్ షేడ్స్‌లో మెరిసే ఐషాడోతో పాటు, కళ్లకు కాటుక దిద్దుకోవాలి. అలాగే కనురెప్పల పైన మందంగా ఐలైనర్ అప్లై చేసుకోవాలి

పెదవులు: పెదవులకు న్యూడ్ నుంచి బోల్డ్ వరకూ ఎలాంటి రంగునైనా ఎంచుకోవచ్చు. ఫుల్లర్ లిప్స్‌లా కనిపించడం కోసం ఓవర్ లైన్డ్ లిప్స్ స్టైల్ ఎంచుకోవాలి.

వర్షాల్లో ఇవి వేసుకోవాలి...

వర్షాకాలంలో బయటికి వెళ్లేటప్పుడు తడి నేల మీద నడవడానికి వీలుగా మంచి గ్రిప్ ఉన్న చెప్పులు, బూట్లు కొనుక్కోవాలి. లేదంటే నీళ్లలో జారిపడడం, బురదలో పాదాలు కూరుకుపోవడం లాంటి ఇబ్బందులు ఎదురవుతుంటాయి. అలాకాకుండా వర్షాకాలంలో వేసుకోదగ్గ చెప్పులు, బూట్ల గురించి తెలుసుకుందాం...



- ఫ్లోటర్స్ చెప్పులు చాలా మెత్తగా నీళ్లలో నడవడానికి వీలుగా ఉంటాయి. వీటిని వేసుకుని బురద ప్రాంతాల్లో కూడా వడివడిగా నడవచ్చు. పాదాలకు మట్టి, మురికి అంటకుండా కాపాడతాయి. వీటిని తేలికగా శుభ్రం చేసుకోవచ్చు. త్వరగా ఆరిపోతాయి కూడా.
- మరీ ఫ్లాట్‌గా ఉన్న చెప్పులు కొనుక్కోకూడదు. వీటితో నీళ్లలో నడవడం కష్టంగా అనిపిస్తుంది. లెదర్, ఫ్యాబ్రిక్ మెటీరియల్స్‌తో రూపొందించిన వాటిని ఎంపిక చేసుకోకపోవడమే మంచిది. ఇవి తేమను ఎక్కువగా పీల్చుకుంటాయి. నీళ్లలో తడిస్తే త్వరగా ఆరవు. దీనివల్ల పాదాలకు అలెర్జీ వచ్చే ప్రమాదం ఉంటుంది.



- క్రోక్స్ చెప్పులు తేలికగాను నీళ్లలో నడిచేటప్పుడు గ్రిప్‌తోను ఉంటాయి. జారి పడిపోతామన్న భయం ఉండదు. వీటి ప్రత్యేకమైన డిజైన్ కారణంగా నీళ్లు లోపలికి వెళ్లలేవు కాబట్టి పాదాలు పొడిగా ఉంటాయి. పాదాలకు గాలి తగిలేలా వీటి మీద రంధ్రాలు కూడా ఉంటాయి.
- చెప్పులు, బూట్లు కొనుక్కునేటప్పుడు అవి పాదాలకు సరిగా అమరుతున్నాయో లేదో చూసుకోవాలి. వాటి అడుగుభాగం(సోల్) గ్రిప్‌తో ఉందో లేదో పరీక్షించుకోవాలి. లేదంటే నీళ్లలో నడిచేటప్పుడు జారిపోతుంటాయి.
- రెయిన్ బూట్స్ వేసుకున్నా పాదాలు తడవవు. ఇవి బురదలో కూరుకుపోవు. పిల్లలకు, పెద్దలకు సౌకర్యవంతంగా ఉంటాయి.
- బూట్లపై నుంచి నీళ్లు త్వరగా జారిపోతూ నిమిషాల్లో గాలికి ఆరేవి ఎంపిక చేసుకోవడం మంచిది. వర్షాకాలంలో నైలాన్, ప్లాస్టిక్, రబ్బర్ బూట్లు అనువుగా ఉంటాయి.



పురుషాధిక్య రంగాల్లో మోటార్‌స్పోర్ట్ ఒకటి. దాన్లో రాణించడమే కాకుండా డాక్టరేట్ కూడా పొందగలిగింది... గురుగ్రామ్‌కు చెందిన 53 ఏళ్ల బని యాదవ్. ఈ గౌరవాన్ని పొందిన ఏకైక భారతీయ రేసర్ బని ఆసక్తికరమైన ప్రస్థానమిది...

ప్రేరణ



53 ఏళ్ల మహిళా రేసర్

బని తండ్రి రేస్ కార్లకు మార్పులు చేసేవారు. అలా చిన్నప్పటి నుంచి రేసు కార్లతో కలిసి పెరిగిన బని... ఎంతో ఆలస్యంగా 43వ ఏట ప్రొఫెషనల్ రేసింగ్‌లోకి అడుగు పెట్టింది. అందుకు కారణం గురించి వివరిస్తూ... "మా నాన్నకు స్వతహాగా రేసింగ్ పట్ల ఆసక్తి ఉన్నప్పటికీ నేను రేసర్‌గా ఎదగడానికి ఒప్పుకోలేదు. పైగా నా చిన్నతనంలో మన దేశంలో రేసింగ్‌కు సంబంధించి మౌలిక సదుపాయాలు కూడా అంత మెరుగ్గా ఉండేవి కావు. దాంతో అందరు యువతుల్లాగే పెళ్లి చేసుకుని, పిల్లల పెంపకంతో బిజీగా మారిపోయాను. అలాగని రేసింగ్ పట్ల నా మక్కువ తగ్గిపోలేదు. చిన్ననాటి స్నేహితుడినే ప్రేమించి, పెళ్లాడాను. దాంతో కుటుంబం నన్ను వెలి వేసింది. ఆర్థిక ఇబ్బందులు కూడా వేధించాయి. దాంతో డబ్బు సంపాదన, పిల్లల పెంపకం మీదే దృష్టిని కేంద్రీకరించాను. పిల్లలు పెరిగి పెద్దయ్యాక, కుటుంబం ఆర్థికంగా స్థిరపడిన తర్వాత... రేసింగ్ గురించి ఆలోచించడం మొదలుపెట్టాను. మా వారు నా మక్కువను మరింత ప్రోత్సహించడంతో 40 ఏళ్ల వయసులో రేసింగ్ మొదలుపెట్టాను. భారతదేశంలో ర్యాలీ కార్ డ్రైవింగ్ ప్రధానంగా పురుషులకే పరిమితం. ఈ పోటీల్లో కేవలం కొద్దిమంది మహిళలే పాల్గొంటూ ఉంటారు. అయితే అదృష్టవశాత్తూ, నా నేవిగేటర్ కూడా మహిళే కావడంతో సర్క్యూట్ మొత్తంలో మేమే ఏకైక మహిళా జంటగా రేసింగ్‌లో పాల్గొనే వాళ్లం. ఇది పురుషుల క్రీడ కాబట్టి మహిళల చేతుల్లో ఓడిపోవడాన్ని పురుషులు ఇష్టపడరు. మహిళలు పురుషులతో సమానంగా వేర్వేరు రంగాల్లో ఎదగడాన్ని పురుషులు స్వాగతిస్తారు, ప్రోత్సహిస్తారు... కానీ అది వాళ్లను ఓడించనంతవరకే! "రేసింగ్ ఆమె అభిరుచి కాబట్టి రేస్‌లో పాల్గొనడంలో తప్పేముంది?" అన్న వాళ్లే, రేసింగ్‌లో నేను గెలిస్తే జీర్ణించుకోలేకపోతూ ఉండేవారు. ప్రారంభంలో ఇలాంటి ఎన్నో ప్రతిఘటనలను ఎదుర్కొన్నాను. ఆ తర్వాత ర్యాలీలు, టైటిళ్లు గెలుచుకోవడం మొదలుపెట్టడంతో అందరూ గౌరవించడం మొదలుపెట్టారు" అంటూ తన రేసింగ్ పోరాటం గురించి వివరించింది బని.

రిటైరయ్యే వయసులో...

2013లో జైపూర్ స్పీడ్ స్ప్రింట్ పోటీలో పాల్గొని 2వ స్థానాన్ని దక్కించుకోవడంతో మొదలుపెట్టి, 2018, 2019లో నేషనల్ ఆటోక్రాస్ ఛాంపియన్ విమెన్‌గా ఎదిగింది బని. అలాగే భారతదేశం వెలుపల అబుదాబి యాస్ మెరీనా సర్క్యూట్‌లో ఫార్ములా కార్లను నడపడంతో పాటు, తాజాగా మోటార్‌స్పోర్ట్స్‌లో డాక్టరేట్‌ను పొందే స్థాయికి కూడా ఎదగలిగింది. ప్రస్తుతం 53 ఏళ్ల వయసులో సైతం రేసింగ్‌లో సత్తా చాటుతోంది. అగ్ర క్రీడాకారులందరూ 40 ఏళ్ల వయసులో రిటైర్ అయిపోతూ ఉంటారు. కానీ ఎంతో ఆలస్యంగా 43 ఏళ్ల వయసులో రేసింగ్‌లోకి ప్రవేశించిన బని... తన పట్టుదల వెనకున్న కారణం గురించి వివరిస్తూ... "రేసింగ్ అవకాశం నాకు కాస్త ఆలస్యంగా వచ్చింది. రేసింగ్‌లో నా వయసులో సగం వయసున్న పురుషులతో పోటీ పడ్డాను. చాలామంది నన్ను చూసి హేళన చేశారు. పోటీదారులు ట్రాక్ మీద కోపాన్ని ప్రదర్శించి, పోటీలో వెనకపడిపోయేలా చేసేవారు. అయితే నేను నా చిన్ననాటి కలను నిజం చేసుకుంటున్న విషయం వాళ్లకు తెలియదు. నన్ను వెనక్కి తోసేసే అవకాశం, చొరవ ఎవరికీ ఇవ్వననే విషయం కూడా వాళ్లకు తెలియదు. రేసింగ్‌లో పట్టుదల, ఆత్మవిశ్వాసాలతో పాటు నేర్పరితనం కూడా కలిగి ఉండాలి. నా మటుకు నేను పోటీదారులను గమనిస్తూ, వాళ్ల నుంచి కొత్త విషయాలు నేర్చుకున్నాను. అవరోధాలను ఎలా తప్పించుకోవాలో, అపజయాల నుంచి పాఠాలు ఎలా నేర్చుకోవాలో, తప్పుడు గైడెన్స్‌లను ఎలా గుర్తించాలో సాటి రేసర్ల సంభాషణల నుంచి తెలుసుకున్నాను" అంటూ రేసింగ్‌లో ఎదుర్కొన్న సవాళ్ల గురించి వివరించింది బని.

తల్లి బాటలో పిల్లలు...

రేసింగ్‌లో వయసు కూడా ప్రధానమే! ఈ పోటీకి నా వయసు అవరోధంగా మారిన సందర్భాలు లేకపోలేదు. కంటిచూపు, రిఫ్లెక్స్‌లు ఇబ్బంది పెడుతూ ఉంటాయి. అయినా పూర్తి సామర్థ్యం మేరకు ప్రతిభ కనబరచడమెలాగో అనుభవం మీద నేర్చుకున్నాను. ఏ అవకాశమైనా జీవితంలో ఒక్కసారే చేతికి అందుతుంది. దాన్ని నూరు శాతం సద్వినియోగం చేసుకోవాలి. నాకు ఇదొక అపురూపమైన అవకాశం కాబట్టే మక్కువనే శక్తిగా మార్చుకుని రేసింగ్‌లో పైకి ఎదుగుతున్నాను' అంటూ మీడియాకు వివరించిందామె. 53 ఏళ్ల వయసులో సైతం సాటి రేసర్లకు స్ఫూర్తిగా మారుతున్న బన్నికి ఇద్దరు అబ్బాయిలు. వాళ్లిద్దరూ కూడా ర్యాలీ డ్రైవర్లే కావడం చెప్పుకోదగిన విశేషం.

ఇల్లు... సరికొత్తగా!

ప్రతిఒక్కరూ తమ ఇల్లు ప్రత్యేకంగా కనిపించాలని కోరుకుంటారు. సామాన్లను రకరకాలుగా సర్దుతూ ఇంటి లుక్ మార్చే ప్రయత్నం చేస్తారు. అలాకాకుండా చిన్న చిట్కాలతో ఇంటిని సరికొత్తగా మార్చేయవచ్చు. ఆ వివరాలు...

- ఇండోర్ ప్లాంట్స్ వల్ల ఇంటి అందం పెరుగుతుంది. హాల్, పడకగది, వంటగది, పిల్లలు చదువుకునే గదుల్లో వేలాడే మొక్కలను ఏర్పాటు చేసుకోవచ్చు. అక్కడక్కడా వీలును బట్టి చక్కని కుండీలను కూడా పెట్టుకోవచ్చు. తీగలా పెరిగే మొక్కలతో ఇంటిని అందంగా అలంకరించవచ్చు.
- ఖాళీ గోడమీద... రకరకాల ఫొటోలను అందమైన ఆకృతిలో అమర్చుకుంటే ఇంటికి గ్రాండ్ లుక్ వస్తుంది. కుటుంబసభ్యులంతా వివిధ సందర్భాల్లో తీయించుకున్నవి, పిల్లలు ఎదిగే క్రమంలో తీసినవి, ఏదైనా ఫంక్షన్ లేదా పార్టీలో తీసిన వాటిని ఒక క్రమంలో గోడమీద అంటించినా బాగుంటుంది.
- హాల్లో గోడమీద టీవీని అమర్చి చుట్టూరా చిన్న చిన్న అరలను ఏర్పాటు చేయడం నేటి ట్రెండ్. ఈ అరల్లో అందమైన బొమ్మలు, ఫొటోఫ్రేమ్‌లు, ఫ్లవర్ వాజ్‌లు, టెడ్డీబేర్లు, ఇతర గ్లాస్ ఐటెమ్స్‌ను పెడితే ఇల్లు అందంగా కనిపిస్తుంది.
- ప్రస్తుతం చాలామంది.. హాల్, వంటగది, ఇతర గదుల్లో గోడలకు ట్రేలను వేలాడదీసుకుంటున్నారు. వీటివల్ల ఇల్లు ప్రత్యేకంగా కనిపిస్తుంది.
- కిటికీలకు కాంట్రాస్ట్ రంగుల కర్టెన్లు వేస్తే ఇల్లు క్లాసీగా కనిపిస్తుంది.



- హాల్ మధ్యలో చక్కని కార్పెట్ వేయడం వల్ల కూడా ఇంటికి రిచ్ లుక్ వస్తుంది.
- దివాన్ కాట్ లేదా సోఫా మీద ఉండే కుషన్స్‌కు ముదురు రంగులో మెరిసే కవర్లు వేసి అందంగా సర్దితే.. ఇంట్లోకి రాగానే గ్రాండ్‌గా అనిపిస్తుంది.

తుర్లపాటి రాజేశ్వరికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం

న్యూఢిల్లీ, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ రచయిత్రి తుర్లపాటి రాజేశ్వరికి శుక్రవారం కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కారాన్ని ప్రదానం చేశారు. కోల్‌కతా జాతీయ లైబ్రరీలోని శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆడిటోరియంలో అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్.. రాజేశ్వరిని రూ 50వేల నగదు, తామ్రపత్రంతో సత్కరించారు. సుప్రసిద్ధ ఒడియా రచయిత గోపీనాథ మహంతి రచించిన నవల 'దాడిబుధను ఈతచెట్టు దేవుడు' పేరుతో రాజేశ్వరి తెలుగులోకి అనువదించారు. ఒడిశాలోని కోరాపుట్ జిల్లా లుల్లా గ్రామం నేపథ్యంలో సాగిన ఈ నవల అడవిలో జంతువుల ముప్పు మధ్య నివసిస్తున్న గిరిజన వర్గాల జీవన విధానాన్ని, వారి నమ్మకాలను విశ్లేషించింది. 1947 ఆగస్టు 10న ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులో జన్మించిన రాజేశ్వరి దాదాపు 5 దశాబ్దాలుగా బరంపురంలో నివసిస్తున్నారు. పలు ఒడియా రచనల్ని తెలుగులోకి అనువదించారు. కవిత్వం, అనువాదాలు, పరిశోధనా వ్యాసాలు సహా అనేక రచనలు చేశారు. ఆమె దాడిబుధను సరళంగా, అందరూ చదివేలా, మూల రచన జీవం చెడకుండా చక్కని శైలిలో అనువదించారని కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి కృత్తివెంటి శ్రీనివాసరావు పేర్కొన్నారు.

మద్యం దుకాణాలకు 95,137 దరఖాస్తులు

- చివరి రోజున స్పందించిన 4,822 మంది.. 27న డ్రా

హైదరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2620 మద్యం షాపులకు 95,137 మంది దరఖాస్తులు దాఖలు చేశారు. చివరి రోజున 4,822 అర్జీలు వచ్చాయి. జిల్లాల వారీగా మద్యం షాపుల దరఖాస్తుదారుల సమక్షంలో ఈ నెల 27న ఉదయం 11 గంటలకు డ్రా తీయనున్నారు. వచ్చిన దరఖాస్తులను జిల్లాల వారీగా పరిశీలిస్తే.. అత్యధికంగా రంగారెడ్డి ఎక్సైజ్ డివిజన్‌లో 29,420 రాగా.. ఆదిలాబాద్‌లో అత్యల్పంగా 4154 వచ్చాయి. శంషాబాద్‌లో 8536, సరూర్‌నగర్ 7845, మేడ్చల్ 6063, మల్కాజిగిరి 5168, నల్లగొండ 4906, సంగారెడ్డి 4432, ఖమ్మం 4430, కొత్తగూడెం 3922, హైదరాబాద్ 3201, వరంగల్ అర్బన్ 3175, సికింద్రాబాద్‌లో 3022, నిజామాబాద్ 2786, సిద్దిపేట 2782, యాదాద్రి భువనగిరి 2776, సూర్యాపేట 2771, కరీంనగర్ 2730, మహబూబ్‌నగర్ 2487, జగిత్యాల 1966, వరంగల్ రూరల్‌లో 1958, జయశంకర్ భూపాల్‌పల్లి 1863, వికారాబాద్ 1808, మహబూబాబాద్ 1800, జనగామ 1697, మంచిర్యాల 1712, నాగర్‌కర్నూల్ 1518, పెద్దపల్లి 1507, కామారెడ్డి 1502, రాజన్న సిరిసిల్ల 1381, మెదక్ 1420, నిర్మల్ 991, జోగులాంబ గద్వాల 774, అదిలాబాద్‌లో 771, వనపర్తి 757, కోమురం భీమ్ ఆసిఫాబాద్‌లో 680 దరఖాస్తులు వచ్చాయి.

అంగన్‌వాడీలకు సరుకులు సకాలంలో అందాలి

- అలసత్వం వహించే కాంట్రాక్టర్లపై చర్యలు: మంత్రి సీతక్క

హైదరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ రోడ్ల నిర్మాణంకోసం రూ.74.43కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి సీతక్క శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నిధులతో 32 కొత్త రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు శాఖాపరంగా పరిపాలనా అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ రోడ్ల నిర్మాణం ద్వారా పల్లెల మధ్య అనుసంధానం పెరిగి రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించడమే కాకుండా.. విద్యార్థులు, వ్యాపారులు, వృద్ధులు, గర్భిణులు, ఇతర వర్గాలకు ప్రయాణ సౌలభ్యం కలుగుతుందని మంత్రి వెల్లడించారు. మరోవైపు.. అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకులు సకాలంలో అందాలని, వాటి సరఫరాలో ఎలాంటి లోపాలు ఉండకూడదని మంత్రి సీతక్క ఆదేశించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారులతో శుక్రవారం సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె సమీక్ష నిర్వహించారు. సరుకులు సరఫరా చేసే కాంట్రాక్టర్లు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

జూబ్లీహిల్స్ బరిలో 58 మంది

నామినేషన్లు ఉపసంహరించుకున్న 23 మంది.. 4 బ్యాలెట్ యూనిట్లు వినియోగించే అవకాశం

నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 4,01,365.. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే 16,100 పెరుగుదల

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో 58 మంది అభ్యర్థులు బరిలో మిగిలారు. మొత్తం 81 మంది నామినేషన్లు చెల్లుబాటు కాగా.. వారిలో 23 మంది నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. బరిలో ఉన్న వారు, నోటాతో కలిపితే మొత్తం సంఖ్య 59కి చేరనున క్రమంలో నాలుగు బ్యాలెట్ యూనిట్లు వినియోగించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి ఆర్‌వీ కర్ణన్ తెలిపారు. ఒక్కో బ్యాలెట్ యూనిట్‌పై 16 మంది అభ్యర్థుల పేర్లు ఉంటాయని పేర్కొన్నారు. ఒకే కంట్రోల్ యూనిట్‌తో నాలుగు బ్యాలెట్ యూనిట్లు పని చేసే వెసులుబాటు ఉందని, ఓటింగ్‌కు ఎలాంటి ఇబ్బంది ఉండదని వెల్లడించారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో నాలుగు బ్యాలెట్ యూనిట్లు, ఒక్కో కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్ యంత్రం వినియోగించనున్నారు. అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉండడం.. నాలుగు బ్యాలెట్ యూనిట్లు వినియోగించాల్సిన దృష్ట్యా.. ఓటింగ్ కంపార్ట్‌మెంట్ కొంత ఎక్కువ పరిమాణంలో ఉండనుంది. ఉప ఎన్నికలో భాగంగా 211 మంది 321 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో 130 మంది నామినేషన్లు తిరస్కరణకు గురి కాగా.. 81 నామినేషన్లు చెల్లుబాటయ్యాయి. వీరిలో 23మంది పోటీ నుంచి తప్పుకొన్నారు. కాగా, స్వతంత్రులు, ఎన్నికల సంఘం గుర్తింపు లేని పార్టీల అభ్యర్థులకు గుర్తులు కేటయించినట్టు రిటర్నింగ్ అధికారి సాయిరాం పేర్కొన్నారు. కాగా, జీహెచ్‌ఎంసీ తాజాగా ప్రకటించిన అనుబంధ జాబితా ప్రకారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 4,01,365 మంది ఓటర్లు ఉన్నట్లు తేలింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో 3,85,265 మంది ఓటర్లు ఉంటే..తాజాగా ఆ సంఖ్య 16,100 మేర పెరిగింది.

ఫార్మాసిటీ రైతుల నామినేషన్ల తిరస్కరణ

యాచారం: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో భాగంగా ఫార్మాసిటీ బాధిత రైతులు వేసిన పది నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. ఇలా ఎందుకు జరిగిందో ఎన్నికల అధికారులతో మాట్లాడుతామని ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకుడు సందీప్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

ఫిల్మ్ ఛాంబర్‌లో ఎన్నికల లొల్లి!

(మొదటిపేజీ తరువాయి)

నిరవధికంగా వాయిదా వేయించాలని చూస్తోందని, దీని వెనక అనేక వ్యాపార, ఆర్థిక ప్రయోజనాలు ఉన్నాయని రెండోవర్గం ఆరోపణ.

ఎన్నికలకు తాత్సారం

తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ బైలాస్ ప్రకారం ప్రతి రెండేళ్లకు ఒకసారి ఎన్నికలు జరగాలి. ఈ ఎన్నికల్లో స్టూడియో, ప్రొడ్యూసర్స్, డిస్ట్రిబ్యూటర్స్, ఎగ్జిబిటర్స్ రంగాలకు చెందిన సభ్యులు పాల్గొంటారు. వారంతా కలిసి రెండేళ్లకు కార్యనిర్వాహక వర్గాన్ని ఎన్నుకుంటారు. అధ్యక్షుడి పదవీకాలం మాత్రం ఏడాదే ఉంటుంది. ఒకో ఏడాది ఒకో రంగానికి అధ్యక్షుడిగా అవకాశం ఇస్తారు. గత ఏడాది ప్రొడ్యూసర్స్ తరుపున దిల్‌రాజు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ ఏడాది డిస్ట్రిబ్యూటర్స్ రంగం నుంచి భరత్ భూషన్ ఎన్నికయ్యారు. ఎన్నికలు జరిగి కొత్త కార్యవర్గం వస్తే అందులో ఈసారి అధ్యక్షుడిగా ఎగ్జిబిటర్స్ రంగానికి అవకాశం ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం ఉన్న కమిటీ ఎన్నికలు జరపకుండా తాత్సారం చేస్తోందని ఆరోపణలు వస్తున్నాయి. అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు ఎన్నికలను వాయిదా వేస్తే అర్థం చేసుకోవచ్చు. గతంలో రాష్ట్ర విభజన సమయంలో, కొవిడ్ వచ్చినపుడు మాత్రమే ఎన్నికలను వాయిదా వేశారు. ఇప్పుడు ఎలాంటి సమస్య లేకున్నా ఎన్నికలు వాయిదా వేయడంపై అనేక మంది సభ్యులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత కమిటీ పదవి కాలం జూలై 31తో ముగిసింది. కమిటీ పదవీకాలం ముగియకముందే ఎన్నికల ప్రక్రియ ముగిసిపోవాలి. కొత్త కమిటీ సిద్ధంగా ఉండాలి. పాత కమిటీకి పదవిలో కొనసాగే అధికారం ఉండదు. ఈ ఏడాది జూన్ 30న ఛాంబర్ కార్యనిర్వాహకవర్గం చివరిసారి సమావేశం అయ్యింది. ఎన్నికలు నిర్వహించమని చాలామంది సభ్యులు కోరారు. కమిటీ ఏదీ తేల్చ లేదు. దీనిపై సి.కళ్యాణ్, ఛాంబర్ వైస్ ప్రెసిడెంట్ కె.అశోక్ కుమార్, విజయేందర్‌రెడ్డి సహా అనేక మంది తీవ్రమైన అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఎగ్జి



క్యూటివ్ కమిటికి ఎన్నికలు వాయిదా వేసే హక్కు లేదని వాదించారు. దీనితో సమావేశం వాయిదా పడింది. సమావేశం మినిట్స్ కావాలని అశోక్ కుమార్, మరి కొందరు అడిగినా స్పందన లేదు. దీనితో ఎన్నికలు నిర్వహించమని కోరుతూ మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డికి, తుమ్మల నాగేశ్వరావుకు. కోమటిరెడ్డి వెంకటరెడ్డికి, ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్‌రాజుకు, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ కమిషనర్‌కు లేఖలు రాశారు. వ్యక్తిగతంగా వినతిపత్రాలు ఇచ్చారు. ప్రభుత్వం నుంచి కూడా ఎటువంటి స్పందన రాలేదు. "కార్యనిర్వాహకవర్గం పదవీ కాలాన్ని పొడిగించారా? అలాంటి నిర్ణయమేమైనా తీసుకుంటే సమాచారం ఇవ్వాలని కోరుతున్నాం. కమిటీ ఇవ్వడం లేదు. దానిపై నియంత్రణ ఉన్న ప్రభుత్వం ఇవ్వడం లేదు" అని అశోక్ కుమార్ అన్నారు. ఈ నేపథ్యంలో అక్టోబరు 26న జనరల్ బాడీ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సభ్యులకు సమాచారం అందింది. అసలు కమిటీకి ఈ సమావేశం నిర్వహించే అధికారమే లేదనేది కొందరి సభ్యుల వాదన. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళి వల్ల ఈ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు తనకు సమాచారం అందిందని అశోక్ కుమార్ చెబుతున్నారు. ఎన్నికల నియమావళి ఒక సొసైటీ జనరల్ బాడీ సమావేశానికి ఎందుకు అడ్డం వస్తుందో అర్థం కావటం లేదని వ్యాఖ్యానించారు.

అసలు కారణం వేరు

ఛాంబర్ కార్యాలయం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని చాలా ముఖ్యమైన కూడలిలో ఉంది. దీని రియల్ ఎస్టేట్ విలువ కొన్ని వందల కోట్ల రూపాయలు ఉంటుంది. ఫిల్మ్‌నగర్ హౌసింగ్ సొసైటీ సుమారు 30 ఏళ్ల క్రితం ఈ స్థలాన్ని ఛాంబర్‌కు, నిర్మాతల మండలికి లీజ్‌కు ఇచ్చింది. చిత్ర పరిశ్రమకు సంబంధించిన అన్ని కార్యాలయాలు ఒక చోట ఉంటే బావుంటుందనే ఉద్దేశంతో అప్పటి సినీ పెద్దలు ఇక్కడ అనేక భవనాలు నిర్మించారు. ఈ స్థలంలోనే ఒక దేవాలయం.. ఒక ఆఫీసు కాంప్లెక్స్.. సభ్యుల కోసం ఒక క్లబ్ మొదలైనవి నిర్మించారు. ఇప్పుడు లీజ్ కాలం పూర్తి కాకుండానే కార్యాలయాలను ఖాళీ చేయమని సొసైటీ ఒత్తిడి పెట్టడం మొదలుపెట్టింది. భవంతులను కూల్చివేసి వాటి స్థానంలో బహుళ అంతస్థుల నిర్మాణాన్ని చేపట్టాలనే ప్రతిపాదన చాలాకాలంగా ఉంది. దానిని ఈ మధ్యకాలంలో సొసైటీ పాలక మండలి సభ్యులు కొందరు చురుకుగా ముందుకు కదిపారు. వారికి తోడు చాంబర్ కార్యవర్గంలోని కొందరు తోడయ్యారు. ఒక రియల్ ఎస్టేట్ సంస్థతో బహుళ అంతస్థుల భవంతిని నిర్మించటానికి అనధికారికంగా ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది. అయితే, ప్రస్తుతం ఉన్న భవనాలను కూల్చే ప్రతిపాదనను చాలామంది సభ్యులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సినీ పరిశ్రమకు చెందిన పెద్దలందరి అభిప్రాయాలు తీసుకున్న తర్వాతే ఈ భవంతులు కూల్చాలని వారు డిమాండ్ చేస్తున్నారు. దీనివల్ల ఛాంబర్‌కు కలిగే ప్రయోజనం తక్కువని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికలను వాయిదా వేస్తే భవంతిపై నిర్ణయం తీసుకోవచ్చని కార్యనిర్వాహకవర్గం భావిస్తోందని కొందరు సభ్యులు ఆరోపిస్తున్నారు. చిత్రపురి కాలనీలో ప్లాట్ల విషయంలో కూడా ఛాంబర్ ఎగ్జిక్యూటివ్ కమిటీ తీసుకున్న కొన్ని నిర్ణయాలు వివాదాస్పదమయ్యాయని కొందరు సభ్యులు ఆరోపిస్తున్నారు. కొత్త కార్యనిర్వాహకవర్గం ఏర్పాటైతే వివాదాస్పద నిర్ణయాలు బయటకు వచ్చి రకరకాల సమస్యలు ఎదురవుతాయనే ఉద్దేశంతో ఎన్నికలు జరపకుండా ప్రస్తుత కార్యనిర్వాహకవర్గం తాత్సారం చేస్తోందని అంటున్నారు.

పట్టణాల ప్రగతికి భారీ నిధులు

(మొదటిపేజీ తరువాయి)

మున్సిపాలిటీలకు రూ.20 కోట్లు, కొత్త నగర పాలక సంస్థలకు రూ.30 కోట్ల చొప్పన కేటాయించారు. వచ్చే ఏడాది మార్చికల్లా పనులు పూర్తి చేయాలని ఆయా మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థలను పురపాలకశాఖ ఆదేశించింది. ఇక ఆయా పనులను చేపట్టడానికి ప్రాధాన్య క్రమంలో నిధులు ఖర్చు చేయాలని మార్గదర్శకాలు ఖరారు చేసింది. మున్సిపాలిటీల్లో విలీనమైన ప్రాంతాల అభివృద్ధి, అంతర్గత రోడ్లు, వర్షపు నీరు, మురుగునీటి కోసం డ్రైన్ల నిర్మాణం, చెరువులూ కుంటల్లో కాలుష్య నివారణ, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రాంతాల్లో మౌలిక వసతులు, పార్కుల అభివృద్ధి, కల్వర్టులు- వాణిజ్య సముదాయాల నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. అన్ని మున్సిపాలిటీల్లో సంబంధిత విభాగాలు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని పురపాలకశాఖ ఆదేశించింది.

సీఎం శాఖలన్నింటా ఫెయిల్

- వసూళ్ల మంత్రిగా మాత్రం పాస్: హరీశ్‌రావు
- జాబ్‌క్యాలెండర్ అమలు చేయాలి: ఆర్. కృష్ణయ్య

హైదరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తన పరిధిలోని హోంశాఖ, విద్య, మునిసిపల్ మంత్రిత్వశాఖల నిర్వహణల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఫెయిల్ అయ్యారని, కలెక్షన్లు, వసూళ్ల మంత్రిగా మాత్రం పాస్ అయ్యారని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం జల విహార్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ నిరుద్యోగ బాకీకార్డు ఆవిష్కరణ చేపట్టారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం టీఎస్ ఐపాస్ ద్వారా పెద్దఎత్తున పెట్టుబడులను ఆకర్షిస్తే.. కాంగ్రెస్‌వారు గన్నుపెట్టి బెదిరిస్తూ.. పారిపోయేలా చేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు నిరుద్యోగులను వేడుకొని వాడుకున్న ఆయన అధికారంలోకి రాగానే వదిలేశారని మండిపడ్డారు. ఎంపీ ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ హామీ మేరకు జాబ్‌క్యాలెండర్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూరాష్ట్ర ప్రభుత్వం మెడలువంచి యువత తమ హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

లంక వెళ్లిన రామ్



రామ్‌చరణ్ నటిస్తున్న రూరల్ యాక్షన్ డ్రామా 'పెద్ది' చిత్రం కోసం ఓ పాటను శనివారం నుంచి శ్రీలంకలో చిత్రీకరించనున్నారు. బాలీవుడ్ భామ జాన్వీ కపూర్ కూడా ఈ పాట చిత్రీకరణలో పాల్గొంటారు. దర్శకుడు బుచ్చిబాబు సానా, ఇతర యూనిట్ సభ్యులు ఇందుకోసం శ్రీలంక బయలుదేరి వెళ్లారు. అక్కడి అందమైన ప్రదేశాల్లో ఛాయాగ్రాహకుడు రత్నవేలు సారథ్యంలో ఈ పాటను చిత్రీకరించనున్నారు. ఏఆర్ రెహమాన్ ఈ సినిమాకు స్వరాలు అందిస్తున్నారు. దర్శకుడు బుచ్చిబాబు ఆసక్తికరంగా రూపొందిస్తున్న 'పెద్ది' చిత్రంలో రామ్‌చరణ్ సరికొత్త లుక్‌లో కనిపించనున్నారు. టాప్ టెక్నీషియన్లు పని చేస్తున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది మార్చి 27న భారీ స్థాయిలో విడుదల చేయనున్నారు నిర్మాత వెంకట సతీశ్ కిలారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో 'పెద్ది' చిత్రం రూపుదిద్దుకుంటోంది.

ఏ సౌండ్‌కి నరుకుతానో నాకే తెలియదు



నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటోన్న 'అఖండ 2: తాండవం' చిత్రం నుంచి అదిరిపోయే అప్డేట్ వచ్చేసింది. ఈ చిత్రాన్ని తేజస్విని నందమూరి సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. బ్లాక్‌బస్టర్ మూవీ 'అఖండ'కు సీక్వెల్‌గా తెరకెక్కుతోన్న ఈ సినిమా డిసెంబరు 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవలె భారీ సన్నివేశాలతో అఖండ పాత్రను పరిచయం చేసిన తొలి టీజర్‌కు అద్భుతమైన స్పందన లభించింది. తాజాగా బాలకృష్ణ మరో పాత్రను పరిచయం చేస్తూ దర్శకనిర్మాతలు గ్లింప్స్ విడుదల చేశారు. వీడియోలో బాలకృష్ణ పూర్తి స్థాయి మాస్ అవతార్‌లో హై - ఓల్టేజ్ యాక్షన్‌తో అదరగొట్టారు. 'సౌండ్ కంట్రోల్‌లో పెట్టుకో. ఏ సౌండ్‌కి నవ్వుతానో, ఏ సౌండ్‌కి నరుకుతానో నాకే తెలియదు కొడకా. ఊహకి కూడా అందదు' అనే బాలయ్య పవర్‌ఫుల్ సంభాషణలు సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చాయి. రామ్-లక్ష్మణ్ మాస్టర్స్ యాక్షన్ కొరియోగ్రఫీ అద్భుతంగా ఉంది. సంగీత దర్శకుడు తమన్ బీజీఎం సౌండ్ బాక్సులు పగిలిపోయేలా ఉంది. కాగా, ఈ చిత్రంలో సంయుక్త ముఖ్య పాత్రలో నటిస్తున్నారు. ఆది పినిశెట్టి శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారు.

సంగీత కార్యక్రమాలు మొదలయ్యాయి



మహేశ్‌బాబు కథానాయకుడిగా 'ఎస్ఎస్ఎంబీ29' అనే వర్కింగ్ టైటిల్‌తో రాజమౌళి ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తోన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతోంది. ఈ చిత్రానికి సంబంధించిన ఓ అప్డేట్‌ని సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి తనయుడు కాలభైరవ మీడియాతో పంచుకున్నారు. 'ఎస్ఎస్ఎంబీ29' సంగీత కార్యక్రమాలు ప్రారంభమైనట్లు వెల్లడించారు.. 'మోగ్లీ 2025' చిత్రం పాట ఆవిష్కరణ వేడుకలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ 'నాన్నగారి సినిమాల్లో వర్క్ ఉంటే కచ్చితంగా నాకు చెబుతారు. ముఖ్యంగా ఆయనతో కలసి రికార్డింగ్ సెషన్స్‌కు వెళ్తుంటా. 'ఎస్ఎస్ఎంబీ29'కి సంబంధించిన మ్యూజిక్ రికార్డింగ్ పనులు ఇటీవలె మొదలయ్యాయి. నేను కూడా అందులో భాగమయ్యా' అని చెప్పారు.

సౌండ్ అదిరింది!



ప్రభాస్ హీరోగా దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా 'స్పిరిట్' పేరుతో ఓ చిత్రాన్ని రూపొందించనున్న సంగతి తెలిసిందే. తమ హీరో పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ 'సౌండ్ స్టోరీ' పేరుతో ఓ ఆడియో టీజర్‌ను విడుదల చేసి ఓ కొత్త ట్రెండ్‌కు శ్రీకారం చుట్టారు సందీప్‌రెడ్డి. ఇందులో విజువల్స్ లేవు. కానీ ప్రభాస్, ప్రకాశ్ రాజ్ , మరో వ్యక్తి చెప్పే డైలాగ్స్ మాత్రం ఉన్నాయి. కథ ప్రకారం ప్రభాస్‌ది ఇందులో పోలీస్ ఆఫీసర్ పాత్ర. ఏదో కారణం చేత తను అరెస్ట్ అయి జైలుకి వెళతాడు. అక్కడ జైలర్‌గా ఉన్న ప్రకాశ్‌రాజ్, ప్రభాస్‌ల మధ్య జరిగే సంభాషణ ఆసక్తికరంగా ఉంది. ప్రభాస్ కూల్‌గా 'సూపరెండెంట్ సార్.. చిన్నప్పటి నుంచీ నాకు ఓ చెడ్డ అలవాటు ఉంది' అని చెప్పడంతో ఈ ఆడియో క్లిప్ ముగుస్తుంది. ఒక సినిమా ప్రోమోని షూటింగ్‌కు ముందే ఇలా ఆడియో క్లిప్ రూపంలో విడుదల చేయడం తెలుగు సినిమా చరిత్రలో ఇదే తొలిసారి. అందుకే ఈ 'సౌండ్ స్టోరీ అదిరిపోయింది' అంటూ ప్రభాస్ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ చిత్రంలో త్రిప్తి డిమ్రి కథానాయిక. వివేక్ ఒబెరాయ్ విలన్‌గా నటిస్తున్నారు. ప్రణయ్‌రెడ్డి వంగా, భూషణ్ కుమార్, కృష్ణన్ కుమార్ నిర్మించే ఈ చిత్రం షూటింగ్ త్వరలో ప్రారంభమవుతుంది.

గుర్తుపట్టలేనంతగా..



తొలి నుంచీ శర్వానంద్ కథను ఎంపిక చేసుకునే విధానం, తెరపైన తను కనిపించే తీరు, హంగూ ఆర్భాటాల్లేని ప్రచార శైలి హీరోల్లో ఆయన్ను ప్రత్యేకంగా నిలిపాయి. ఎక్కువగా కుటుంబ కథా చిత్రాలతో ఇంటిల్లిపాదిని అలరిస్తూ వస్తున్న శర్వానంద్ ఈ సారి తన పంథా మార్చారు. 'బైకర్' చిత్రంతో యాక్షన్ జానర్‌లోకి అడుగుపెట్టిన ఆయన తన పాత్ర కోసం సరికొత్త మేకోవర్‌తో సిద్ధమయ్యారు. ఇప్పటివరకూ క్యూట్‌గా కనిపించిన శర్వా ఈసారి బాగా సన్నబడడమే కాదు గుర్తుపట్టలేనంతగా మారిపోయారు. ఈ సినిమాలోని రేసర్ పాత్ర కోసం కఠినమైన ఆహార నియమాలు పాటించి బరువు తగ్గారు. షర్ట్ లేకుండా శర్వానంద్ దిగిన ఫొటోలను చిత్రబృందం షేర్ చేయగా, 'గుర్తుపట్టలేనంతగా మారిపోయారు, మీ డెడికేషన్‌కు హ్యాట్సాఫ్' అంటూ అభిమానులు శర్వానంద్‌ను ప్రశంసిస్తున్నారు.



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శుక్రవారం ఆయన నివాసంలో హీరో నారా రోహిత్ కలిశారు. శుభలేఖ అందజేసి, ఈ నెల 30న జరిగే తన పెళ్లికి రావాలని ఆహ్వానించారు.



సినీ కార్మికుల సమస్యలపై త్వరలో ప్రభుత్వానికి నివేదిక

- ఎఫ్‌డిసి ఛైర్మన్ దిల్‌రాజు

సినీ కార్మికుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం వేసిన కమిటీ తొలి సమావేశం శుక్రవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని తెలంగాణ కార్మిక కమిషనర్ కార్యాలయంలోని బోర్డు మీటింగ్ హాల్‌లో జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర కార్మిక అదనపు కమిషనర్ డా. ఇ. గంగాధర్, ఎఫ్‌డిసి ఛైర్మన్ దిల్‌రాజు, సినీ కార్మికుల సంఘం అధ్యక్షుడు అనిల్ వల్లభనేని, నిర్మాతలు సుప్రియ, దామోదరప్రసాద్, ఫిల్మ్ ఛాంబర్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దిల్‌రాజు మాట్లాడుతూ కమిటీ తొలి సమావేశం ఈ రోజు జరిగిందని వారం రోజుల్లో నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. చర్చలు సానుకూలంగా జరిగాయన్నారు. గతంలో 30 శాతం వేతన పెంపు డిమాండ్‌తో మొదలైన సినీ కార్మికుల సమ్మె 22.5 శాతం వేతన పెంపు అంగీకారంతో ముగిసిన విషయం విదితమే. కార్మిక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ పర్యవేక్షణలో ఏర్పాటైన కమిటీ మిగిలిపోయిన చిన్న చిన్న సమస్యల పరిష్కారం కోసం గాను ఈ రోజు సమావేశమైంది. గంగాధర్ మాట్లాడుతూ మరో రెండు మూడు సార్లు కమిటీ సమావేశం జరుగుతుందని చెప్పారు.

చిక్కడపల్లి (ఆంధ్రజ్యోతి)

అటవీ భూముల పరిష్కారానికి అధికారులుగా అదనపు కలెక్టర్లు

» అటవీ భూముల రక్షణలో కీలకం.. ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అటవీ భూముల సమస్యల పరిష్కారానికి అధికారులుగా అదనపు కలెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తెలంగాణ అటవీ చట్టం-1967లోని సెక్షన్4(1)(సీ)ప్రకారం ఈ కొత్త నియామకాలు చేపట్టినట్లు శుక్రవారం జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. అటవీ భూముల సమస్యలకు సెటిల్మెంట్ అధికారులుగా ఇప్పటివరకు వ్యవహరించిన జాయింట్ కలెక్టర్ల పోస్టులు రద్దయిన నేపథ్యంలో, అదనపు కలెక్టర్లకు(రెవెన్యూ) ఆ బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. గతంలో అటవీ సర్వే, సరిహద్దుల విషయంలో తీసుకునే నిర్ణయాలకు సంబంధించిన పనులను జాయింట్ కలెక్టర్లు నిర్వహించేవారు. అటవీ భూభాగాలకు సంబంధించిన అభ్యంతరాలు స్వీకరించి, పరిశీలించడంతో పాటు, రిజర్వ్ ఫారెస్ట్‌గా ప్రకటించే విధానంలో కీలక పాత్ర పోషించారు. తాజాగా ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ చేసిన సిఫార్సుల మేరకు అటవీ భూముల సెటిల్మెంట్ పనులు తక్షణమే అదనపు కలెక్టర్లకు అప్పగించాలని ప్రభుత్వం ఆదేశించింది. సంబంధిత మార్పులతో కూడిన నోటిఫికేషన్‌ను ఈ నెల 31న విడుదల చేయనున్నారు. ఆ రోజునుంచే అదనపు కలెక్టర్ల నియామక ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని జీవోలో పేర్కొన్నారు.

ఎస్ఎల్‌బీసీ ప్రమాదంపై 4 వారాల్లో నివేదికివ్వాలి

» సీఎస్‌కు ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆదేశం

హైదరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం లెఫ్ట్ బ్యాంకు కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ ప్రమాదంపై నాలుగు వారాల్లో నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) ఆదేశించింది. గత ఫిబ్రవరి 22న టన్నెల్ పైకప్పు కూలిపోవడంతో 8 మంది చిక్కుకుపోగా, మనోజ్‌కుమార్, గుర్‌ప్రీత్‌సింగ్ మృతదేహాలను వెలికి తీశారు. ప్రమాదం జరిగి 8 నెలలవుతున్నా గల్లంతైన మిగతా ఆరుగురు కార్మికుల సమాచారం కనుగొనలేదని ఎన్‌హెచ్‌ఆర్‌సీలో మానవ హక్కుల న్యాయవాది ఇమ్మనేని రామారావు పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై విచారించి సమగ్ర నివేదికను సమర్పించాలని గత జూలై 31న నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శిని ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆదేశించింది. అయితే, నీటి పారుదలశాఖ ముఖ్య కార్యదర్శి నివేదిక సంతృప్తికరంగా లేదని పేర్కొన్న ఎన్‌హెచ్‌ఆర్‌సీ.. తక్షణమే దీనిపై విచారణ జరిపి, 4 వారాల్లో నివేదిక సమర్పించాలని ఈనెల 19న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది.

చంచల్‌గూడ జైలులో డాక్టర్ నమ్రత విచారణ

సైదాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సృష్టి ఫెర్టిలిటీ కేసులో రిమాండ్‌పై చంచల్‌గూడ మహిళా జైలులో ఉన్న కీలక నిందితురాలు డాక్టర్ నమ్రతను శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు విచారించారు. తొలిరోజు సంతోషిని, రెండో రోజు కల్యాణి వాంగ్మూలాలు నమోదు చేసిన ఈడీ అధికారులు.. మూడోరోజు నమ్రతను ప్రశ్నించారు. ఈడీ అసిస్టెంట్ డైరెక్టర్ ఆధ్వర్యంలో విచారణాధికారి, ఇద్దరు సిబ్బందితో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విచారణ కొనసాగింది.

జాబ్ మేళాలతో 11 వేలమందికి ఉద్యోగాలు

» సింగరేణి యాజమాన్యం

హైదరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మధిర, వైరా, గోదావరిఖని, భూపాలపల్లి పట్టణాల్లో సింగరేణి సౌజన్యంతో నిర్వహించిన మెగా జాబ్ మేళాలతో 11 వేలమందికి పైగా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభించాయని యాజమాన్యం వెల్లడించింది. ఇదే ఒరవడితో శనివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్, ఆదివారం ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో, మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో మెగా జాబ్ మేళాలు నిర్వహించనున్నట్లు సింగరేణి యాజమాన్యం తెలిపింది. ఈ మేళాల్లో సుమారు 200 కంపెనీలు వారి స్టాళ్ల ఏర్పాటు చేసుకొని ఇంటర్వ్యూలు జరుపుకొనేందుకు సౌకర్యాలను కల్పిస్తున్నారు. ఏడో తరగతి నుంచి డిగ్రీ, పీజీ, డిప్లొమా, ఇంజనీరింగ్ వంటివి చదివిన వారికి తగిన ఉద్యోగం కల్పించడానికి ఈ జాబ్ మేళాల్లో అవకాశం కల్పిస్తున్నారని తెలిపింది.

12.65 కోట్ల సాహితీ ఇన్‌ఫ్రా ఆస్తులు జప్తు

» ఒక్క డైరెక్టర్ పూర్ణచంద్రరావు 126 కోట్ల దారి మళ్లింపు

» 21 ఆస్తుల కొనుగోళ్లు.. నిర్ధారించిన ఈడీ

హైదరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సాహితీ ఇన్‌ఫ్రా స్కామ్ కేసులో ఆ సంస్థ డైరెక్టర్ పూర్ణచంద్రరావుకు చెందిన రూ.12.65 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు అటాచ్ చేశారు. ఇప్పటికే ఈ కేసులో పూర్ణచంద్రరావును ఈడీ అరెస్టు చేసింది. ఇళ్ల ప్లాట్లు ఇస్తామని వేలాది మంది ఖాతాదారుల నుంచి రూ.వేల కోట్లు వసూలు చేసిన సాహితీ ఇన్‌ఫ్రా కంపెనీపై గతంలో హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు నమోదు చేసిన కేసు ఆధారంగా ఈడీ అధికారులు రంగంలోకి దిగారు. ఈ కంపెనీ తన ఖాతాదారులకు సుమారు రూ.845 కోట్ల బకాయి పడిందని నిర్ధారించారు. సంస్థ డైరెక్టర్‌గా పూర్ణచంద్రరావు ఒక్కరే సుమారు రూ.126 కోట్లు దారి మళ్లించి.. ఆ సొమ్ముతో 21 ఆస్తులు కొనుగోలు చేసినట్లు ఈడీ గుర్తించింది. ఇలా ఖాతాదారుల డబ్బులతో సాహితీ ఇన్‌ఫ్రా డైరెక్టర్లు కొనుగోలు చేసిన అక్రమాస్తులను జప్తు చేశారు.

బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్‌లో మరో 150 సీట్లు

» వ్యవసాయ వర్సిటీ ఉపకులపతి వెల్లడి

రాజేంద్రనగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో ఈ ఏడాది నుంచి బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్‌లో మరో 150 సీట్లు అందుబాటులోకి రానున్నాయని వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తెలిపారు. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ విశ్వవిద్యాలయానికి మూడు నూతన వ్యవసాయ కళాశాలలను మంజూరు చేసిందన్నారు. ఇందులో భాగంగా హుజూర్‌నగర్‌లో ఏర్పాటు కానున్న కళాశాలలో 30 సీట్లు, కొడంగల్‌కు వచ్చే కళాశాలలో 30 సీట్లు, నిజామాబాద్‌లో ఏర్పాటయ్యే కళాశాలలో 30 సీట్లు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. ఇదివరకే ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ సీట్ల భర్తీకి త్వరలో ప్రత్యేకంగా కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. కాగా మహాత్మా జ్యోతిరావు పూలే తెలంగాణ వెనుకబడిన సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ ఆర్థిక సహకారంతో తెలంగాణ ఎప్‌సెట్-2025లో అర్హత సాధించిన వెనుకబడిన తరగతుల విద్యార్థులకు బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్‌లో మరో 60 సీట్లను ఈ విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి తీసుకురానున్నట్లు జానయ్య తెలిపారు. ఈ సీట్లను రాజేంద్రనగర్, వరంగల్, జగిత్యాల, పాలెం, సిరిసిల్ల, అశ్వారావుపేట్ కళాశాలల్లో ఒక్కో కళాశాలలో 10 సీట్ల చొప్పున భర్తీ చేయనున్నట్లు చెప్పారు. వీటిలో ప్రవేశాల కోసం ug.mjptbcwreis.net, pjtau.edu.in వెబ్‌సైట్‌లలో ఈ నెల 29వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

గన్స్ ఉపయోగించినవారిపై చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఓ సిమెంట్ కంపెనీ యాజమాన్యం వద్ద డబ్బుల వసూళ్ల వ్యవహారంలో గన్స్ ఉపయోగించినవారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ ఎన్. నవీన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాన అనుచరుడు రోహిన్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ, మాజీ ఓఎస్‌డీ సుమంత్ గన్స్ ఉపయోగించిన వివాదంలో ఉన్నారని, ఈ మేరకు శుక్రవారం ఆయన బీఆర్‌ఎస్ నేతలు జైపాల్‌యాదవ్, కిశోర్‌గౌడ్, నగేశ్ ముదిరాజ్‌తో కలిసి జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నవీన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. గన్ కల్చర్ తెచ్చి రాష్ట్రాన్ని మరో బిహార్‌లా తయారు చేయాలని రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని, అక్రమాలు, అరాచకాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రానికి అనేక రకాల పరిశ్రమలు తెచ్చి అభివృద్ధి చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వంలో కొత్త వాటిని తేకపోగా ఉన్న పరిశ్రమల యాజమాన్యాలను బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.

అపజయాలకు వెరవవద్దు

» గుర్తింపు కోసం పాకులాడవద్దు.. మన శ్రమే మనకు గుర్తింపు తెస్తుంది

» చీనాబ్ బ్రిడ్జి ఫేమ్ ప్రొఫెసర్ మాధవీలత

» నిట్ టెక్నోజియాన్ ప్రారంభ కార్యక్రమంలో ప్రసంగం



సమావేశంలో ప్రసంగిస్తున్న మాధవీలత

హనుమకొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మన జీవితం.. మన వ్యక్తిత్వం విశాలం కావాలంటే మన చుట్టూ ఉన్న హద్దులను చెరిపేసుకోవాలని, అదే సమయంలో మన పరిమితులేమిటో కూడా గుర్తెరగాలని ప్రపంచంలోకెల్లా అత్యంత ఎత్తైన చీనాబ్ వంతెన నిర్మాణంలో క్రియాశీల భూమిక పోషించిన బెంగళూరు ఐఐఎస్‌సీ ప్రొఫెసర్ జి. మాధవీలత పిలుపునిచ్చారు. వరంగల్ నిట్‌లో టెక్నోజియాన్-2025 ప్రారంభోత్సవ కార్యక్రమానికి శుక్రవారం ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి సాంకేతికోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అపజయాలకు ఎవరూ వెరవవద్దన్నారు. అపజయం వెంట విజయం ఎప్పుడూ ఉంటుందని, మనం చేయాల్సిందల్లా దాని వెంట పరుగు తీయడమేనన్నారు. జీవితంలో ఉన్నతంగా రాణించాలని అందరూ అనుకుంటారని, కానీ తమ చుట్టూ ఉన్న అడ్డంకులను చూసి కుంగిపోతారని పేర్కొన్నారు. లక్ష్యసాధన దిశగా ముందడుగు వేయాలంటే ముందు ఆ అడ్డంకులను ఛేదించుకొని తమను తాము విస్తరించుకోవాలని సూచించారు. గుర్తింపు కోసం వెంపర్లాడవద్దన్నారు. ఎవరూ మిమ్మల్ని గుర్తించకపోయినా చేయాల్సిన పని చేసుకుంటూపోతే గుర్తింపు తప్పనిసరిగా లభిస్తుందని తెలిపారు. ఇందుకు తానే ప్రత్యక్ష ఉదాహరణగా పేర్కొన్నారు. వరంగల్ ఆర్ఈసీలో(ప్రస్తుతం నిట్) చదువుకున్న తాను.. గుర్తింపు కోసం ఏనాడూ పాకులాడలేదన్నారు. చీనాబ్ వంతెన నిర్మాణం పూర్తయ్యాక అందులో తన పాత్రేమిటో తెలిసిన తర్వాత అందరూ తనను ప్రత్యేకంగా గుర్తించడం మొదలుపెట్టారని చెప్పారు. తాను ఎంటెక్ చదివిన వరంగల్ నిట్‌ను సైతం ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నారని పేర్కొన్నారు. వరంగల్ నిట్‌లో చదువుకున్నప్పటికీ పూర్వ విద్యార్థిగా ఇప్పటి వరకు పేరు నమోదు చేసుకోలేదని, చీనాబ్ వంతెన నిర్మాణం తర్వాత కళాశాల యాజమాన్యం పలుమార్లు ఆలమ్నీగా రిజిస్టర్ కావలసిందిగా కోరిందని తెలిపారు. వరంగల్ నిట్ ఒక అద్భుతమైన విద్యా కేంద్రంగా మాధవీలత అభివర్ణించారు. వరంగల్ నిట్ తనకు జీవితంతోపాటు జీవిత భాగస్వామిని కూడా ఇచ్చిందని ధన్యవాదాలు తెలిపారు. తన భర్త ఇదే కళాశాలలో ఎంటెక్(మెకానికల్) చేశారని, ప్రస్తుతం గూగుల్‌లో కీలక పదవిలో ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి, సాంకేతిక ప్రధాన కార్యదర్శి డాక్టర్ యు.వెంకన్న, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ డాక్టర్ కె.కిరణ్‌కుమార్, ఫ్యాకల్టీ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ పి.రాధాక్రిష్ణ పాల్గొన్నారు.

డ్రైవర్ దగ్గర అలారం ఉండాలి

» తలుపు ఆటోమాటిక్‌గా తెరుచుకోవాలి

» వెనుక మరో ఆటోమాటిక్ డోర్ ఉండాలి

» అగ్నినిరోధక పదార్థాలతో బస్సు నిర్మించాలి

» ధర తక్కువని ఫోమ్ పరుపులు వాడారు

» తప్పించుకొనే వ్యవస్థలపై ప్రయాణికులకు అవగాహన కల్పించాలి

» రవాణా శాఖ మాజీ అధికారి గాంధీ



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు బస్సు ప్రమాదాలు చాలావరకూ మానవ తప్పిదాల వల్లే తలెత్తుతున్నాయని మాజీ ఆర్టీఏ అధికారి సీఎల్ఎన్ గాంధీ అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సుదీర్ఘకాలం అదనపు కమిషనర్‌గా సేవలు అందించిన గాంధీ శుక్రవారం వేమూరి కావేరీ ట్రావెల్స్ ప్రమాదంపై 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. బస్సు లోపల సరైన రక్షణ వ్యవస్థ ఏర్పాటు చేసుంటే ఇంతగా ప్రాణ నష్టం జరిగేది కాదన్నారు. ఏఐఎస్ 15 నియమ నిబంధనల ప్రకారం అనుకోని ప్రమాదం సంభవించినప్పుడు ప్రయాణికులను అప్రమత్తం చేయడానికి డ్రైవర్ దగ్గర అలారమ్ బటన్ ఉండాలని చెప్పారు. అలాంటి ఏర్పాటు వేమూరి కావేరీ ట్రావెల్స్ బస్సులో ఉన్నట్లు కనబడటం లేదన్నారు. బస్సు బాడీ నిర్మాణంలోనూ అగ్ని నిరోధక పదార్థాలు వాడాలని, అలాంటి జాగ్రత్తలేవీ తీసుకోలేదని వివరించారు. ముందు భాగంలోని తలుపులు ఆటోమేటిక్‌గా తెరుచుకోవాలని, అద్దాలు పగలగొట్టడానికి ప్రతి కిటికీ దగ్గర ఒక హ్యామర్ ఉంచాలని చెప్పారు. అత్యవసర తలుపులు సులభంగా తెరుచుకునేలా చూడాలని అన్నారు. బస్సు లోపలి భాగంలో మంటలను అదుపు చేసే పరికరాలుంచాలని తెలిపారు. అవేవీ లేవు కనుకే ఈ దుర్ఘటనలో ప్రాణ నష్టం ఎక్కువ జరిగిందన్నారు. ఈ నేరంలో బస్సు యాజమాన్యం, అధికార వ్యవస్థ, అసమగ్ర చట్టం మూడూ దోషులేనని వ్యాఖ్యానించారు. ఖర్చు తగ్గించుకోవడంలో భాగంగా ప్రయాణికుల ప్రాణ రక్షణకు అవసరమైన సౌకర్యాలను బస్సు యాజమాన్యాలు ఏర్పాటు చేయడం లేదని చెప్పారు.

- వె ా టా ర ం వాహనాల చట్టం ప్రకారం ముఖ్యంగా ప్రతి స్లీపర్ బస్సులో తగినన్ని అగ్నిమాపక యంత్రాలు అమర్చాలి. అత్యవసర ద్వారం సరైన స్థానంలో ఏర్పాటు చేయాలి. ప్రమాద సమయంలో ఆటోమేటిక్‌గా తెరుచుకొనే విధంగా ముందు, వెనుక భాగాల్లో రెండు ద్వారాలు ఉండాలి. అలారమ్ బటన్ కూడా తప్పనిసరి. వీటిని అస్సలు పట్టించుకోవడం లేదు. ధర తక్కువ కనుక ఫోమ్ బెడ్‌లు, కర్టెన్లు వాడుతున్నారు. అవి మంటల తీవ్రతను పెంచుతున్నాయి. ప్రయాణికులను అప్రమత్తం చేయడం డ్రైవర్ బాధ్యత. అందుకు వారికి తగిన అవగాహన, శిక్షణ అవసరం. ప్రయాణికులకు కూడా ప్రమాద సమయాల్లో ఎలా బయటపడాలని చెప్పే సమాచారం పోస్టర్ల రూపంలో బస్సులో ఉంచాలి. ఎక్కడెక్కడ డోర్లు ఉన్నాయి, ఎలా బయటపడాలని వివరించే బస్ ఇంటర్నల్ మ్యాప్ ఉంచాలి. విమానాల తరహాలో బస్సుల్లోనూ జాగ్రత్తలు ప్రయాణానికి ముందు చెప్పాలి.
- వేమూరి కావేరీ ట్రావెల్స్ బస్సు డయ్యూ డామన్‌లో రిజిస్ట్రేషన్ చేశారు. ఫిట్‌నెస్, పర్మిట్ అనుమతులు అక్కడే తీసుకున్నారు. తిరిగేది హైదరాబాద్, బెంగళూరు మధ్య. ఆ బస్సును తనిఖీ చేసే అవకాశం ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు లేదు. రవాణా చట్టంలో ఇదో పెద్ద లోపం. తెలుగు రాష్ట్రాలలో అధికారులు పూర్తిగా పరీక్షించిన తర్వాతే అనుమతులు జారీ చేస్తారు కనుక నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్ తదితర రాష్ట్రాలలో రిజిస్ట్రేషన్ చేయించి, ఇతర అనుమతులు తెచ్చుకుంటున్నారు. బస్సు పరీక్షించడం, తనిఖీ చేయడం లాంటివేవీ లేకుండా కేవలం డబ్బు చెల్లిస్తే అనుమతి పత్రాలు పంపించే సంస్కృతి అక్కడ ఉంది. ఈ మూడు రాష్ట్రాల వారు తనిఖీ చేయబోయినా అసలు నీవు ఎవరు చెక్ చేయడానికి అని డ్రైవర్లు దబాయించే పరిస్థితి ఉంది.
- మూడు నెలలకు ఒకసారైనా బస్సును రిజిస్టర్ చేసిన రాష్ట్రానికి తీసుకెళ్లాలని రవాణా చట్టంలో నిబంధన ఉండేది. రాజకీయ పలుకుబడితో దాన్ని తొలగించారు. హైదరాబాద్‌లో ఉంటూ అన్ని అనుమతులు తెప్పించుకుంటారు. ఉన్నాయా లేవా? అని తనిఖీ చేసే అధికారం తెలంగాణ అధికారులకు ఉన్నప్పటికీ జిల్లాకు ఇద్దరే బ్రేక్ ఇన్‌స్పెక్టర్లు ఉండటం, ట్రావెల్స్ బస్సులు రాత్రిపూట మాత్రమే రోడ్డు మీదకు రావడంతో పెద్దగా పట్టించుకోవడం లేదు. సీసీ కెమెరాలు చూసి చలానాలు రాసే పరిస్థితి నెలకొంది. ఒక వాహనం ఫిట్‌నెస్ చెక్ చేయడానికి సరైన సాధన సామగ్రి తెలంగాణ అధికారుల దగ్గర లేకపోవడంతో వేరే రాష్ట్రాల నుంచి పోస్టులో తెప్పించుకున్న సర్టిఫికెట్లను చూసి వదిలేయాల్సి వస్తోంది. ఆర్టీసీలో స్లీపర్ బస్సులపై నిరంతర పర్యవేక్షణ వల్ల ఇలాంటి ప్రమాదాలు తలెత్తిన దాఖలాలు లేవు.
- ప్రైవేటు బస్సుల యజమానులతో ఆర్టీఏ అధికారులు నిరంతరం సమావేశాలు నిర్వహించి, నిబంధనలు పాటించడం మీద కచ్చితమైన మార్గనిర్దేశాలు జారీ చేయాలి. రూల్స్ అతిక్రమిస్తే కఠిన చర్యలుంటాయన్న స్పృహ కలిగించాలి. వాళ్ల వ్యాపారాలు వాళ్లు, వీళ్ల ఉద్యోగాలు వీళ్లు చేసుకొంటామంటే కర్నూలు తరహా విషాదాలు కొనసాగుతూనే ఉంటాయి. ప్రతి బస్సుకు నియమ నిబంధనల ప్రకారం చెక్ లిస్టు సిద్ధం చేయాలి. అవన్నీ ఉన్నాయని ధ్రువీకరణ అయ్యాకే బస్సు రోడ్డు ఎక్కేలా చూడాలి.

బీసీలంటే కేసీఆర్‌కు అంత చులకనా?

» బీసీ బిడ్డ నవీన్ యాదవ్‌ను లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించాలి: బీర్ల

» తెలంగాణకు, కేటీఆర్‌కు ఏంటి సంబంధం?: మందుల సామేలు

» హరీశ్.. బాకీ కార్డులపై బహిరంగ చర్చకు సిద్ధమా?: బల్మూరి

హైదరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): 'జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి, బీసీ బిడ్డ అయిన నవీన్ యాదవ్‌ను రౌడీషీటర్ అంటూ కేసీఆర్ అవమానించాడు. బీసీలంటే ఆయనకు అంత చులకనగా కనిపిస్తున్నారా?' అంటూ ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ప్రశ్నించారు. ఉప ఎన్నికలో నవీన్ యాదవ్‌ను లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించి.. బీసీలను రౌడీలుగా చూపించే ప్రయత్నం చేస్తున్న కేసీఆర్, కేటీఆర్‌లకు తగిన బుద్ధి చెప్పాలని శుక్రవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. నవీన్ యాదవ్‌కు కేసీఆర్ తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ నేపథ్యమే లేని కేటీఆర్‌కు, తెలంగాణకు ఏంటి సంబంధమని ఎమ్మెల్యే మందుల సామేలు ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ అంటే బొందలగడ్డ పార్టీ అంటూ ధ్వజమెత్తారు. గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణను దోచుకున్న కల్వకుంట్ల కుటుంబమే దండుపాళ్యం ముఠా అని.. నమ్ముకున్నవారిని నట్టేట ముంచిన చరిత్ర ఆ కుటుంబానిదని దుయ్యబట్టారు. బాకీ కార్డుల పేరుతో హడావుడి చేస్తున్న హరీశ్ రావు.. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలకు బాకీ పడ్డ హామీలను గురించి మరిచిపోయారా అంటూ కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ నిలదీశారు. బాకీ కార్డులు, బీఆర్‌ఎస్ పదేళ్ల పాలన.. కాంగ్రెస్ రెండేళ్ల పాలనపై ప్రజల సమక్షంలో చర్చకు సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. పదేళ్లు అధికారంలో ఉండి కూడా ఉద్యోగాలు భర్తీ చేయని బీఆర్‌ఎస్‌కు, హరీశ్‌కు నిరుద్యోగుల గురించి మాట్లాడే అర్హత ఎక్కడిదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్‌గౌడ్ ప్రశ్నించారు. వారు ఉద్యోగాలు ఇవ్వలేదు కాబట్టే నిరుద్యోగులు ఆ పార్టీని ఓడించారని ఓ ప్రకటనలో విమర్శించారు.

బీసీలకు 42% రిజర్వేషన్లు చట్టబద్ధంగా ఇవ్వాల్సిందే

» బీసీల మహాధర్నాలో జస్టిస్ ఈశ్వరయ్య డిమాండ్

» ధర్నాలో పాల్గొన్న పలు బీసీ సంఘాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు

కవాడిగూడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బీసీలకు చట్టబద్ధంగా 42% రిజర్వేషన్లు కల్పించకపోతే కేంద్రంపై యుద్ధం ప్రకటిస్తామని పలువురు బీసీ సంఘాల నేతలు, రాజకీయ పార్టీల నేతలు హెచ్చరించారు. రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీల జనాభా నిష్పత్తికి అనుగుణంగా వారికి ప్రాతినిధ్యం లేదన్నారు. రాజకీయంగా బీసీలకు రిజర్వేషన్లు లేకపోవడంతో చట్టసభల్లో వారి ఉనికి నామమాత్రంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ధర్నాచౌక్ వద్ద '42% బీసీ రిజర్వేషన్ల సాధన సమితి' ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు జస్టిస్ ఈశ్వరయ్య, పలువురు రాజకీయ పార్టీల నేతలు, బీసీ సంఘాల నేతలు హాజరై మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ.. బీసీలకు రాజ్యాధికారం ద్వారానే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. బీసీలకు చట్టబద్ధంగా 42% రిజర్వేషన్లు ఇవ్వాలని, పార్టీ పరంగా కాదని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. "రిజర్వేషన్లు బీసీల హక్కు" అని అన్నారు. బీసీలను పాలక వర్గాలు బిచ్చగాళ్లుగా చూస్తున్నాయని ఎమ్మెల్సీ మధుసూదనాచారి మండిపడ్డారు. గవర్నర్ వ్యవస్థను అడ్డుపెట్టుకొని కేంద్రం బీసీలను మోసం చేస్తోందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ.. బీసీలకు 42% రిజర్వేషన్ల కల్పన కోసం కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్‌కు కట్టుబడి ఉందని చెప్పారు. బీసీ రిజర్వేషన్లను కేంద్రం అడ్డుకుంటోందని మాజీ ఎంపీ హనుమంతరావు ఆరోపించారు. రిజర్వేషన్ల సాధన కోసం బీసీలంతా ఐక్యంగా పోరాటం చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. నవంబరు 10 నుంచి 30వ తేదీ వరకు కామారెడ్డి నుంచి రాష్ట్రవ్యాప్తంగా బీసీ చైతన్య యాత్రలు చేపడుతున్నట్లు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు వెల్లడించారు. ఈ ఉద్యమాన్ని ఎవరూ ఆపలేరని బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాల్‌రాజ్‌గౌడ్ అన్నారు.

నేటినుంచి కవిత జనం బాట

హైదరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజల మనోగతం తెలుసుకునేందుకుగాను అన్ని వర్గాలవారిని కలిసేందుకుగాను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత శనివారం నుంచి జాగృతి జనం బాట కార్యక్రమం చేపట్టనున్నారు. ఫిబ్రవరి 13వరకు 4 నెలలపాటు చేపట్టనున్న జనంబాట కార్యక్రమాన్ని నిజామాబాద్ నుంచి ఆమె ప్రారంభించనున్నారు. నేడు అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్ పార్క్ అమరవీరుల స్తూపంవద్ద నివాళులర్పించిన అనంతరం ఆమె నిజామాబాద్ బయలుదేరి వెళ్లనున్నారు. ప్రజల అభిప్రాయాలను తెలుసుకొని వారిచ్చే సలహాలు, సూచనల ఆధారంగానే తన భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని ఇప్పటికే కవిత పేర్కొన్నారు.

ఆరో తరగతి విద్యార్థిపై తొమ్మిదో తరగతి విద్యార్థుల లైంగిక దాడి

» నిర్మల్ జిల్లాలోని మస్కాపూర్ బీసీ సంక్షేమ హాస్టల్‌లో ఘటన

ఖానాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆరో తరగతి చదువుతున్న విద్యార్థిపై తొమ్మిదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు లైంగిక దాడికి పాల్పడ్డారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్ బీసీ విద్యార్థి వసతి గృహంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మస్కాపూర్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న కొందరు విద్యార్థులు స్థానిక బీసీ సంక్షేమ వసతి గృహంలో ఉంటున్నారు. తొమ్మిదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు ఆరో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని ఈ నెల 21వ తేదీన అర్ధరాత్రి నిద్రలేపి వసతిగృహం పక్కకు తీసుకెళ్లారు. అక్కడ ఆ విద్యార్థిపై లైంగిక దాడికి పాల్పడ్డారు. విషయాన్ని బాధిత విద్యార్థి తన కుటుంబసభ్యులకు తెలుపగా వారు విద్యార్థిని పాఠశాల నుంచి టీసీ తీసుకుని, హాస్టల్ ఖాళీ చేయించి తీసుకెళ్లారు. లైంగిక దాడి ఘటనను తోటి విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బోనగిరి నరేందర్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. జరిగిన ఘటనపై ఆందోళన చెందిన ప్రధానోపాధ్యాయుడు హాస్టల్ వార్డెన్ ప్రకాశ్‌ను ఆరా తీశారు. ఈ వికృత చేష్టలకు పాల్పడిన ఇద్దరు విద్యార్థుల కుటుంబసభ్యులను పిలిపించి జరిగిన విషయాన్ని వివరించి వారిద్దరికీ ఈ నెల 23న టీసీ ఇచ్చి పంపించారు. సదరు వసతి గృహంలో, పాఠశాలలో ఇటువంటి ఘటనలు పలుమార్లు చోటుచేసుకున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో ఎలుకల బెడద

» ఎనిమిది మంది విద్యార్థినుల కాళ్లు కొరికిన ఎలుకలు

» మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం నారాయణపూర్‌లో ఘటన

నర్సాపూర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం నారాయణపూర్ గిరిజన బాలికల గురుకులంలో ఎలుకల బెడద తీవ్రంగా మారింది. 8 మంది విద్యార్థినుల కాళ్లను ఎలుకలు కొరికాయి. గాయపడిన విద్యార్థినులకు గురుకులం సిబ్బంది నర్సాపూర్ ఏరియా ఆసుపత్రిలో చికిత్స చేయించారు. నారాయణపూర్ సమీపంలోని ఓ ప్రైవేటు భవనంలో గిరిజన బాలికల గురుకుల పాఠశాల కొనసాగుతోంది. ఇక్కడ 540 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. ప్రైవేటు భవనం కావడంతో చాలీచాలని గదులు, అరకొర సౌకర్యాలతో విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గురుకుల పాఠశాల భవనం సమీపంలో పొలాలు ఉండటంతో ఎలుకల బెడద తీవ్రంగా ఉంది. భవనంలో ఎలుకలు, కోతులు, పాములతో తరుచూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని గురుకులం ప్రిన్సిపాల్ లలితాదేవి ఆవేదన వ్యక్తం చేశారు.

వంగర గురుకుల పాఠశాల విద్యార్థిని ఆత్మహత్య

» ప్రిన్సిపాల్, సిబ్బంది ఒత్తిడే కారణమని విద్యార్థిని తల్లిదండ్రుల ఆరోపణ

భీమదేవరపల్లి(ఎల్కతుర్తి), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర పీవీ రంగారావు బాలికల గురుకులంలో పదో తరగతి విద్యార్థిని (15) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన విద్యార్థిని నాలుగు సంవత్సరాల క్రితం గురుకుల పాఠశాలలో ప్రవేశం పొందింది. వారంరోజుల క్రితం అనారోగ్యంతో ఇంటికి వెళ్లిన విద్యార్థిని.. గురువారం తిరిగి పాఠశాలకు వచ్చింది. శుక్రవారం ఉదయం విద్యార్థులతో కలిసి టిఫిన్ చేసిన అనంతరం తాను నిద్రించే డార్మెంటరీ హాల్‌లో ఉరి వేసుకుంది. తరగతులకు హాజరుకాకపోవడంతో అనుమానం వచ్చిన తోటి విద్యార్థులు అక్కడకు వెళ్లి చూడగా అప్పటికే విగతజీవిగా కనిపించింది. విషయం తెలుసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్ హనుమకొండ జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని ఆదేశించారు. కాగా, తమ కూతురు ఆత్మహత్యకు పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది ఒత్తిడే కారణమని విద్యార్థిని తల్లిదండ్రులు ఆరోపించారు. ఇటీవల విద్యార్థినుల తల్లిదండ్రులు హాస్టల్‌కు వచ్చినప్పుడు వారి పిల్లల్ని కలిసేందుకు అవకాశం ఇవ్వలేదన్నారు. దీంతో మనో ధైర్యం కోల్పోయి తమ కూతురు ఆత్మహత్యకు పాల్పడిందని వారు అన్నారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్కతుర్తి సీఐ పులి రమేశ్ తెలిపారు.

పిల్లలను వదిలి వెళ్లిందనే కసితో.. భార్యను హతమార్చిన భర్త

» గొడ్డలితో నరికి చంపిన వైనం

» ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలంలో ఘటన



వర్ధని (ఫైల్)

ఏన్కూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తనను, ముగ్గురు పిల్లలను వదిలేసి వేరే వ్యక్తితో సహజీవనం చేస్తోందన్న కోపంతో ఓ భర్త గొడ్డలితో భార్యను హతమార్చాడు. ఈ దారుణం ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం కాలనీనాచారం గ్రామంలో శుక్రవారం జరిగింది. కాలనీనాచారానికి చెందిన తాటి రామారావుకు అదే గ్రామానికి చెందిన వర్ధని (32)తో 16 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు సంతానం. ఈ క్రమంలో వర్ధని అదే గ్రామానికి చెందిన అఖిల్ అనే వ్యక్తితో సన్నిహిత సంబంధం పెట్టుకుని, ఏడాది క్రితం భర్త, పిల్లలను వదిలి విజయవాడ వెళ్లి సహజీవనం సాగించింది. పెద్దమనుషులు, గ్రామస్థుల సమక్షంలో పంచాయితీ చేసి హెచ్చరించినా ఆమెలో మార్పు రాలేదు. మళ్లీ ఆరు నెలలుగా అఖిల్‌తో సత్తుపల్లి సమీపంలో సహజీవనం చేస్తోంది. ఈనెల 22న (బుధవారం) వర్ధని అఖిల్‌తో కలిసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లిలోని కస్తూర్బా పాఠశాలలో చదువుతున్న కుమార్తెను చూసేందుకు వెళ్లింది. ఈ విషయం తెలుసుకున్న భర్త రామారావు అక్కడికి వెళ్లి అఖిల్‌తో గొడవపడ్డాడు. అనంతరం అఖిల్‌కు చెందిన ద్విచక్ర వాహనాన్ని బలవంతంగా లాక్కుని, భార్య వర్ధనిని తీసుకుని స్వగ్రామమైన కాలనీనాచారం వచ్చాడు. పిల్లలు పెద్దవారవుతున్నారని,ఇక నుంచి కలిసి ఉందామని నచ్చజెప్పాడు. దానికి వర్ధని నిరాకరించింది. అప్పటికే రాత్రవడంతో అక్కడే ఉన్న ఆమె.. గురువారం కూడా భర్త ఇంట్లోనే ఉంది. భార్యపై కోపం పెంచుకున్న రామారావు శుక్రవారం తెల్లవారుజామున ఇంటి ఆరుబయట నిద్రిస్తున్న వర్ధనిని గొడ్డలితో నరికాడు. తల, ముఖంపై తీవ్ర గాయాలవడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. వర్ధని తల్లి ముక్తి రాధమ్మ ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేసిన పోలీసులు రామారావును అదుపులోకి తీసుకున్నారు.

ఆఖరి ప్రయాణం

మాంసపు ముద్దలై!



కర్నూలు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా బస్సు ప్రమాద ఘటనలో మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోయి మాంసపు ముద్దలుగా మారాయి. ఏ మృతదేహం ఎవరిదో గుర్తించలేని విధంగా ఉన్నాయి. కొన్ని మృతదేహాల శరీర భాగాలు విడిపోయాయి. ప్రమాదం జరిగిన దాదాపు గంట తర్వాత పోలీసు వాహనాలు, అంబులెన్సులు వచ్చాయి. బస్సులో పడి ఉన్న మృతదేహాలను చూస్తే.. ప్రాణాలు కాపాడుకోడానికి తీవ్రంగా ప్రయత్నాలు చేసినట్లు తెలుస్తోంది. బస్సు మధ్యలో కాలిపోయిన శవాలు గుట్టలుగా కనిపించడంతో తొక్కిసలాట జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. బస్సు మొదటి నుంచి చివరి వరకు కాలిపోయిన శవాలే కనిపిస్తున్నాయి. అమ్మ పక్కనే పడుకున్న ఇద్దరు పసిపల్లలు అమ్మతోపాటు మాంసపు ముద్దలుగా మారిన తీరు కన్నీరు తెప్పిస్తోంది. మాంసపు ముద్దలుగా మారిన మృతదేహాలను తీసుకొస్తున్న సిబ్బంది చేతులు రక్తంతో తడిసిపోయాయి. ఓ మృతదేహాన్ని దించుతుండగా.. తలభాగం విడిపోవడంతో మరో వ్యక్తి ఆభాగాన్ని జాగ్రత్తగా తెచ్చి మృతదేహం పక్కనే పెట్టారు.



మంటల్లో కాలిపోతున్న బస్సు

కదిలే శవపేటికలు..!

స్లీపర్ బస్సుల నిర్మాణంలోనే లోపాలు.. సౌకర్యాలు ఘనం.. భద్రత శూన్యం

- ప్రమాదం జరిగితే బయటపడడం కష్టమే
- స్లీపర్ బస్సులను నిషేధించాలంటున్న నిపుణులు

హైదరాబాద్/సిటీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నిన్న రాజస్థాన్‌లో.. నేడు కర్నూలులో.. స్లీపర్ బస్సులు అగ్నికి ఆహుతయ్యాయి. పదుల సంఖ్యలో ప్రజలు సజీవ దహనం అయ్యారు. ఈ నేపథ్యంలో స్లీపర్ బస్సుల భద్రతపై మరో సారి చర్చ మొదలైంది. వారాంతం వచ్చిందంటే చాలు.. హైదరాబాద్ నుంచి విజయవాడ, విశాఖపట్నం, బెంగళూరు.. ఇలా 300-1000 కిలోమీటర్ల దూరాలకు స్లీపర్ బస్సుల్లో ప్రయాణించేవారు ఎంతో మంది. హైదరాబాద్ నుంచి వెళ్లే ప్రతి పది ట్రావెల్స్ బస్సుల్లో 8 స్లీపర్‌లే ఉంటున్నాయి. వాటిలోనూ సీటర్ కమ్ స్లీపర్ బస్సులే ఎక్కువ. అలసట లేకుండా ఎంత దూరమైనా ప్రయాణించవచ్చనే కారణంతో ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. కానీ, నిపుణులు మాత్రం ఈ బస్సులను 'నడిచే శవపేటికలు'గా అభివర్ణిస్తున్నారు. మన రోడ్ల డిజైన్‌కు ఏ మాత్రం సరిపడని మల్టీ యాక్సిల్ బస్సులే కాదు, స్లీపర్ బస్సుల డిజైనింగ్ లోపాలు ప్రయాణికులకు శాపాలని చెబుతున్నారు. దేశవ్యాప్తంగా పలు స్వచ్ఛంద సంస్థలు, నిపుణులు ఈ తరహా బస్సులను నిషేధించాలని డిమాండ్ చేస్తే.. బెదిరింపులు, ఛీత్కారాలు తప్ప ఫలితం లేదని ఆరోపిస్తున్నారు. అధిక శాతం బస్సుల నిర్వాహకులకు రాజకీయ నాయకుల అండదండలు ఉండడమో, వారే ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులు కావడమో దీనికి ప్రధాన కారణం. చైనా, జర్మనీలాంటి దేశాలు ఈ విషయంలో ఆదర్శనీయమని అంటున్నారు. మన దేశంలో ఉన్న పరిస్థితులే చైనాలోనూ ఉన్నాయని, స్లీపర్ క్లాస్ బస్సుల నియంత్రణలో వారు అనుసరించిన విధానం ఆచరణీయమని చెబుతున్నారు.

సౌకర్యాలున్నాయ్.. భద్రతే లేదు..: స్లీపర్ క్లాస్ బస్సులన్నీ కూడా రెండతస్తుల తరహాలో ఉంటాయి. ఒక్కో బస్సులో కనీసం 30 నుంచి 42 సీట్ల వర కూ ఉంటున్నాయి. కొన్నింటిలో ఎక్కువే ఉంటాయి. ఒకప్పు డు మన కంటే అధికంగా స్లీపర్ బస్సులు కలిగిన చైనా ఇప్పుడు వాటిని వదిలించుకోవడానికి కారణం భద్రతా లోపాలే. 2013కు ముందు చైనాలో దాదాపు 37 వేల స్లీపర్ బస్సులు ఉండేవి. కానీ, ఇప్పుడు కొత్తగా ఒక్క స్లీపర్ బస్సు రోడ్డెక్కడం లేదు. ఆ బస్సుల్లోని భద్రతా లోపాలపై కఠిన చర్యలు తీసుకోవడమే దీనికి కారణం. ఈ బస్సుల్లో చాసిస్ కిందకు ఉండడం, బెడ్స్ డిజైన్‌లో లోపాలు, గ్యాంగ్ వే(ప్రయాణికులు నడిచే మార్గం) ఇరుకుగా ఉండడం, అత్యవసర ద్వారాలు తక్కువగా ఉండడం వంటివి ప్రధాన సమస్యలుగా గుర్తించారు. దీనికి తోడు ఈ బస్సుల ఎత్తు ఎక్కువగా ఉండడం, 100-120 కి.మీ. వేగంతో వెళ్లడం, ఏదైనా ఘటన జరిగితే గురుత్వాకర్షణ(సెంటర్ ఆఫ్ గ్రావిటీ) సమస్యల కారణంగా బస్సులోని ప్రయాణికులు విసిరివేసినట్లు పడిపోవడం వంటి ఎన్నో సమస్యలను గుర్తించారు. ఈ బస్సుల్లో అత్యవసర ద్వారాలు లేకపోవడం వల్ల ప్రమాదాల బారిన పడినప్పుడు ప్రయాణికులను కాపాడడం కష్టమే. ఇక ఈ బస్సులు దాదాపు 3 మీటర్ల ఎత్తున ఉండడం వల్ల ప్రమాదం జరిగినప్పుడు లోపల ఉన్నవారు బయటకు దూకడం కూడా కష్టంగానే ఉంటుంది. చైనా దశల వారీగా నిషేధం విధించిన తర్వాత భారత్‌లో కూడా ఆటోమోటివ్ రిసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఏఆర్ఏఐ) 2016లో స్లీపర్ బస్సులకు సంబంధించి కొన్ని నిబంధనలు, ప్రమాణాలను తీసుకొచ్చింది. ఏఆర్ఏఐ మార్గదర్శకాల ప్రకారం.. 2+1 లేఔట్‌ను స్లీపర్ బస్సుల్లో అనుమతించింది. దేశంలో దాదాపు 80% స్లీపర్ లేదంటే హైబ్రిడ్ బస్సులు ఈ లేఔట్‌లోనే ఉన్నాయి. కానీ, నిర్దేశిత ప్రమాణాల ప్రకారం లేవన్నది ఎక్కువ మంది వాదన. మన దేశంలో ఈ బస్సులు సాధారణంగా 12 మీటర్, 13.5, 15 మీటర్ పరిమాణంలో వస్తుంటాయి. స్లీపర్ బస్సుల్లో బెర్త్ కచ్చితంగా 70.8 అంగుళాల పొడవు ఉండాలి. అలాగే 12 మీటర్లలోపు పొడవు కలిగిన బస్సుల్లో కనీసం నాలుగు అత్యవసర ద్వారాలుండాలి. 12 మీటర్లు దాటితే 5 ఉండాలి. వాటిని ప్రతి ఒక్కరూ గుర్తు పట్టేలా ఏర్పాటు చేయాలి. ప్రతి సీటు పక్కన సుత్తిని కూడా ఫిట్ చేసి ఉంచాలి. కానీ, వాటిలో ఏ ఒక్కటీ అమలు కావడం లేదని, పర్యవేక్షణ కూడా లేదని చెబుతున్నారు.

ఇతర దేశాల్లో ఎలా ఉందంటే..

జర్మనీలో 2006లోనే స్లీపర్ కోచ్‌లను నిషేధించారు. ప్రమాదం జరిగినప్పుడు ప్రయాణికులు బయటకు విసిరేసినట్లు పడడం, సీటు బెల్టు పెట్టుకునే అవకాశాలు లేకపోవడం వంటి వాటిని కారణాలుగా చెప్పారు. 2010లో ఈయూ చట్టాన్ని ఉల్లంఘించిందంటూ ఓ ఆపరేటర్ కోర్టుకు ఆశ్రయించాడు. అతని అప్పీల్‌ను కోర్టు తిరస్కరించింది. యూరోపియన్ దేశాల్లో కూడా స్లీపర్ బస్సులు కనిపించవు. అక్కడ విస్తృత రైల్ నెట్‌వర్క్‌తోపాటు నిబంధనలు కఠినంగా ఉండడంతో స్లీపర్ బస్సులు ఉండవు. అమెరికాలో కూడా స్లీపర్ బస్సులు కనిపించవు. అమెరికన్లు బస్సుల్లో ప్రయాణించడానికి పెద్దగా ఇష్టపడరు. స్లీపర్ బస్సులో ప్రయాణించడం కంటే విమానంలో వెళ్లడమే తక్కువ ఖర్చని భావిస్తారు.

ఆ బస్సుపై 16 చలానాలు

- రెండేళ్లుగా పట్టించుకోని ట్రాఫిక్ అధికారులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదానికి గురైన ట్రావెల్ బస్సుపై తెలంగాణ పోలీసులు పలుమార్లు చలానాలు విధించారు. ప్రమాదానికి గురైన కావేరి ట్రావెల్ బస్సుపై 2024 జనవరి 27 నుంచి 2025 అక్టోబరు 9వ తేదీ వరకు 16 పెండింగ్ చలాన్లు ఉన్నాయి. ఈ చలాన్లకు సంబంధించి బస్సు నిర్వాహకులు రూ.23,120 పెనాల్టీ చెల్లించాల్సి ఉంది. దాదాపుగా రెండేళ్ల పాటు చలాన్లు పెండింగ్ ఉన్నా.. ట్రాఫిక్ అధికారులు పట్టించుకోలేదు. ఉల్లంఘన జరిగినప్పుడు మాత్రం చలాన్లు విధిస్తున్న అధికారులు పెద్ద ట్రావెల్ బస్సుల నుంచి వసూలు చేయడంపై దృష్టి పెట్టలేదని తెలుస్తోంది. రోడ్డుపై వెళుతున్న ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు, కార్లు నడిపే వారిని ముక్కుపిండి వసూలు చేస్తున్న ట్రాపిక్ సిబ్బంది.. ట్రావెల్ బస్సుల వైపు కూడా చూడటంలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కార్యాలయం మూత



కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి మెట్రో ఎదురుగా ఉన్న వేమూరి కావేరి ట్రావెల్స్ కార్యాలయం శుక్రవారం మూసేశారు. సాధారణంగా ఇది రోజూ ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు తెరిచి ఉంటుంది. ఉదయం నుంచి రాత్రి వరకు టికెట్లు, పార్శిళ్ల బుకింగ్‌లతో పాటు డెలివరీలతో నిత్యం రద్దీగా ఉంటుంది. శుక్రవారం తెల్లవారుజామున కర్నూల్‌లో బస్సు ప్రమాదం జరగడంతో ప్రయాణికుల కుటుంబసభ్యుల నుంచి ఒత్తిడి వస్తుందని భావించి మూసేసినట్లు తెలిసింది. వివిధ ప్రాంతాల నుంచి కూకట్‌పల్లి మీదుగా పటాన్‌చెరు వరకు వెళ్లే బస్సులు ఇక్కడ ఒక్కటీ ఆగకుండా వెళ్లాయి. ఉదయం 7 గంటల నుంచే మీడియా అంతా కూకట్‌పల్లి కార్యాలయం వద్ద ఉంది. అప్పటికే తెరిచి ఉన్న కార్యాలయంలో సిబ్బందిని ప్రమాదం విషయం మీకు తెలుసా అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించారు. అంతలోపే నిర్వాహకుల నుంచి ఫోన్లు రావడంతో సిబ్బంది షెట్టర్ మూసేసి వెళ్లిపోయారు.

ఒంగోలు బస్సు.. ఒడిశా అడ్రస్!

- నంబర్ డయ్యూ డామన్‌ది

అమరావతి/హైదరాబాద్ సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో ప్రమాదానికి గురైన బస్సు ఒంగోలుకు చెందిన వేమూరి కావేరి ట్రావెల్స్‌కు చెందినది. యజమాని పేరు వేమూరి వినోద్‌కుమార్. 2018 మే 2న తెలంగాణలో బస్సు కొనుగోలు చేశారు. అనంతరం అదే ఏడాది ఆగస్టు 8న డయ్యూ డామన్‌లో 41 సీట్లతో రిజిస్ట్రేషన్ చేయించారు. అప్పటి నుంచి ఏడేళ్ల పాటు హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు నడిపారు. బస్సును స్లీపర్ కోచ్‌గా ఆల్టర్ చేయించి ఒడిశాలోని రాయగడ ఆర్టీవో కార్యాలయంలో 2025 ఏప్రిల్ 29న రిజిస్ట్రేషన్ మార్పు చేశారు. అయితే రిజిస్ట్రేషన్ రాయగడలో జరిగినప్పటికీ బస్సు నంబరు డయ్యూ డామన్‌దే ఉండటం గమనార్హం. రిజిస్ట్రేషన్ మార్పు చేసి ఆరు నెలలు అవుతున్నా అదే నంబరుపై ఇప్పటి వరకు తిరుగుతోంది. ఈ బస్సులో ప్రయాణికుల జాబితా ఎప్పుడూ అందుబాటులో ఉండదు. మంటలు ఆర్పే పరికరాలు లేవని రెండుసార్లు రవాణా శాఖ అధికారులు కేసులు నమోదు చేశారు. అయినా బస్సు యాజమాన్యం నిర్లక్ష్యం వీడలేదు.

బైకును ఢీ కొట్టడంతో
మంటలు చెలరేగాయి

- కర్నూలు ప్రమాదంపై రవాణా శాఖ నివేదిక



అమరావతి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో ఘోర ప్రమాదానికి గురైన బస్సుకు ఫిట్‌నెస్ ఉందని రాష్ట్ర రవాణా శాఖ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ప్రమాద వార్త తెలియగానే రవాణా శాఖ కమిషనర్ మనీశ్ కుమార్ సిన్హా వెంటనే కర్నూలుకు చేరుకుని దుర్ఘటనపై ఆరా తీశారు. వేమూరి కావేరి ట్రావెల్స్‌కు చెందిన ఏసీ స్లీపర్ బస్సు(డీడీ01 ఎన్9490) ప్రమాదంలో పూర్తిగా మంటల్లో కాలిపోయినట్లు ఆర్టీఏ అధికారులు ప్రాథమిక సమాచారం సేకరించారు. బస్సు రిజిస్ట్రేషన్ 2018 మే 2న డామన్ డయ్యూలో అయిందని, బస్సుకు 2027 మార్చి 31 వరకూ ఫిట్‌నెస్ ఉందని గుర్తించారు. 2030 ఏప్రిల్ 30 వరకూ టూరిస్ట్ పర్మిట్ జారీ అయిందని, 2026 ఏప్రిల్ 20 వరకూ ఇన్సూరెన్స్ ఉన్నట్లు తెలుసుకున్నారు. బస్సు ఇంజిన్, ఇతర భద్రతా ప్రమాణాలన్నీ తగిన స్థాయిలో ఉన్నట్లు రవాణా శాఖ వెల్లడించింది. బైకును బలంగా ఢీ కొట్టడం వల్ల రాపిడితో చెలరేగిన మంటలే బస్సు ప్రమాదానికి కారణమని ప్రభుత్వానికి రవాణా శాఖ కమిషనర్ ప్రాథమిక నివేదిక అందజేశారు. డీజిల్ ట్యాంకు, బస్సులో వైరింగ్ వ్యవస్థలో ఎలాంటి లోపం లేదని నిర్ధారించారు. అయితే డ్రైవింగ్ విధానం, భద్రతా ప్రమాణాల అమలు, అగ్నిమాపక పరికరాల లభ్యత వంటి అంశాలపై నివేదిక ఇస్తామని తెలిపారు.

డ్రైవర్లు అప్రమత్తంగా ఉంటే
2 నిమిషాల్లోనే కాపాడొచ్చు!

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బస్సు డ్రైవర్లు అప్రమత్తంగా ఉంటే.. అగ్ని ప్రమాదాలు సంభవించినా ప్రయాణికుల ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సాధారణంగా రాత్రి సమయంలో బస్సులో ఉన్న ప్రయాణికులందరూ నిద్రలోనే ఉంటారు. ప్రమాద సమయాల్లో మెలకువగా ఉన్నవారు, వెంటనే తేరుకున్న వారు మాత్రమే ప్రాణాలతో బయటపడే అవకాశాలుంటాయి. కానీ, డ్రైవర్లు సరైన రీతిలో స్పందిస్తే.. బస్సులో నుంచి రెండు నిమిషాల్లోనే ప్రయాణికులను కిందకు దింపొచ్చని నిపుణులు చెబుతున్నారు. గతంలోనూ పలువురు బస్ డ్రైవర్లు ప్రాణాలకు తెగించి మరీ ప్రయాణికులను కాపాడిన సంఘటనలున్నాయి.

బస్సు ప్రమాదం దురదృష్టకరం

రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ దిగ్భ్రాంతి

- మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల పరిహారం: పీఎంవో
- రూ.5 లక్షల చొప్పున ప్రకటించిన ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు

న్యూఢిల్లీ/హైదరాబాద్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కర్నూలు బస్సు ప్రమాద ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 19 మంది సజీవ దహనమవడం అత్యంత బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాద మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేలు అందజేయనున్నట్టు ప్రధానమంత్రి కార్యాలయం ప్రకటించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తదితరులు కూడా ప్రమాదం పట్ల విచారం వ్యక్తం చేశారు. బస్సు ప్రమాద ఘటనలో మృతి చెందిన ఏపీకి చెందిన ఆరుగురికి సంబంధించి ఏపీ ప్రభుత్వం రూ.5లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది. క్షతగాత్రులకు రూ.2 లక్షలు ప్రకటించింది. అలాగే, తెలంగాణకు చెందిన మృతుల కుటుంబాలకు ఆ రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించనున్నట్లు ఆ రాష్ట్ర రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. క్షతగాత్రులకు రూ.2 లక్షల పరిహారాన్ని అందించనున్నట్టు వెల్లడించారు.

బెంగళూరులో 30 బస్సులు సీజ్

- బస్సు ప్రమాదం నేపథ్యంలో రవాణా అధికారుల దాడులు

బెంగళూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో బస్సు ప్రమాదం నేపథ్యంలో బెంగళూరులో రవాణాశాఖ అధికారులు శుక్రవారం మెరుపుదాడులు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న ప్రైవేటు బస్సులను తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని 30 బస్సులను సీజ్ చేశారు. రవాణాశాఖ అదనపు కమిషనర్ ఓంకారేశ్వరి నేతృత్వంలో ఈ సోదాలు చేపట్టారు. తమిళనాడు, అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్ రిజిస్ట్రేషన్‌తో నడుస్తున్న బస్సులను తనిఖీ చేశారు. ఎలక్ట్రానిక్ సిటీ సమీపంలోని అత్తిబెలె చెక్‌పోస్ట్ వద్ద పలు ప్రైవేట్ బస్సులను పరిశీలించారు. నగరంలోని వివిధ ప్రాంతాలలో శుక్రవారం తెల్లవారుజాము నుంచే దాడులు చేస్తున్నామని కమిషనర్ ఓంకారేశ్వరి తెలిపారు. ఆలిండియా టూరిస్ట్ బస్సులను పరిశీలించామని, పలు బస్సులకు అనుమతి గడువు ముగిసినా తిరుగుతున్నట్లు గుర్తించామని అన్నారు. నిబంధనలు పాటించని 30 బస్సులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. తనిఖీలలో ఆర్టీఓలు, బ్రేక్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



బెంగళూరులో సీజ్ చేసిన బస్సులతో రవాణాశాఖ అధికారులు

అద్దాలు బద్దలు కొట్టుకొని..

కడారి అశోక్. ఇతనిది రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం చంద్రాయన్‌పల్లి. వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సులో అశోక్ ఉన్నాడు. స్వల్పగాయాలతో బయటపడి మృత్యుంజయుడిగా నిలిచాడు. ఏపీ అనంతపురంలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో అశోక్ ఉద్యోగం చేస్తున్నాడు. దీపావళికి సొంతూరొచ్చి గురువారం రాత్రి బస్సెక్కాడు. భారీ శబ్ధం రావడంతో నిద్రలేచిన అశోక్.. ప్రమాదాన్ని పసిగట్టి బస్సు వెనుక అద్దాలు బద్దలు కొట్టి బయపడ్డాడు. తాను క్షేమంగా ఉన్నానంటూ ఫోన్ చేసి చెప్పడంతో అప్పటి దాకా టెన్షన్‌గా ఉన్న తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు.

డ్రైవర్.. ప్రధాన ద్వారం తెరిచి ఉంటే అంతా బతికేవాళ్లు

ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన సత్యనారాయణ హైదరాబాద్‌లోని సైనిక్‌పురిలో ఉంటున్నాడు. డీఆర్‌డీవోలో సెక్యూరిటీ సిస్టమ్స్‌లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నాడు. ఆఫీసు పని కోసం బెంగళూరు వెళ్లేందుకు వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సెక్కి అప్పర్‌బెర్త్‌లో పడుకున్నాడు. అర్ధరాత్రి తర్వాత పెద్ద పెట్టున శబ్దం రావడంతో నిద్రలేచాడు. బస్సులో మంటలు చెలరేగడాన్ని గుర్తించి.. పరుగున వెళ్లి ప్రధాన ద్వారం తెరిచేందుకు ప్రయత్నించాడు సాధ్యపడకపోవడంతో బస్సు వెనుక అద్దాలవైపు వెళ్లాడు. అప్పటికే అక్కడ అద్దాలు పగులగొట్టి ఉండటంతో బయటకు దూకేశాడు. ఆయన కాలికి చిన్న ఫ్రాక్చర్ అయింది. ఫోన్ బస్సులోనే ఉండిపోవడంతో ఇతరుల ఫోన్‌తో ఇంటికి ఫోన్ చేసి తాను క్షేమంగా ఉన్నట్లు తల్లిదండ్రులకు చెప్పాడు. దట్టంగా కమ్ముకున్న పొగతో చాలామంది బయటకు రాలేకోపోయారని సత్యనారాయణ చెప్పాడు. డ్రైవర్.. బయటకు దూకేముందు ప్రధాన ద్వారం తెరిచి ఉంటే ప్రయాణికులంతా బతికేవారని చెప్పాడు.

15 ఫీట్ల ఎత్తు నుంచి దూకి..

హయత్‌నగర్ వాసి నవీన్ కుమార్‌కు గత ఏడాదే బెంగళూరులో ఐటీ కొలువొచ్చింది. అప్పటి నుంచి అక్కడే ఉంటున్నాడు. పండక్కి హైదరాబాద్ వచ్చాడు. గురువారం రాత్రి బస్కెక్కి నిద్రపోయాడు. గాఢ నిద్రలో ఉండగా అగ్గి సెగ తాకడంతో మెలకువ వచ్చిందని.. ఎమర్జెన్సీ విండోను పగులగొట్టి 15 పీట్ల ఎత్తు నుంచి దూకి ప్రాణాలు కాపాడుకున్నానని చెప్పాడు. అంతెత్తు నుంచి దూకడంతో నవీన్ కాలు ఫ్రాక్చర్ అయింది. చికిత్స కోసం కర్నూలు ఆస్పత్రిలో చేర్పించారు. కుమారుడి కోసం తల్లిదండ్రులు కారులో కర్నూలు వెళ్లారు.

పొరుగు మార్గంలో ప్రైవేటు



ట్రావెల్స్ ప్రమాదాలకు కారణాలు ఎన్నెన్నో

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సరిగ్గా పది రోజుల క్రితం రాజస్థాన్‌లో ఓ ట్రావెల్ బస్సు దగ్ధమైంది. అంతకుముందు ఇతర రాష్ట్రాలలో పలు ప్రమాదాలు సంభవించాయి. తాజాగా కర్నూలు జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదాలు జరిగిన తీరును పరిశీలిస్తే అన్నింటిలోనూ కొన్ని సరూప్యతలు ఉన్నాయి. ప్రమాదానికి గురైన ఈ ప్రైవేటు బస్సులన్నీ స్లీపర్ క్లాస్‌వి. ఇందులో కొన్ని బీఎస్-6 వాహనాలు ఉన్నాయి. ఈ ప్రమాదాలన్నీ రాత్రివేళ అందులోనూ తెల్లవారుజామున జరిగాయి. బస్సులు దగ్ధం కావడంతో ప్రాణ నష్టం ఎక్కువగా జరిగింది. తరచూ ఇలాంటి ప్రమాదాలు జరగడానికి కారణాలు ఏంటి? బీఎస్-6 వాహనాల్లో సమస్యలు ఏంటి? స్లీపర్ బస్సుల్లోని ప్రయాణికులు ప్రమాద సమయాల్లో త్వరగా బయటపడకుండా లోపలే చిక్కుకుపోవడానికి కారణాలేంటి? ప్రైవేటు ఆపరేటర్ల పాత్ర ఎంత? వంటి అంశాలను పరిశీలిస్తే.. ఎన్నో లోపాలు ఉన్నాయి..

ఈశాన్యంలో రిజిస్ట్రేషన్లు

రాష్ట్రానికి చెందిన ప్రైవేటు బస్సు ఆపరేటర్లు అధిక శాతం ఈశాన్య రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారు. అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్‌తో పాటు డామన్ అండ్ డయ్యూ వైపు వెళుతున్నారు. ఈ రాష్ట్రాలలో రిజిస్ట్రేషన్లు చేయించుకుని ఆలిండియా పర్మిట్లు తీసుకుంటున్నారు. రిజిస్ట్రేషన్ ఎక్కడ చేయించినా ఆలిండియా పర్మిట్ తీసుకుంటే దేశంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రైవేటు బస్సులను నడుపుకొనే అవకాశం ఉంటుంది. ఏపీలో సింహభాగం ప్రైవేటు వాహనాలన్నీ నాగాలాండ్‌లోనే రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. అక్కడైతే రోడ్ ట్యాక్స్ ఏడాదికి రూ.50 వేలు చెల్లిస్తే సరిపోతుంది. అదే మన రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ చేయిస్తే ఏడాదికి రూ.5 లక్షలు చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. అరుణాచల్‌ప్రదేశ్‌లో అయితే ఆలిండియా పర్మిట్ ఏడాదికి కాకుండా ఐదు సంవత్సరాలకు కూడా ఇస్తున్నారు. నాగాలాండ్ లేదా ఇతర ఈశాన్య రాష్ట్రాలలో రిజిస్ట్రేషన్లు చేయించుకోవటం చాలా సులభం. వాహనం లేకపోయినా కేవలం వాట్సాప్‌లో కాగితాలు పంపిస్తే గంటల్లోనే రిజిస్ట్రేషన్లు జరిగిపోవడంతో పాటు నంబర్ సైతం వచ్చేస్తుంది. అక్కడ ఫిజికల్ వెరిఫికేషన్ పెద్దగా లేకపోవటం, ఫైర్ సేఫ్టీ స్టాండర్డ్ సర్టిఫికెట్లు అడగకపోవటం వల్ల గంటల్లోనే పని అయిపోతుంది. మన రాష్ట్రం విషయానికొస్తే నిబంధనలు కఠినతరం. ఈ కారణాల వల్ల రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం పోవడమే గాక ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్లు చేయించిన ప్రైవేటు బస్సులపై అధికారం ఏపీ రవాణా శాఖకు పూర్తి స్థాయిలో ఉండదు. పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్, సెస్సుల భారం తగ్గడం కోసం ఇతర రాష్ట్రాలలో ఏ విధంగా డీజిల్ కొట్టించుకుంటున్నారో.. అదేవిధంగా రోడ్డు ట్యాక్స్ తగ్గించుకోవడం కోసం నాగాలాండ్ తదితర రాష్ట్రాలలో రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారు. ఈ అంశాలను రాష్ట్ర రవాణా శాఖ ఉన్నతాధికారులు పట్టించుకోలేదు. ప్రైవేటు వాహనాలు రాష్ట్రానికి చెందినవే అయినా.. వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని మాత్రం పొరుగు రాష్ట్రాలు తన్నుకుపోయే పరిస్థితి ఏర్పడింది. ఆదాయం సంగతి అటుంచితే.. ప్రమాణాలను పాటించకపోవటం వల్ల ఇతర రాష్ట్రాల రిజిస్ట్రేషన్ల బస్సులు ఇక్కడి ప్రజలు, ప్రయాణికుల ప్రాణాలు తీస్తున్నాయి. పెద్ద ప్రమాదాలు జరిగినపుడే వ్యవస్థలోని లోపాలపై చర్చలు జరుగుతున్నాయి. ఆ తర్వాత కొన్నాళ్లకు అంతా మర్చిపోతారు.

అనుకూలంగా ఆలిండియా పర్మిట్

దక్షిణాది రాష్ట్రాల్లో ప్రభుత్వాలకు రవాణా ఆదాయం వేల కోట్లలో ఉంటోంది. ఉత్తరాదిలో తక్కువగా ఉండగా.. ఈశాన్యంలో మరీ తక్కువ. మన రాష్ట్రంలో ఒక బస్సు ఏడాది పాటు రోడ్లపై తిప్పాలంటే మూడు నెలలకు 1.64 లక్షలు రవాణా శాఖకు ఆపరేటర్ చెల్లించాలి. అదే ఈశాన్య రాష్ట్రాలైతే ఏడాదికి ఒకసారి 50 వేలు చెల్లిస్తే సరిపోతుంది. అక్కడ రిజిస్టరైన బస్సును ఏపీలో తిప్పడానికి ఆలిండియా పర్మిట్ (ఏడాదికి రూ.2లక్షలు) కేంద్రం జారీ చేస్తుంది. ఆ రెండు లక్షలు రాష్ట్రాలకే పంచుతామని చెప్పడంతో అందుకు రాష్ట్రాలు సమ్మతించాయి. తాజాగా కర్నూలు సమీపంలో ప్రమాదానికి గురైన ట్రావెల్ బస్సు హైదరాబాద్‌లో బయలుదేరింది. కర్నూలు, అనంతపురం మార్గంలో బెంగళూరుకు చేరాల్సి ఉంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక.. మూడు రాష్ట్రాలలో ప్రయాణించాలి. దీంతో కేంద్రం ఈ బస్సుకు సంబంధించి ఆ రెండు లక్షలు మూడు రాష్ట్రాలకూ పంపిణీ చేస్తుంది. ట్రావెల్ ఆపరేటర్లు ఈ అవకాశాన్ని తమకు అనుకూలంగా మలచుకుంటున్నారు. తక్కువ ఫీజులున్న ఈశాన్య రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్లు చేయించుకుని, ఎక్కువ ప్రయాణ చార్జీలు భరించే శక్తి ఉన్న దక్షిణాది రాష్ట్రాలలో బస్సులు నడుపుతూ భారీ లాభాలు ఆర్జిస్తున్నారు.

బీఎస్-6 వాహనాలు.. ప్రమాదాలు

ఇటీవల బీఎస్-6 ప్రైవేటు, ఆర్టీసీ బస్సులు తరచూ అగ్నిప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ వాహనాల్లో లోపాలు డ్రైవర్లకు అర్థం కావడం లేదు. గతంలో బస్సులలో ఏవైనా లోపాలుంటే రన్నింగ్‌లో డ్రైవర్లకు తెలిసేవి. బీఎస్-6 వాహనాలన్నీ ఎక్కువగా వైర్లు, సెన్సార్లతో పనిచేస్తున్నాయి. బస్సు ఆగిపోతే టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తారు. వాహన తయారీ కంపెనీ ప్రతినిధి ల్యాప్‌టాప్ తీసుకుని వస్తే తప్ప సమస్య తెలుసుకోలేని పరిస్థితి. సర్వీసు సెంటర్లు తగినన్ని లేక బస్సు ఆగిన చోటుకు రావడానికే రెండు రోజులు పడుతోంది. వైరింగ్ వల్ల షార్ట్ సర్క్యూట్ సంఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయని డ్రైవర్లు చెబుతున్నారు. బీఎస్-6 బస్సులలో డీజిల్‌లో పొగ రాకుండా ఉండటం కోసం బ్లూ ఆయిల్ వినియోగాన్ని తప్పనిసరి చేశారు. బ్లూ ఆయిల్‌కు చాలా త్వరగా మండే స్వభావం ఉంటుంది. దీంతో ప్రమాద సమయాల్లో పేలుడు సంభవిస్తున్న ఉదంతాలు కూడా ఉన్నాయని చెబుతున్నారు. బీఎస్-6 వాహనాలలో అద్దాలను కదలకుండా ఫిక్స్ చేయటం వల్ల కూడా ప్రమాద సమయాల్లో ప్రయాణికులు ప్రాణాలను కాపాడుకోలేక పోతున్నారు.

స్లీపర్ బస్సుల్లో డిజైన్ లోపాలు

దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో స్లీపర్ బస్సులు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నాయి. ప్రమాదంలో మృతుల సంఖ్య పెరగడానికి డిజైన్లలో లోపాలు ముఖ్య కారణమని రవాణా రంగ నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా స్లీపర్ బస్సుల్లో 36 వరకూ బెర్తులుంటే మల్టీ యాక్సిల్ బస్సుల్లో 40వరకూ ఉంటాయి. డ్రైవర్ వెనక నుంచి రెండు బెర్తులు అనుసంధానించి బస్సు చివరి వరకూ ఆరు వరుసలు పైనా, కిందా ఉంటాయి. అదేవిధంగా బస్సుకు ఎడమ వైపు సింగిల్ బెర్తులు కింద ఒకటి, పైన మరొకటి ఉంటాయి. వాటి మధ్యలో నడవాలంటే ప్రయాణికులకు దారి చిన్నగా ఉంటుంది. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు వెంటనే కిందికి దిగాలంటే డబుల్ బెర్తుల్లో కిటికీ వైపు ఉండే ప్రయాణికుడికి ఇటు వైపు ఉండే ప్రయాణికుడు దారిస్తే కానీ సాధ్యం కాదు. అలాగాకుండా గతంలో ఉన్న డిజైన్ల(అడ్డంగా)లో బెర్తులు రూపొందిస్తే అన్నీ సింగిల్ ఉంటాయి గనుక దిగేందుకు సులభంగా ఉంటుంది. ప్రమాద సమయాల్లో వీలైనంత త్వరగా బయటపడేందుకు అవకాశం ఉంటుంది. అయితే ఈ డిజైన్ వల్ల బెర్తుల సంఖ్య తగ్గిపోతుందని ట్రావెల్ ఆపరేటర్లు అభ్యంతరాలు చెప్పడంతో వాహన తయారీ కంపెనీలు డిజైన్ మార్చేశాయి. డిజైన్లపై కేంద్ర ప్రభుత్వం పునఃసమీక్షించి చర్యలు తీసుకోవాలని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



బైక్‌పై శివశంకర్ (ఫైల్)

ఆఖరి ప్రయాణం



జాతీయ రహదారిపై దగ్ధమైన బస్సు

తెల్లారేలోగా పనిలో చేరాలని..!

కర్నూలు/కర్నూలు న్యూసిటీ: 'అమ్మా ఉదయాన్నే పని ఉంది. అర్ధరాత్రే బయలుదేరి వెళ్తా. ఇంటికొస్తా కొత్త టీవీ తెస్తా' అని చెప్పి వెళ్లిన కొడుకు శవమయ్యాడు. తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ మండలం కసాపురం గ్రామానికి చెందిన యశోద, నాగన్న దంపతులకు శ్రీహరి, శివశంకర్.. సంతానం. 2015లో నాగన్న మృతి చెందడంతో తల్లి యశోదతో కలసి కర్నూలు నగర శివారులో ప్రజానగర్‌లో వారు జీవితాన్ని మొదలుపెట్టారు. శివశంకర్ ఇళ్లలో గ్రానైట్ రాళ్లు పరిచే పని చేస్తున్నాడు. అన్న శ్రీహరి, తల్లి యశోద భవన నిర్మాణ పనులకు వెళ్తూ బతుకు బండి లాగిస్తున్నారు. ఇల్లు గడవాలంటే బండలు పరవాల్సిందే. గురువారం రాత్రి మేస్త్రీ ఫోన్ చేసి 'డోన్‌లో పనుంది. తెల్లారేపాటికి రావాలి' అని చెప్పాడు. దీంతో శుక్రవారం అర్ధరాత్రి సుమారు 2.15 గంటలకు శివశంకర్ తన పల్సర్ బైక్‌పై బయలుదేరాడు. బస్సు ఢీకొట్టడంతో ఎగిరి రోడ్డు పక్కనపడి చనిపోయాడు. ఈ బైకు, బస్సు ఢీకొన్న ప్రమాదమే మరో 19 మంది మరణానికి కారణమైంది.

ఎస్పీకి ఫోన్ చేసి సమాచారం



కర్నూలు క్రైం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బస్సు ప్రమాదం జరిగిన వెంటనే ఓ మహిళ స్పందించి నేరుగా కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు సమాచారం ఇచ్చారు. హైదరాబాద్‌కు చెందిన హేమారెడ్డి అనే మహిళ పుట్టపర్తికి వెళ్లి... గురువారం రాత్రి 11గంటలకు కారులో తిరుగు ప్రయాణమయ్యారు. ఆ వాహనం ప్రమాద స్థలం వద్దకు రాగానే.. ఓ బస్సు మంటల్లో కాలిపోతోందని డ్రైవర్ చెప్పడంతో ఆమె కారు దిగి అక్కడికి చేరుకున్నారు. అక్కడ ఓ వ్యక్తి వద్ద ఫోన్ అడిగి.. తనకు తెలిసిన ఓ పోలీస్ అధికారికి కాల్ చేసి కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ నంబర్ తీసుకున్నారు. వెంటనే ఎస్పీకి ఫోన్‌చేసి బస్సు ప్రమాదం సమాచారం ఇచ్చారు.

12 మందిని కాపాడిన రెండో డ్రైవర్!

కనిగిరి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కర్నూలు బస్సు ప్రమాద ఘటనలో డ్రైవర్ భయంతో అక్కడి నుంచి పారిపోగా.. రెండో డ్రైవర్ ప్రాణాలకు తెగించి 12 మందిని కాపాడారు. ప్రమాదానికి గురైన బస్సులో ప్రకాశం జిల్లా కనిగిరి పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన గుడిపాటి శివనారాయణ కూడా డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. తన బిట్ (నడిపే ప్రాంతం) వరకు బస్సు నడిపిన తర్వాత శివనారాయణ మరో డ్రైవర్ లక్ష్మయ్యకు డ్రైవింగ్ అప్పగించి బస్సువెనుక డిక్కీలో పడుకున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత లక్ష్మయ్య బస్సు ఆపి శివనారాయణను నిద్రలేపాడేజ ఆ సమయంలోనే మంటలు చెలరేగడంతో లక్ష్మయ్య అక్కడినుంచి పారిపోగా.. శివనారాయణ జాకీతో అద్దాలు పగులగొట్టి దాదాపు 12 మందిని బయటికి రప్పించారు.

స్నేహితుడి కోసం నిరీక్షణే కాపాడింది!

కర్నూలు, హైదరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు బస్సు ప్రమాదం నుంచి ఓ నేవీ కమాండర్ లక్కీగా తప్పించుకొన్నారు. సికింద్రాబాద్‌కు చెందిన తరుణ్ కుమార్ (27) బెంగుళూరులో నేవీలో లెఫ్టినెంట్ కమాండర్‌గా పనిచేస్తున్నారు. దీపావళికి ఇంటికి వచ్చిన ఆయన సెలవులు ముగియడంతో బెంగళూరు వెళ్లేందుకు గురువారం వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సులో టికెట్ బుక్ చేసుకున్నారు. రాత్రి 10గంటలకు లక్డీకాపూల్ వద్ద ఆయన బస్సు ఎక్కాల్సి ఉంది. అయితే స్నేహితుడి కోసం నిరీక్షిస్తూ.. బస్సు డ్రైవర్‌కు ఫోన్ చేసి శంషాబాద్‌లో ఎక్కుతానని చెప్పారు. రాత్రి 11.20 గంటలకు బస్సు శంషాబాద్‌కు చేరుకున్నాక డ్రైవర్ ఫోన్ చేస్తే మీరు వెళ్లిపోండని చెప్పారు. ఓ గంట తర్వాత తరుణ్ కుమార్ మరో బస్సులో బెంగుళూరుకు బయల్దేరారు. స్నేహితుడి కోసం నిరీక్షించడమే తన ప్రాణాలు కాపాడిందని తరుణ్‌కుమార్ చెప్పుకొచ్చారు.

అగ్నికి ఆహుతి!

(మొదటి పేజీ తరువాయి)

వెళ్తున్నవారే అధికం! సిటీ దాటగానే... ఒక్కొక్కరుగా నిద్రలోకి జారుకున్నారు. అర్ధరాత్రి దాటాక 2.40 గంటల సమయంలో... బస్సు చిన్న టేకూరు దాటుతోంది. బస్సుకు ఇద్దరు డ్రైవర్లున్నారు. ఆ సమయంలో మిర్యాల లక్ష్మయ్య బస్సు నడుపుతున్నాడు. అంతకుముందు వరకు బస్సు నడిపిన మరో డ్రైవర్ శివనారాయణ... వెనుక వైపు డిక్కీలో విశ్రాంతి తీసుకుంటున్నాడు. అంతలో ఏం జరిగిందంటే...

దఢేల్‌మనే శబ్దంతో...

ఏపీలోని కర్నూలు శివారు ప్రాంతం ప్రజానగర్ చెందిన బి.శివశంకర్(21) అనే యువకుడు ఇళ్లలో గ్రానైట్ ఫ్లోరింగ్ పనులు చేస్తుంటాడు. నంద్యాల జిల్లా డోన్‌లో పని దొరికింది. తెల్లవారక ముందే అక్కడ ఉండాలని అర్ధరాత్రి తర్వాతే బయల్దేరాడు. కానీ... అతడిని దురదృష్టం వెంటాడింది. శివశంకర్ పల్సర్ బైక్‌ను వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. శివశంకర్ ఎగిరి రోడ్డుపక్కన పడిపోయాడు. బైక్ మాత్రం బస్సు కిందికి వెళ్లి... ముందు వైపున్న యాక్సిల్‌లో ఇరుక్కుంది. 'దఢేల్' అంటూ పెద్ద శబ్దం... కుదుపు! ప్రయాణికుల్లో కొందరికి మెలకువ వచ్చింది కానీ... ఏం జరిగిందో తెలియదు! ఆ సమయంలో బస్సు గంటకు 80 నుంచి 90 కిలోమీటర్ల వేగంతో వెళుతోంది. అప్పటికప్పుడు బ్రేక్ వేసి, బస్సును ఆపి ఉంటే సరిపోయేది. కానీ... ప్రమాదం జరిగిందన్న కంగారువల్లో, మరే కారణం చేతనో డ్రైవర్ ఆ పని చేయలేదని తెలుస్తోంది. సుమారు 200 మీటర్లు అలాగే.. బస్సును ముందుకు తీసుకెళ్లాడు! దాని ఫలితమే...

మృతులు వీరే..

పేరు	స్వస్థలం
గిరిరావ్(48)	తెలంగాణ (హైదరాబాద్)
అగ్ర బందోపాధ్యాయ్(23)	తెలంగాణ (హైదరాబాద్)
చందన(23)	తెలంగాణ(మెదక్ జిల్లా)
సంధ్యారాణి(43)	తెలంగాణ(మెదక్ జిల్లా)
అనూష(22)	తెలంగాణ(యాదాద్రి జిల్లా)
మేఘనాథ్(25)	తెలంగాణ(ఖమ్మం జిల్లా)
గోళ్ల రమేశ్(36)	ఆంధ్రప్రదేశ్ (నెల్లూరు జిల్లా)
గోళ్ల అనూష(27)	ఆంధ్రప్రదేశ్ (నెల్లూరు జిల్లా)
గోళ్ల శశాంక్(7)	ఆంధ్రప్రదేశ్ (నెల్లూరు జిల్లా)
గోళ్ల మాన్విత(4)	ఆంధ్రప్రదేశ్ (నెల్లూరు జిల్లా)
శ్రీనివాసరెడ్డి(39)	ఆంధ్రప్రదేశ్ (కొవ్వూరు)
గన్నమనేని ధాత్రి(27)	ఆంధ్రప్రదేశ్ (బాపట్ల జిల్లా)
ప్రశాంత్(32)	తమిళనాడు(పాలక్కడ్)
ఇవన్ శంకర్‌రాజు(22)	తమిళనాడు
ఫిలోమెన్‌బేబీ(64)	కర్ణాటక
కిశోర్‌కుమార్(41)	కర్ణాటక
అమిత్‌కుమార్(18)	బిహార్
కె.దీపక్‌కుమార్(24)	ఒడిశా
గుర్తు తెలియని వ్యక్తి	---
బి.శివశంకర్(21)	బైకర్(కర్నూలు)

కాల్చేసిన నిప్పు రవ్వలు

బస్సు కింద ఇరుక్కుపోయిన బైక్... రోడ్డును బలంగా రాసుకుంటూ అలాగే వచ్చేసింది! ఈ క్రమంలో బైక్ పెట్రోల్ ట్యాంక్ మూత ఊడిపోయింది. పెట్రోల్ బయటికి చిమ్మింది. బైక్, రోడ్డు మధ్య జరిగిన రాపిడితో నిప్పు రవ్వలు ఎగిశాయి. పెట్రోలు అంటుకుంది. దాంతోపాటు బస్సుకు కూడా మంటలు వ్యాపించాయి. డ్రైవర్ లక్ష్మయ్య వెంటనే బయటకు దూకాడు. వెనుక వైపు డిక్కీలో నిద్రిస్తున్న మరో డ్రైవర్ శివనారాయణను లేపాడు. 'బస్సుకు మంటలు అంటుకున్నాయి' అని కేకలు వేసి... అక్కడి నుంచి వెళ్లిపోయాడు. బస్సులోపలున్న ప్రయాణికులను మృత్యుకీలలు ఆవరించడం మొదలైంది. బైక్‌ను ఢీకొట్టిన సమయంలో వచ్చిన శబ్దానికి మేల్కొన్న కొందరు ప్రయాణికులు బస్సు డ్రైవర్ వెళ్లిన మార్గంలోనే కిందికి దూకారు. 'మంటలు... మంటలు... బస్సుకు నిప్పంటుకుంది దూకండి.. దూకండి' అంటూ బిగ్గరగా కేకలు వేశారు. గాఢ నిద్రలో ఉన్న వారు ఉలిక్కిపడి లేచారు. అప్పటికే పొగలు కమ్ముకుంటున్నాయి. మంటలు, వేడికి సెన్సర్లు పనిచేయకపోవడంతో... 'ఆటోమేటిక్ డోర్లు' లాక్ అయిపోయాయి. అత్యవసర (ఎమర్జెన్సీ) ద్వారాలు కూడా తెరుచుకోలేదు. అద్దాలు పగలగొట్టేందుకు అవసరమైన 'హ్యామర్లు' కూడా కనిపించలేదు. లోపలున్న వారిది దిక్కుతోచని పరిస్థితి! చేతులతో, భుజాలతో అద్దాలు పగలగొట్టేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఈలోపే... రెండో డ్రైవర్ శివనారాయణ జాకీ తీసి బయటి నుంచి అద్దాలు పగొలగొట్టాడు. బస్సు వెనుకే మరో కారులో వెళుతున్న హరీశ్ అనే వ్యక్తి తన స్నేహితులతో కలిసి రాళ్లతో అద్దాలు బద్దలు కొట్టాడు. దీంతో... లోపలున్న ప్రయాణికుల్లో కొందరు చకచకా కిందికి దూకారు. అప్పటికే బస్సు మొత్తం మంటలు వ్యాపించాయి. ముందు వైపున స్లీపర్ బెర్తుల మధ్య ఇరుక్కున్న వారు బయటికి వచ్చే మార్గమే కనిపించలేదు. వారంతా నిస్సహాయ స్థితిలో.. అగ్ని కీలల మధ్య ఆర్తనాదాలు చేస్తూ సజీవ దహనమయ్యారు. మృతదేహాలన్నీ గుర్తుపట్టలేనంతగా... మాంసపు ముద్దలుగా మారాయి. పోలీసులు వచ్చేసరికే... ఆరుగురు క్షతగాత్రులు ప్రైవేట్ వాహనాల్లో ఆస్పత్రికి చేరుకున్నారు. మిగిలిన వారిని అంబులెన్స్‌లలో ఆస్పత్రికి తరలించారు. మృతులలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారూ ఉండటంతో మంత్రి జూపల్లి కృష్ణారావు, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడుతో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు.



ఆ బస్సులో భారీగా కొత్త సెల్‌ఫోన్లు

కర్నూలు క్రైం: కాలిపోయిన వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సులో ఖరీదైన 234 సెల్‌ఫోన్లు దగ్ధమయ్యాయి. హైదరాబాద్‌కు చెందిన మంగనాథ్ అనే వ్యాపారి రూ.46లక్షలు విలువైన రియల్‌మీ కంపెనీ సెల్‌ఫోన్ల బాక్సులను బస్సులో పార్సిల్ చేశారు. ఇవి బెంగళూరులోని ఫ్లిప్‌కార్టుకు చేరాల్సి ఉంది. అక్కడి నుంచి కస్టమర్లకు అవి సరఫరా అవుతాయి. ప్రమాద విషయం తెలుసుకున్న ఆయన హైదరాబాద్ నుంచి ప్రమాద స్థలానికి చేరుకుని, లబోదిబోమన్నారు. కాగా.. ప్రమాదంలో మంటల తీవ్రత పెరగడానికి ఈ సెల్‌ఫోన్ల బ్యాటరీలు పేలిపోవడం కూడా ఓ కారణమేనని ఫోరెన్సిక్ నిపుణులు అంటున్నారు. మంటలకు ఆ ఫోన్లు కాలిపోవడంతో బ్యాటరీలు పేలిపోయిన శబ్దం వచ్చిందని ప్రత్యక్ష సాక్షులు కూడా చెప్పారు.



బస్సు కింద ఇరుక్కుపోయిన బైక్ పెట్రోల్ ట్యాంక్



నా రెండు కాళ్లు విరిగాయి


25 ఏళ్ల క్రితం బతుకుదెరువు కోసం తల్లిదండ్రులు హైదరాబాద్ వచ్చారు. మూసాపేటలో నివాసం ఉంటున్నాం. బీటెక్ పూర్తి చేశాను. బెంగళూరులో ఇంటర్వ్యూ ఉండటంతో గురువారం రాత్రి బయల్దేరాను. బస్సులో మంటలు చెలరేగడంతో అద్దాన్ని పగులకొట్టి బయటికి దూకేశాను. నా రెండు కాళ్లు విరిగాయి. ప్రస్తుతం నంద్యాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాను. నా కళ్లెదుటే బస్సు మంటల్లో ప్రయాణికులు కాలిపోయారు.

- జయసూర్య, నెమళ్లదిన్నె,
పెద్దముడియం మండలం, కడప జిల్లా



ప్రమాద వివరాలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

ఒక కుటుంబం ఆహుతి



ప్రమాదంలో ఆహుతైన కుటుంబం

దుత్తలూరు/ఉదయగిరి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వారిద్దరూ మిత్రులు. నెల్లూరు జిల్లాలోని రెండు ప్రాంతాలకు చెందిన వారే అయినా.. ఉన్న ఊరిలో ఉపాధి లేక పొట్ట చేత పట్టుకుని కుటుంబ సమేతంగా బెంగళూరుకు వలస వెళ్లారు. ఒకే సంస్థలో పనిచేస్తున్న సమయంలో స్నేహితులయ్యారు. బాధలు, సంతోషాలను పంచుకుంటూ రెండు కుటుంబాలవారు ఎంతో అన్యోన్యంగా జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో దీపావళిని సంతోషంగా జరుపుకొనేందుకు హైదరాబాద్‌లోని మిత్రుడి సోదరి ఇంటికి ఉమ్మడిగా వెళ్లారు. వేడుకలు ముగించుకుని తిరిగి బెంగళూరుకు వస్తుండగా కావేరీ బస్సు ప్రమాదంలో మిత్రులలోని ఓ కుటుంబం మరణించగా.. మరో కుటుంబం మృత్యుంజయులుగా బయటపడింది. నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలం కొత్తపేటకు చెందిన నెలకుర్తి రమేశ్, వింజమూరు మండలం గోళ్ల వారిపాళెం గ్రామానికి చెందిన గోళ్ల రమేశ్ బెంగళూరులోని హిందూస్తాన్ యూనీలివర్ లిమిటెడ్ పరిశ్రమలో మార్కెటింగ్ డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్నారు. దీపావళిని ఘనంగా జరుపుకునేందుకు రెండు కుటుంబాలు కలిసి హైదరాబాదులోని నెలకుర్తి రమేశ్ అక్క నివాసానికి వెళ్లారు. అక్కడ దీపావళిని జరుపుకొన్నారు. అనంతరం కుటుంబాలతో కలిసి హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాలను సందర్శించారు. తిరిగి బెంగళూరుకు వెళ్లేందుకు హైదరాబాదు నుంచి ఆ రెండు కుటుంబాలు బస్సులో బయలుదేరాయి. బస్సు కర్నూలుకు సమీపంలో ప్రమాదం సంభవించి దగ్ధమవడంతో గాఢ నిద్రలో ఉన్న గోళ్ల రమేశ్ కుటుంబం అగ్నికి ఆహుతైంది. ప్రమాదంలో కుమారుడు గోళ్ల రమేశ్(31), కోడలు అనూష(27), మనుమలు శశాంత్(7), మాన్విత(4) ప్రాణాలు కోల్పోవడంతో రమేశ్ తల్లిదండ్రులు గోళ్ల మాలకొండయ్య, సుశీల కన్నీరు మున్నీరయ్యారు.

బస్సు కుదుపులతో మేల్కొన్నా: నెలకుర్తి రమేశ్

నిద్రలో ఉన్న తనకు బస్సు కుదుపులతో మెలకువ వచ్చిందని నెలకుర్తి రమేశ్ తెలిపారు. బస్సు ప్రమాద సంఘటనను 'ఆంధ్రజ్యోతి'కి ఆయన వివరించారు. "బస్సులో అంతా గాఢనిద్రలో ఉన్నారు. ఒక్కసారిగా బస్సు కుదుపులకు గురైంది. నేను నిద్రలో నుంచి తేరుకున్నా. బస్సు డ్రైవర్ మోటార్‌బైక్‌ను ఢీకొట్టి సుమారు 200 మీటర్ల వరకు ఈడ్చుకొని వెళ్లాడు. ఆ సమయంలో మోటార్‌బైక్ బస్సు కిందనే ఉండడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే నేను కూర్చున్న సీటు పక్కనే ఉన్న అద్దాన్ని పగలకొట్టి నా భార్య శ్రీలక్ష్మి, కుమారుడు అభిరామ్, కుమార్తె జశ్వితలను కిందకు తోసి నేను కూడా దూకేశా. అనంతరం మరికొందరు అందులో నుంచే బయటకు వచ్చారు. అప్పటికే బస్సు పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదం జరగ్గానే డ్రైవర్ బస్సును ఆపి ఉంటే ఇంత ఘోరం జరిగేది కాదు. నాకు, తన కుటుంబానికి ఆప్తుడైన గోళ్ల రమేశ్ కుటుంబాన్ని కోల్పోవడం బాధాకరం." అని అన్నారు.

కన్నీటి మంట ఊరట చెమ్మ!

గురువారానికి వాయిదానే ప్రాణాలు తీసింది



మెదక్ రూరల్ మండలం శివాయిపల్లికి చెందిన ఆ ఇద్దరు తల్లీ కూతుళ్లది ఎంత దురదృష్టం! ప్రయాణాన్ని వాయిదాలు వేస్తూ వేస్తూ చివరికి మృత్యువును ఆహ్వానించుకున్నారేమో అనిపిస్తోంది. ఐటీ ఉద్యోగి అయిన కుమార్తె చందనను బెంగళూరులో దిగబెట్టి.. తాను మస్కట్‌లో భర్త ఆనంద్‌గౌడ్ వద్దకు వెళ్లాలనేది తల్లి సంధ్యారాణి ప్రణాళిక. సెప్టెంబరు 14న తన తండ్రి సంవత్సరీకం కోసం సంధ్యారాణి మస్కట్ నుంచి స్వస్థలానికొచ్చింది. సెలవులు రావడంతో చందన కూడా తల్లి వద్దకొచ్చింది. తల్లీకూతుళ్లు 15 రోజుల క్రితమే తిరుగు ప్రయాణం పెట్టుకున్నా సంధ్యారాణికి జ్వరం రావడంతో వాయిదా వేసుకున్నారు. ఆ తర్వాత మెదక్‌లో శుభకార్యం ఉండటంతో ఆలస్యమైంది. చివరికి.. బుధవారం బెంగళూరు బస్సెక్కాలనుకున్నా చివరి క్షణాల్లో వాయిదా వేసుకున్నారు. గురువారం వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సెక్కి ప్రమాదంలో ఇద్దరూ మృత్యువాతపడ్డారు.

'నాన్నా.. బస్ ఎక్కా'.. అదే చివరిమాట!



యాదాద్రి జిల్లా గుండాల మండలం వస్తాకొండూరుకు చెందిన 22 ఏళ్ల మహేశ్వరం అనూషా రెడ్డి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. నిరుడే బెంగళూరులోని ఓ కంపెనీలో చేరింది. దీపావళి కోసం ఈనెల 16న స్వగ్రామానికొచ్చింది. గురువారం బెంగళూరుకు తిరుగు ప్రయాణం అయ్యేందుకు హైదరాబాద్‌కొచ్చింది. రాత్రి లకిడీకాపూల్‌లో బస్సెక్కింది. రాత్రి 9:30కు తండ్రి శ్రీనివాస్ రెడ్డికి ఫోన్ చేసి 'నాన్న బస్ ఎక్కా'నని చెప్పింది. తమ బిడ్డ నుంచి అవే చివరిమాటలయ్యాయని దంపతులు శ్రీనివాస్‌రెడ్డి, విజిత గుండెలవిసేలా రోదిస్తున్నారు.

దీపావళికి హైదరాబాద్ వచ్చి..



ఖమ్మం జిల్లాకు చెందిన చిత్తూరు శ్రీనివాసరావు, విజయలక్ష్మి కుమారుడు మేఘనాథ్ (25)కు ఐటీ కంపెనీలో చక్కని ఉద్యోగం వచ్చిందన్న సంతోషం వారికి ఏడాదైనా మిగల్లేదు. బస్సు ప్రమాదంలో అతడు సజీవదహనమయ్యాడని తెలిసి ఆ దంపతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఏడు నెలల క్రితం మేఘనాథ్‌కు బెంగళూరులో ఉద్యోగం వచ్చింది. దీపావళికి హైదరాబాద్‌కొచ్చి.. గురువారం తిరుగు ప్రయాణమై ప్రమాదంలో మరణించాడు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని పెళ్లి కల 'బుగ్గి'



ఇంకొల్లు/బాపట్ల/రావులపాలెం/అనపర్తి:అగ్ని ప్రమాదం.. కొన్నాళ్లలో పెళ్లి పీటలెక్కాల్సిన సాఫ్ట్ వేర్ ఉద్యోగిని బలి తీసుకుంది. బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం పూసపాడుకు చెందిన గన్నమనేని ధాత్రి(27) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. దీపావళి సెలవులకు హైదరాబాద్‌లోని మేనమామ శ్రీకాంత్ ఇంటికి వెళ్లారు. సెలవులు ముగించుకుని బెంగళూరుకు తిరిగి వెళుతూ కావేరీ బస్సు ఎక్కి.. మృత్యువాత పడ్డారు. త్వరలోనే ఆమెకు వివాహం చేయాలని భావించామని.. ఇంతలోనే అనంతలోకాలకు వెళ్లిపోయిందంటూ తల్లి వాణి కన్నీరుమున్నీరుగా విలపించారు.

బంధువుల ఇంటికి వచ్చి తిరిగి వెళ్తూ..



బెంగళూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఉన్న తల్లి సేవ కోసం వేల రూపాయల వేతనాన్ని, ఉద్యోగాన్ని కూడా వదులుకుని తల్లిసేవలో పునీతులవుతున్నారు. కానీ, కర్నూలు జిల్లాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదం ఆ తల్లిని, కుమారుడిని కూడా బలితీసుకుంది. బెంగళూరు టిన్ ఫ్యాక్టరీ ప్రాంతంలోని నారాయణపురలో నివసిస్తున్న ఫిలోమిన్ బేబి(64), ఆమె కుమారుడు కిశోర్ కుమార్(41) బస్సు ప్రమాదంలో సజీవదహనమయ్యారు. కిశోర్ కుమార్ ఉద్యోగం చేసేవారు. తల్లికి సేవ చేసేందుకు పెళ్లిని, ఉద్యోగాన్ని కూడా వదులుకున్నారు. ఫిలోమినా బంధువులు హైదరాబాద్‌లో ఉన్నారు. వారితో కొంతకాలం గడిపేందుకు తల్లీకొడుకు ఇటీవల అక్కడకు వెళ్లారు. హైదరాబాద్ నుంచి తిరిగి బెంగళూరుకు కావేరీ బస్సులో వస్తుండగా జరిగిన ప్రమాదంలో ఇరువురు అశువులు బాశారు.

12 ఏళ్లనాటి 'పాలెం' విషాదం

ఇదే నెలలో, ఇదే మార్గంలో ఘోర ప్రమాదం

2013 అక్టోబర్ 30న మహబూబ్‌నగర్ జిల్లా పాలెం సమీపంలో కల్వర్టును ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు

డీజిల్ ట్యాంకర్ పగిలి.. 45 మంది సజీవ దహనం

హైదరాబాద్ సిటీ/ హిమాయత్‌నగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు ప్రమాద ఘటన రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా విషాదం నింపింది. సరిగ్గా 12 ఏళ్ల క్రితం 45 మంది సజీవ దహనమైన 'పాలెం' దుర్ఘటనను మళ్లీ గుర్తుకు తెచ్చింది. 2013 అక్టోబరు 30న బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వస్తున్న జబ్బార్ ట్రావెల్స్ బస్సు తెల్లవారుజామున 5 గంటల సమయంలో అదుపు తప్పి అతివేగంగా డివైడర్‌ను ఢీకొట్టింది. బస్సు డీజిల్ ట్యాంక్ పగిలి మంటలు రేగాయి. క్షణాల్లోనే బస్సు మొత్తం మంటల్లో చిక్కుకుంది. 45 మంది ప్రయాణికులు సజీవదహనం అయ్యారు. మరో ఏడుగురు గాయపడ్డారు. నిబంధనల ఉల్లంఘన ఉన్న నేపథ్యంలో బాధిత కుటుంబాలకు పరిహారం ఇవ్వలేమని ప్రైవేట్ ఇన్సూరెన్స్ సంస్థ కొర్రీ పెట్టింది. దీనితో బాధిత కుటుంబాలు సీపీఐ నేత దిడ్డి సుధాకర్, సీనియర్ న్యాయవాది పాదూరి శ్రీనివాస్‌రెడ్డిల సాయంతో ఏడాది పాటు న్యాయ పోరాటం చేయాల్సి వచ్చింది. ఇప్పుడు అదే తరహా దుర్ఘటన జరిగిన నేపథ్యంలో.. దిడ్డి సుధాకర్, శ్రీనివాస్‌రెడ్డి నాడు జరిగిన పరిణామాలను 'ఆంధ్రజ్యోతి' వివరించారు. పాలెం దుర్ఘటనకు సంబంధించి బాధిత కుటుంబాల తరఫున కోర్టుల్లో న్యాయ పోరాటం బీమా పరిహారం సాధించామని చెప్పారు. మోటారు వాహన చట్టాలను కచ్చితంగా అమలు చేస్తే.. ప్రస్తుతం తిరుగుతున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సుల్లో చాలా వరకు రోడ్డెక్కలేవని చెప్పారు. అధికారుల కాసుల కక్కుర్తి, రాజకీయ నాయకుల అండదండలతో.. ట్రావెల్స్ యాజమాన్యాలు నిబంధనలు ఉల్లంఘించి వ్యాపారం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఇక హైవేల నిర్మాణంలో కాంట్రాక్టు సంస్థలు, సబ్ కాంట్రాక్టర్లు నిబంధనలను పట్టించుకోవడం లేదని, నాణ్యత, భద్రతా ప్రమాణాలను అనుసరించడం లేదని తెలిపారు. పాలెం దుర్ఘటనకు ఈ అంశం కూడా ఒక కారణమని అధ్యయనంలో తేలిందని, దీనితో హైవే అధికారులు, కాంట్రాక్టు సంస్థలను కూడా కోర్టు కేసుల్లో ప్రతివాదులుగా చేర్చామని గుర్తు చేశారు. లోపాలను సాకుగా చూపి, పరిహారం నిరాకరించిన ఇన్సూరెన్స్ సంస్థను కోర్టులో నిలదీశామని చెప్పారు. ఇప్పుడు అలాంటిదే మరో ప్రమాదం జరగడం కలచివేసిందన్నారు.

స్పోర్ట్స్

వరంగల్ ● శనివారం 25 అక్టోబరు 2025

మ్యాక్స్‌వెల్ వచ్చేశాడు..

భారత్‌తో టీ20 సిరీస్‌కు ఎంపిక



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా వెటరన్ ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ తిరిగి పోటీక్రికెట్‌లోకి అడుగుపెట్టనున్నాడు. గత నెలాఖరులో న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌కు నెట్ ప్రాక్టీస్ సందర్భంగా మణికట్టు ఫ్రాక్చర్ కావడంతో ఆటకు దూరమయ్యాడు. భారత్‌తో జరిగే అయిదు టీ20ల సిరీస్‌లోని చివరి మూడు మ్యాచ్‌లకు మ్యాక్స్‌వెల్‌ను ఎంపిక చేశారు. సిరీస్ ఈనెల 29న ఆరంభం కానుంది. అలాగే..యువ పేసర్ మాహ్లీ బీర్డ్‌మన్ అనూహ్యంగా చోటు దక్కించుకున్నాడు.

ఆస్ట్రేలియా టీ20 జట్టు: మిచెల్ మార్ష్ (కెప్టెన్), హెడ్, ఫిలిప్, ఇన్‌గ్లిస్, కునేమన్, మిచెల్ ఓవెన్, మ్యాథ్యూ షార్ట్, స్టొయినిస్, జంపా, మ్యాక్స్‌వెల్ (3,4,5 మ్యాచ్‌లు), అబాట్ (1,3 మ్యాచ్‌లకు), బార్ట్‌లెట్, టిమ్ డేవిడ్, బెన్ డ్వార్షుయిస్ (4, 5 మ్యాచ్‌లకు), నాథన్ ఎలిస్, హాజెల్‌వుడ్ (1, 2 మ్యాచ్‌లకు), మాహ్లీ బీర్డ్‌మన్ (3, 5 మ్యాచ్‌లకు).

పలాష్‌కు కాంస్యం

ఆసియా యూత్ గేమ్స్



రిఫా (బహ్రెయిన్): ఆసియా యూత్ గేమ్స్ బాలుర 5000 మీటర్ల నడకలో భారత్‌కు చెందిన పలాష్ మండల్ కాంస్యం దక్కించుకున్నాడు. శుక్రవారం జరిగిన ఈ రేస్‌ను పలాష్ 24ని.48.92 సెకన్ల సమయంలో పూర్తి చేశాడు. చైనాకు స్వర్ణరజతాలు దక్కాయి.

జూనియర్ హాకీ వరల్డ్‌కప్‌నుంచి
వైదొలిగిన పాకిస్థాన్

కరాచీ: భారత్ ఆతిథ్యమిచ్చే జూనియర్ హాకీ వరల్డ్‌కప్ నుంచి పాకిస్థాన్ జట్టు వైదొలిగింది. ఈ విషయాన్ని అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ధ్రువీకరించింది. చెన్నై, మధురైలో నవంబరు 28 నుంచి డిసెంబరు 28 వరకు ఈ టోర్నీ జరుగనుండగా, పాక్ స్థానంలో ఆడే మరో జట్టును ఇంకా ప్రకటించలేదు. అలాగే తటస్థ వేదికను కేటాయించాలన్న పాక్ కోరికను కూడా ఎఫ్ఐహెచ్ తోసిపుచ్చింది.

ఓదార్పు దక్కేనా?

- ఒత్తిడిలో టీమిండియా
- స్పిన్నర్ కుల్దీప్‌నకు చాన్స్?
- ఆసీస్‌తో మూడో వన్డే



విరాట్ కోహ్లీ

ఉ. 9 గం. నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

సిడ్నీ: కొత్త కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సారథ్యంలో బరిలోకి దిగిన భారత వన్డే జట్టుకు ఆస్ట్రేలియా పర్యటన చేదు అనుభవాన్నే మిగిల్చింది. వరుసగా రెండు మ్యాచ్‌లను కోల్పోవడంతో సిరీస్ ఇప్పటికే కంగారూల వశమైంది. ఇక ఆఖరిదైన నామమాత్రపు మూడో వన్డే శనివారం సిడ్నీలో జరుగనుంది. టీమిండియా కనీసం ఇక్కడైనా విజయం దక్కించుకుని పరువు కాపాడుకోవాలనుకుంటోంది. అటు మరో రెండేళ్ల తర్వాతే భారత్ ఇక్కడ పర్యటించనుండడంతో వెటరన్ స్టార్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలకు ఆసీస్ గడ్డపై బహుశా ఇదే చివరి మ్యాచ్ కానుంది. ఇక రెగ్యులర్ కెప్టెన్ కమిన్స్ బరిలోకి దిగకపోయినా.. పటిష్ట భారత్‌ను మట్టికరిపించిన ఆసీస్ జోష్‌లో ఉంది. అందుకే అలక్ష్యం లేకుండా ఆడి తొలిసారి భారత్‌పై 3-0తో సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాలనుకుంటోంది. మరోవైపు ఇక్కడి ఎస్‌సీజీ మైదానంలో ఆడిన చివరి ఐదు వన్డేల్లో భారత్ ఒక్కసారే నెగ్గింది.

కోహ్లీపైనే కళ్లన్నీ..: 300కు పైగా వన్డేలు ఆడిన స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తొలిసారిగా రెండు వరుస డకౌట్లతో నిరాశపర్చాడు. ఏ మాత్రం మ్యాచ్ ప్రాక్టీస్ లేకుండా ఏడు నెలల తర్వాత బరిలోకి దిగిన తనకు పరిస్థితులు కలిసిరావడం లేదు. అడిలైడ్‌లో డకౌటై వెనుదిరిగినప్పుడు ప్రేక్షకులు లేచి నిలబడి చప్పట్లతో సెండాఫ్ ఇవ్వడం, కోహ్లీ కూడా వారికి తన గ్లోవ్స్‌ను చూపించడం ఆసక్తి రేపింది. ఏదిఏమైనా సిడ్నీలో తన పవర్ చూపాలని టీమ్‌తో పాటు ఫ్యాన్స్ బలంగా కోరుకుంటున్నారు. రోహిత్ మాత్రం గత వన్డేలో అదరగొట్టాడు. గిల్, రాహుల్ రాణించాల్సి ఉంది. అయితే స్పిన్నర్ కుల్దీప్‌ను బెంచీకే పరిమితం చేయడం విమర్శలకు దారి తీస్తోంది. అడిలైడ్‌లో జంపాకు నాలుగు వికెట్లు దక్కడంతో అందరూ కుల్దీప్‌ను గుర్తుచేసుకున్నారు. జంపాను ట్రంప్‌కార్డుగా ఆస్ట్రేలియా ఉపయోగిస్తుంటే..మన ప్రధాన స్పిన్నర్ కుల్దీప్‌కు మాత్రం జట్టులో చోటే ఇవ్వడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అతడికి బెర్త్ దక్కాలంటే సుందర్, హర్షిత్‌లలో ఒకరిని తప్పించాల్సి ఉంటుంది. అలాగే పేసర్ ప్రసిద్ధ్‌ను ఆడించే అవకాశం లేకపోలేదు. ఆల్‌రౌండర్‌గా నితీశ్ బ్యాట్‌తో, బంతితో విఫలమయ్యాడు. అతడి మీడియం పేస్ ప్రత్యర్థి బ్యాటర్లను ఏమాత్రం ఇబ్బందిపెట్టడం లేదు. అక్షర్ మాత్రం జడేజాను మరిపించి అంచనాలను అందుకున్నాడు. పేసర్లు సిరాజ్, అర్ష్‌దీప్ ఆసీస్ బ్యాటర్లపై మరింత ఒత్తిడి తీసుకురావాల్సి ఉంది.



రోహిత్



మార్ష్

ఆత్మవిశ్వాసంతో ఆసీస్ : అద్భుత ఆటతీరుతో ఆసీస్ తమ వరల్డ్‌కప్ ప్రయాణాన్ని ఘనంగా ఆరంభించింది. మాథ్యూ షార్ట్, రెన్షా, మైకేల్ ఓవెన్, కూపర్ కనోలీ ఎలాంటి పరిస్థితుల్లోనైనా బ్యాటింగ్ చేయగలమని నిరూపించుకున్నారు. తొలి మ్యాచ్‌లో భారత్‌ను ఇబ్బందిపెట్టిన స్పిన్నర్ కునేమన్.. ఈసారి జంపాకు జత కలవనుండడం ఇబ్బందే. అటు ఓపెనర్ ట్రావిస్ హెడ్ నుంచి మెరుపులు కనిపించడం లేదు. తను విజృంభిస్తే భారత్‌కు మరిన్ని కష్టాలు తప్పవు. సీనియర్ పేసర్లు స్టార్క్, హాజెల్‌వుడ్‌లకు విశ్రాంతినిచ్చే అవకాశం ఉంది.

తుది జట్లు (అంచనా)

భారత్: గిల్ (కెప్టెన్), రోహిత్, విరాట్, శ్రేయాస్, అక్షర్, రాహుల్, నితీశ్, సుందర్/కుల్దీప్, హర్షిత్/ప్రసిద్ధ్, అర్ష్‌దీప్, సిరాజ్.

ఆస్ట్రేలియా: ట్రావిస్ హెడ్, మిచెల్ మార్ష్ (కెప్టెన్), షార్ట్, రెన్షా, క్యారీ, కూపర్, ఓవెన్, స్టార్క్/ఎడ్వర్డ్స్, బార్ట్‌లెట్, జంపా, హాజెల్‌వుడ్/ఎలిస్.

పిచ్

సిడ్నీ వికెట్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండనుంది. ఇక్కడ భారీ స్కోర్లు సాధించిన ఆసీస్ జట్టు తమ ప్రత్యర్థులపై వరుసగా ఆరు వన్డే విజయాలతో దూసుకెళ్తోంది. స్పిన్ కూడా కీలకం కానుంది. వర్ష సూచన లేదు.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	ర.రే
ఆస్ట్రేలియా	6	5	0	1	11	1.704
దక్షిణాఫ్రికా	6	5	1	0	10	0.276
ఇంగ్లండ్	6	4	1	1	9	1.024
భారత్	6	3	3	0	6	0.628
శ్రీలంక	7	1	3	3	5	-1.035
న్యూజిలాండ్	6	1	3	2	4	-0.490
పాకిస్థాన్	7	0	4	3	3	-2.651
బంగ్లాదేశ్	6	1	5	0	2	-0.578

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు; ఫ.తే: ఫలితం తేలనవి; ర.రే: రన్‌రేట్

నేటి మ్యాచ్ మ.3 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో

ఆస్ట్రేలియా x దక్షిణాఫ్రికా



నేటి నుంచి రంజీ రెండో రౌండ్



పుదుచ్చేరి: రంజీ ఎలీట్ గ్రూప్‌లో భాగంగా రెండో రౌండ్ మ్యాచ్‌లు శనివారం నుంచి జరుగబోతున్నాయి. ఇందులో తిలక్ వర్మ కెప్టెన్సీలోని హైదరాబాద్ జట్టు గ్రూప్ 'డి'లోని పుదుచ్చేరితో ఆడనుంది. మొదటి రౌండ్‌లో ఢిల్లీతో ఆడి డ్రా చేసుకుని ఒక్క పాయింట్‌తో ఉంది. అలాగే గ్రూప్ 'ఎ'లో ఉన్న ఆంధ్ర జట్టు బరోడా టీమ్‌తో తలపడబోతుంది. విజయనగరంలో ఈ మ్యాచ్ జరుగనుండగా.. రికీ భుయ్ నేతృత్వంలోని ఆంధ్ర జట్టు ఇప్పటికే యూపీతో ఆడి డ్రా చేసుకుంది. మరోవైపు సౌరాష్ట్ర తరపున ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా, బెంగాల్ నుంచి పేసర్ షమి, ఆకాశ్ దీప్, అభిమన్యు ఈశ్వరన్ బరిలోకి దిగనుండడం ఆసక్తి కలిగించనుంది.

క్వార్టర్స్‌లో లక్ష్య, దీక్ష

ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్



లక్ష్య

చెంగ్డూ: ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత షట్లర్ల హవా సాగుతోంది. శుక్రవారం జరిగిన అండర్-17 ప్రీక్వార్టర్స్‌లో విజయాలు సాధించిన లక్ష్య రాజేశ్, దీక్ష సుధాకర్ క్వార్టర్స్‌లో ప్రవేశించారు. అలాగే అండర్-15లో టాప్ సీడ్ షైనా మణిముత్తు సైతం ప్రీక్వార్టర్స్‌లో గెలిచి ముందంజ వేసింది. ఇక అండర్-17 బాలికల డబుల్స్‌లో అదితి-వృద్ధి, బాలుర డబుల్స్‌లో చరణ్ రామ్-హరికృష్ణ జోడీ, సింగిల్స్‌లో జగ్‌షేర్ సింగ్‌లు క్వార్టర్స్‌లో ప్రవేశించారు.

ఫైనల్లో ముంబై, బెంగళూరు

హైదరాబాద్: ప్రైమ్‌వాలీబాల్ లీగ్ టైటిల్ కోసం ముంబై మిటియోస్, బెంగళూరు టోర్పెడోస్ అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఇక్కడి గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో శుక్రవారం జరిగిన మొదటి సెమీఫైనల్లో ముంబై 15-8, 15-8, 16-14తో గోవా గార్డియన్స్‌పై విజయం సాధించింది. మరో సెమీస్‌లో బెంగళూరు 10-15, 15-11, 15-13, 15-13తో అహ్మదాబాద్ డిఫెండర్స్‌పై నెగ్గింది. ఫైనల్ ఆదివారం జరగనుంది.

వరుణుడి ఖాతాలో 5

లంక-పాక్ మ్యాచ్ వర్షంతో రద్దు
మహిళల వరల్డ్ కప్

కొలంబో: ప్రతిష్ఠాత్మక మహిళల ప్రపంచ కప్‌లో వరుణుడు మరో మ్యాచ్‌ను అడ్డుకున్నాడు. శ్రీలంక-పాకిస్థాన్ మధ్య శుక్రవారం ఇక్కడ జరగాల్సిన ఆ జట్ల ఆఖరి లీగ్ మ్యాచ్ భారీ వర్షంతో అర్ధంతరంగా రద్దయింది. తొలుత మ్యాచ్ మూడు గంటలకుపైగా ఆలస్యంగా మొదలైంది. దాంతో 34 ఓవర్లకు కుదించారు. టాస్ కోల్పోయి పాకిస్థాన్ మొదట బ్యాటింగ్ చేపట్టగా..4.2 ఓవర్ల ఆట సాగిందో లేదో వరుణుడు మరోసారి విజృంభించాడు. ఈసారి ఏమాత్రం తెరిపినివ్వకపోవడంతో పోటీని రద్దు చేస్తూ అంపైర్లు నిర్ణయం తీసుకున్నారు. అప్పటికి పాకిస్థాన్ వికెట్ నష్టపోకుండా 18 పరుగులు చేసింది. ఒమైమా సొహైల్ (9 బ్యాటింగ్), మునీబా అలీ (7 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఇక్కడి ప్రేమదాస స్టేడియంలో ఈ మెగా టోర్నీలో 11 మ్యాచ్‌లు జరగగా..ఐదు వర్షంతో రద్దు కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో ప్రేమదాస స్టేడియంలో మ్యాచ్‌లను ఖరారు చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

శ్రీలంకకు ఖేదం..: శ్రీలంక ఆడిన మ్యాచ్‌ల్లో మూడింటిలో వర్షంతో ఫలితం తేలలేదు. దీంతో సెమీఫైనల్ చేరాలన్న శ్రీలంక జట్టు ఆశలకు బ్రేక్ పడింది. మొత్తం ఏడు మ్యాచ్‌ల్లో మరో మూడింటిలో ఓడిన లంక ఒక మ్యాచ్ నెగ్గింది. ఎనిమిది జట్ల టోర్నమెంట్‌లో ప్రస్తుతం ఐదు పాయింట్లతో శ్రీలంక ఐదో స్థానంలో ఉంది. మరోవైపు ఏడు మ్యాచ్‌ల్లో నాలుగు పరాజయాలు, మూడు ఫలితం తేలని మ్యాచ్‌లతో ఒక్క విజయమూ లేకుండానే పాకిస్థాన్ మహిళలు వెనుదిరిగారు. ఇక శుక్రవారంనాటి మ్యాచ్‌లో అందరి దృష్టి శ్రీలంక కెప్టెన్ చమరి ఆటపట్టుపై నిలిచింది. 35 ఏళ్ల చమరి అధికారికంగా ప్రకటించకపోయినా ఆమెకిదే ఆఖరి వరల్డ్ కప్‌గా భావిస్తున్నారు.

స్వర్ణ పోరుకు హన్సిక, సారిక


నేహా శర్మకు కాంస్యం

నోవీ సాద్ (సెర్బియా): అండర్-23 ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు చెందిన హన్సిక లాంబా (53 కి), సారిక మాలిక్ (59కి.) ఫైనల్‌కు చేరారు. కాగా నేహాశర్మ (57కి), నిష (55కి), పుల్కిత్ (65కి), శ్రిష్టి (68కి) కాంస్య పతకాలు దక్కించుకున్నారు.

ఐపీఓలో పెట్టుబడులకు
బ్యాంకు రుణం

వ్యక్తులకు రూ.25 లక్షల వరకు లోన్

- కొనుగోళ్ల కోసం కంపెనీలకు ఫండింగ్..
- బ్యాంకులకు ఆర్‌బీఐ ముసాయిదా మార్గదర్శకాలు



ముంబై: తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ), మలి విడత పబ్లిక్ ఆఫరింగ్ (ఎఫ్‌పీఓ) లేదా ఎంప్లాయీ స్టాక్ ఆప్షన్ ప్లాన్ (ఈఎస్ఓపీ) ద్వారా షేర్లను కొనుగోలు చేసేందుకు వ్యక్తుల (ఇండివిడ్యువల్స్)కు బ్యాంకులు రుణాలిచ్చేందుకు వీలుగా భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ముసాయిదా నిబంధనలను శుక్రవారం జారీ చేసింది. అలాగే, భారత కంపెనీల వ్యూహాత్మక కొనుగోళ్లు, విలీనాలకు కూడా బ్యాంకులు నిధులు సమకూర్చేందుకూ అవసరమైన ముసాయిదా నిబంధనలను కూడా విడుదల చేసింది. హేతుబద్ధీకరించిన నిబంధనలను 2026 ఏప్రిల్ 1 నుంచి అమలు చేయాలని ఆర్‌బీఐ ప్రతిపాదించింది. తద్వారా వ్యక్తులు.. పబ్లిక్ ఇష్యూల్లో పెట్టుబడులు పెట్టేందుకు, కార్పొరేట్ కంపెనీలు ఇతర సంస్థల్లో వాటాలు కొనుగోలు చేసేందుకు అవసరమైన నిధుల సమీకరణకు అవకాశాలు పెరగనున్నాయి. ఈ ముసాయిదా మార్గదర్శకాలపై నవంబరు 21లోగా అభిప్రాయాలు తెలపాలని సంబంధిత వర్గాలను ఆర్‌బీఐ కోరింది.

కంపెనీల కొనుగోళ్ల ఫండింగ్‌కు మార్గదర్శకాలు

- కంపెనీల కొనుగోళ్ల కోసం అందించే రుణాల మొత్తం బ్యాంకు టియర్-1 క్యాపిటల్‌లో 10 శాతానికి మించకూడదు.
- కొనుగోలు ఒప్పందం విలువలో 70 శాతం వరకు బ్యాంకులు రుణం మంజూరు చేయవచ్చు. మిగతా 30 శాతం కంపెనీయే సమకూర్చుకోవాల్సి ఉంటుంది.
- గత మూడేళ్లుగా లాభాలు ఆర్జిస్తూ, సంతృప్తికరమైన నెట్‌వర్త్ కలిగిన లిస్టెడ్ కంపెనీలకు మాత్రమే రుణాలు ఇవ్వాలి.

సబ్‌స్క్రిప్షన్ విలువలో 75% రుణం: భారతీయ రిజర్వ్ బ్యాంక్ (కమర్షియల్ బ్యాంక్స్- క్యాపిటల్ మార్కెట్ ఎక్స్‌పోజర్) డైరెక్షన్స్, 2025' ప్రకారం.. ఐపీఓ, ఎఫ్‌పీఓ, ఈఎస్ఓపీలో భాగంగా షేర్ల కొనుగోలుకు బ్యాంకులు.. వ్యక్తికి రూ.25 లక్షల వరకు రుణం మంజూరు చేయవచ్చు. ప్రస్తుతం ఈ పరిమితి రూ.10 లక్షలుగా ఉంది. అయితే, పబ్లిక్ ఆఫరింగ్ లేదా ఈఎస్ఓపీ సబ్‌స్క్రిప్షన్ విలువలో బ్యాంకుల రుణ వాటా 75 శాతానికి మించకూడదని, మిగతా 25 శాతం రుణగ్రహీత సమకూర్చుకోవాలని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. అలాగే, పబ్లిక్ ఆఫరింగ్స్, ఈఎస్ఓపీలో భాగంగా రుణగ్రహీతకు కేటాయించబడే షేర్లపై బ్యాంకులకు ధరావతు హక్కు కల్పించాలని, ఆ షేర్లను కేటాయించాక రుణగ్రహీత వాటిని బ్యాంకు వద్ద తనఖా పెట్టాల్సి ఉంటుదని తెలిపింది.

సెక్యూరిటీల తనఖాపై రూ.కోటి వరకు రుణం: ప్రభుత్వ సెక్యూరిటీలు, మ్యూచువల్ ఫండ్లు, ప్రభుత్వ బాండ్లు, లిస్టెడ్ కంపెనీల షేర్లు, లిస్టెడ్ కన్వర్టబుల్ డెట్ సెక్యూరిటీలు, అధిక రేటింగ్ కలిగిన రుణ పత్రాల తనఖాపై వ్యక్తులకు బ్యాంకులు రూ.కోటి వరకు రుణం మంజూరు చేయవచ్చని ఆర్‌బీఐ ప్రతిపాదించింది. ప్రస్తుతం ఈ పరిమితి రూ.20 లక్షలుగా ఉంది.

తిరుపతిలో ఐటీసీ హోటల్

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి, ఒడిశాలోని పూరీలో రెండు ప్రీమియం స్టార్ హోటల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఐటీసీ హోటల్స్ ప్రకటించింది. 'ఎపిక్ కలెక్షన్-మెంబర్ ఐటీసీ హోటల్స్' అనే కొత్త బ్రాండ్ పేరుతో ఈ రెండు ప్రీమియం హోటల్స్ నిర్మిస్తున్నట్లు తెలిపింది. ఈ బ్రాండ్ పేరుతో రానున్న సంవత్సరాల్లో 1,000 గదుల హోటల్స్ నిర్మించాలని యోచిస్తున్నట్టు తెలిపింది. కాగా సెప్టెంబరు త్రైమాసికంలో రూ.839.48 కోట్ల ఆదాయంపై రూ.133.29 కోట్ల నికర లాభం ఆర్జించింది.

బిజినెస్

హైదరాబాద్‌లో స్టార్‌లింక్ గేట్‌వే ఎర్త్ స్టేషన్

న్యూఢిల్లీ: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ నేతృత్వంలోని స్టార్‌లింక్ మన దేశంలో త్వరలో తన ఉపగ్రహ ఆధారిత కమ్యూనికేషన్ (శాట్‌కామ్) సేవలు ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. దీనికి సంబంధించి కంపెనీ త్వరలోనే ప్రయోగాత్మక పరీక్షలకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా హైదరాబాద్, నోయిడా, ముంబై, కోల్‌కతా, లఖ్‌నవూ వంటి నగరాల్లో తన గేట్‌వే ఎర్త్ స్టేషన్లు ఏర్పాటు చేయనుంది. ఈ ప్రయోగాత్మక పరీక్షలకు అవసరమైన స్పెక్ట్రమ్‌ను కేంద్ర ప్రభుత్వం కంపెనీకి తాత్కాలిక ప్రాతిపదికన ఇప్పటికే కేటాయించింది.

కఠినమైన సెక్యూరిటీ నిబంధనలు

స్టార్‌లింక్ ప్రారంభించే ఈ శాట్‌కామ్ సేవలకు ప్రభుత్వం కఠినమైన భద్రతా నిబంధనలు విధించింది. దేశ విద్రోహ శక్తులు ఈ సేవలను దుర్వినియోగం చేయకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నట్టు అధికార వర్గాలు చెప్పాయి. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నుంచి క్లియరెన్స్ వచ్చే వరకు ఈ గేట్‌వే ఎర్త్ స్టేషన్ల నిర్వహణకు విదేశీయులను ఎవరినీ అనుమతించేది లేదని స్పష్టం చేసింది. అప్పటి వరకు ఈ స్టేషన్ల నిర్వహణ భారతీయుల చేతుల్లోనే ఉండాలని ఆదేశించింది.

డాక్టర్ రెడ్డీస్ లాభం
రూ.1,437 కోట్లు

- ఆదాయంలో 10 శాతం వృద్ధి
- రూ.2,750 కోట్ల మిగులు నిధులు
- కొనుగోళ్లు, లైసెన్సింగ్ ఒప్పందాలపై దృష్టి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. జూలై-సెప్టెంబరు త్రైమాసికానికి గాను కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం 14.5 శాతం వృద్ధి చెంది రూ.1,437 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో లాభం రూ.1,255 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం రెవెన్యూ కూడా 9.8 శాతం వృద్ధితో రూ.8,016 కోట్ల నుంచి రూ.8,805 కోట్లకు చేరుకుంది. సెప్టెంబరు త్రైమాసికంలో బ్రాండెడ్ మార్కెట్లలో పనితీరు మెరుగ్గా ఉండటంతో పాటు నికోటిన్ రీప్లేస్‌మెంట్ థెరపీ (ఎన్ఆర్‌టీ) విభాగం నిలకడగా కొనసాగటం కలిసి వచ్చిందని డాక్టర్ రెడ్డీస్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్ఓ) ఎంవీ నరసింహం అన్నారు.

అమెరికా ఆదాయాల్లో 13% క్షీణత: సెప్టెంబరు త్రైమాసికంలో అమెరికా మార్కెట్ నుంచి ఆదాయాలు 13 శాతం తగ్గినట్లు డాక్టర్ రెడ్డీస్ వెల్లడించింది. ఈ కాలంలో అమెరికా ఆదాయాలు రూ.3,728 కోట్ల నుంచి రూ.3,241 కోట్లకు తగ్గినట్లు పేర్కొంది. లెనాలీడొమైడ్ సహా కొన్ని కీలక ఉత్పత్తుల ధరలు గణనీయంగా తగ్గటమే ఇందుకు కారణమని తెలిపింది. అయితే కొత్త ఉత్పత్తుల విడుదల పెరగటం, విదేశీ మారక ఆదాయం సానుకూలంగా ఉండటం కొంత కలిసి వచ్చిందని పేర్కొంది.



యూరప్, భారత్ ఆదాయాల్లో వృద్ధి: ఎన్ఆర్‌టీ పోర్టుఫోలియో కొనుగోలుతో యూరప్ మార్కెట్ల నుంచి ఆదాయాలు ఏకంగా 138 శాతం వృద్ధితో రూ.577 కోట్ల నుంచి రూ.1,376 కోట్లకు చేరుకున్నట్లు సీఎఫ్ఓ నరసింహం తెలిపారు. భారత మార్కెట్ ఆదాయాలు కూడా 13 శాతం వృద్ధితో రూ.1,397 కోట్ల నుంచి రూ.1,578 కోట్లకు పెరిగినట్లు పేర్కొన్నారు. వర్ధమాన మార్కెట్ల ఆదాయాలు కూడా రూ.1,455 కోట్ల నుంచి రూ.1,654 కోట్లకు పెరిగాయి. కాగా కంపెనీ వద్ద రూ.2,750 కోట్ల మిగులు నిధులు ఉన్నాయని పేర్కొంది. అలాగే కొనుగోళ్లు, లైసెన్సింగ్ ఒప్పందాలపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించనున్నట్లు తెలిపింది.

సుంకాల ప్రభావం లేదు

ఫార్మాపై అమెరికా సుంకాల ప్రభావం ప్రస్తుతానికైతే ఏమాత్రం లేదని సీఈఓ ఎరెజ్ ఇజ్రాయెలీ అన్నారు. అంతేకాకుండా సుంకాలకు సంబంధించి ఎలాంటి మార్గదర్శకాలు కూడా అందుకోలేదని ఆయన పేర్కొన్నారు. అయితే బయోలాజిక్స్‌పై ఈ ప్రభావం ఎంత ఉంటుందనే విషయాన్ని మాత్రం పరిశీలించాల్సి ఉంటుందని ఇజ్రాయెలీ తెలిపారు. కాగా వచ్చే ఏడాది పేటెంట్ గడువు తీరనున్న మధుమేహం, ఊబకాయం చికిత్సలో వినియోగించే సెమాగ్లూటైడ్ ఔషధాన్ని భారత్ సహా పలు మార్కెట్లలోకి విడుదల చేయనున్నట్లు ఆయన చెప్పారు.

ఆరు రోజుల ర్యాలీకి బ్రేక్

సెన్సెక్స్ 344 పాయింట్లు పతనం

ముంబై: స్టాక్ మార్కెట్లో ఆరు రోజుల వరుస ర్యాలీకి తెరపడింది. ఎఫ్ఎంసీజీ, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలతో పాటు విదేశీ సంస్థాగత పెట్టుబడుల ఉపసంహరణ కారణంగా వారాంతం ట్రేడింగ్‌లో ప్రామాణిక సూచీలు నష్టాలు చవిచూశాయి. ఒక దశలో 599 పాయింట్లు పతనమై 84,000 స్థాయిని కోల్పోయిన సెన్సెక్స్.. చివరికి 344.52 పాయింట్ల నష్టంతో 84,211.88 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 96.25 పాయింట్లు తగ్గి 25,795.15 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని30 నమోదిత కంపెనీల్లో 20 నష్టపోయాయి.

29 నుంచి ఎంటీఆర్ ఐపీఓ

ఎంటీఆర్, ఈస్టర్న్ మసాలా బ్రాండ్ల యాజమాన్య సంస్థ ఓర్క్లా ఇండియా రూ.1,667 కోట్ల తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ఈ నెల 29న ప్రారంభమై 31న ముగియనుంది. ఈ పబ్లిక్ ఇష్యూలో విక్రయించనున్న షేర్ల ధరల శ్రేణిని కంపెనీ రూ.695-730గా నిర్ణయించింది. ఐపీఓలో భాగంగా కంపెనీ ప్రస్తుత ప్రమోటర్లు, వాటాదారులకు చెందిన 2.28 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిలో విక్రయించనుంది.

మిడ్‌వెస్ట్ షేరు 7 శాతం అప్

తెలంగాణకు చెందిన గ్రానైట్ కంపెనీ మిడ్‌వెస్ట్ లిమిటెడ్ తన షేర్లను శుక్రవారం స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.1,065తో పోలిస్తే, బీఎస్ఈలో 9.39 శాతం లాభంతో రూ.1,165.10 వద్ద ట్రేడింగ్ ఆరంభించింది. ఒకదశలో 11.69 శాతం ఎగబాకి రూ.1,189.50 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. తొలిరోజు ట్రేడింగ్ ముగిసే సరికి కంపెనీ షేరు 7.14 శాతం లాభంతో రూ.1,141.10 వద్ద స్థిరపడింది.

ఆర్ఎన్ఐటీ ఏఐ షేర్లు బీఎస్ఈలో నమోదు

కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత పరిష్కారాలు అందిస్తున్న హైదరాబాద్ సంస్థ ఆర్ఎన్ఐటీ ఏఐ సొల్యూషన్స్ తన షేర్లను శుక్రవారం బీఎస్ఈలో నమోదు చేసింది. దేశీయ స్టాక్ మార్కెట్లో లిస్టయిన తొలి ఏఐ ఆధారిత గవర్నెన్స్ కంపెనీ ఇదే. తొలిరోజు ట్రేడింగ్ ముగిసే సరికి కంపెనీ షేరు ధర 5 శాతం నష్టపోయి రూ.52.25 వద్ద స్థిరపడింది. ఆర్ఎన్ఐటీ ఏఐ సొల్యూషన్స్ రివర్స్ మెర్జర్ ద్వారా బీఎస్ఈ ప్రధాన ట్రేడింగ్ వేదికపై లిస్టయింది. 2023లో ఆర్ఎన్ఐటీ సొల్యూషన్స్ అండ్ సర్వీసెస్.. ఆటోపాల్ ఇండస్ట్రీస్‌తో విలీనమైంది. అనంతరం, కంపెనీ పేరును ఆర్ఎన్ఐటీ ఏఐ సొల్యూషన్స్‌గా మార్చారు. ఆ తర్వాత షేర్ల మార్పిడి ప్రక్రియను కూడా పూర్తి చేసి మార్కెట్లో మళ్లీ లిస్టయింది.

- హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఇండిగ్రేటర్స్.. చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా విశాల్ మణి నియమితులయ్యారు. జీసీసీ, సాఫ్ట్‌వేర్ ఆర్ అండ్ డీ, కన్సల్టేటివ్ సేల్స్, ఎంటర్‌ప్రైజ్ సొల్యూషన్స్‌లో విశాల్‌కు రెండు దశాబ్దాలకు పైగా అనుభవం ఉంది. విశాల్ ఇప్పటి వరకు నెమెట్చెక్ ఇండియా ఎండీగా పనిచేశారు. కాగా ఇండిగ్రేటర్స్.. ఐటీ, జీసీసీ అడ్వైజరీ విభాగా ల్లో కార్యకలాపాలు సాగిస్తోంది.
- హ్యుండయ్ మోటార్ ఇండియా.. సరికొత్త కాంపాక్ట్ ఎస్‌యూవీ వెన్యూ మార్కెట్లోకి తీసుకువస్తోంది. అర్బన్ మొబిలిటీ అవసరాలకు తగ్గట్టుగా కొత్త రూపం, టెక్నాలజీలతో దీన్ని రూపొందించింది. పెట్రోల్, డీజిల్ వేరియంట్లలో అందుబాటులో ఉండనున్న ఈ కార్ల బుకింగ్స్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. కస్టమర్లు.. హ్యుండయ్ మోటార్ డీలర్‌షిప్ లేదా కంపెనీ వెబ్‌సైట్ ద్వారా రూ.25,000 చెల్లించి బుకింగ్ చేసుకోవచ్చని తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



25వ తేదీ			
హైదరాబాద్	550	విజయవాడ	560
వరంగల్	552	గోదావరి	560
చిత్తూరు	583	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — **వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



హైదరాబాద్	112	విజయవాడ	121
వరంగల్	112	గుంటూరు	121
కరీంనగర్	112	ఒంగోలు	121
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	104
కర్నూలు	112	నెల్లూరు	109
విశాఖపట్నం	119	అనంతపురం	109
గోదావరి	121		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,25,460 ▲	1,15,000 ▲	1,71,000 ▼
విజయవాడ	1,25,500 ▼	1,15,000 ▼	1,52,500 ▼
విశాఖపట్నం	1,26,300 ▼	1,15,000 ▲	1,70,000 ▼
రాజమండ్రి	1,24,360 ▼	1,14,000 ▼	1,53,000 ▼
ప్రొద్దుటూరు	1,24,200 ▼	1,14,260 ▼	1,53,000 ▼
ముంబై	1,21,518 ▼	1,11,310 ▼	1,47,033 ▼

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: **N.Rahul Kumar.** Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.